S TV SAMAYAM

epaper.samayamdaily.net APTEL/2006/18267

# సమయం

మన గొంతుక.. మన పత్రిక


తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

ఫోన్ నెం : 99483 13985/ 89789 80131

సంపుటి: 20 | సంచిక: 157 | ఎడిటర్ : విక్రం కుమార్ | శనివారం 11 ఏప్రిల్ 2026 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 14 | వెల:రూ.10 |

# అన్నా.. నన్ను దేవుడే పంపిండు



## మీతో కలిసి పని చేయమని చెప్పిండు

ఎర్రవల్లిలో కేసీఆర్‌తో జీవన్ రెడ్డి భేటీ

ఆప్యాయంగా ఆలింగనం చేసుకుని పలుకరించిన కేసీఆర్

'అన్నా.. నన్ను దేవుడే పంపిండు. మీతో కలిసి పని చేయమని' అంటూ కేసీఆర్‌ను మాజీ మంత్రి టి. జీవన్ రెడ్డి ప్యాయంగా ఆలింగనం చేసుకున్నారు.

**గజ్వేల్, ఏప్రిల్ 10:** బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి సీఎం కేసీఆర్‌ను మాజీ మంత్రి జీవన్ రెడ్డి శుక్రవారం మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా జీవన్‌రెడ్డి కేసీఆర్‌ను పలకరిస్తూ భావోద్వేగానికి లోనయ్యారు. 'అన్నా.. నన్ను దేవుడే పంపిండు. మీతో కలిసి పని చేయమని' అంటూ కేసీఆర్‌ను ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్నారు. ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి వైఖరిని నిరసిస్తూ కాంగ్రెస్‌కు రాజీనామా చేసిన జీవన్ రెడ్డి , కుమారులు, జగిత్యాల జడ్పీ మాజీ చైర్ పర్సన్ వసంత సురేశ్ దంపతులు కేసీఆర్‌ను కలిసినవారిలో ఉన్నారు. ఈ సందర్భంగా ఇరువురు పలు అంశాలపై చర్చించారు.

మిగతా 2 లో



## పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలపై

# కాంగ్రెస్ ఫోకస్

మహిళా బిల్లు, డిలిమిటేషన్ అంశాలపై చర్చ

ఈ రెండు అంశాలపై కాంగ్రెస్ సుదీర్ఘ కసరత్తు

రాజకీయ లబ్దికోసంమే ప్రత్యేక సమావేశాలన్న ఖర్గే

తెలంగాణలో డీ లిమిటేషన్‌పై రేవంత్ నివేదిక సమర్పణ

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 10:** జాతీయ రాజకీయాల్లో రాబోయే మార్పులు, కేంద్ర ప్రభుత్వ వ్యూహాలను తిప్పికొట్టే దిశగా కాంగ్రెస్ అగ్రనాయకత్వం సమాలోచనలు చేసింది. ముఖ్యంగా పార్లమెంటు ప్రత్యేక సమావేశంలో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. మహిళా బిల్లు, సీట్లు పెంపుదల వంటి రెండు అంశాలపై వ్యూహాత్మకంగా ఉండాలని నిర్ణయించారు. ఢిల్లీ ఇందిరాభవన్‌లో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీసమావేశం అత్యంత

మిగతా 2 లో

# రేపే ఇంటర్ రిజల్ట్!

- ఒకేసారి ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాలు..
- 9 లక్షల మంది నిరీక్షణకు తెర

2



## పొన్నాల ఎక్కడున్నారో తెలుసా?

జీవన్ రెడ్డి వ్యాఖ్యలపై రేవంత్ కౌంటర్!

బీఆర్ఎస్‌లో సీనియర్లకు జరిగిన అవమానాలు గుర్తులేవా?

ఢిల్లీ వేదికగా సీఎం ఘాటు వ్యాఖ్యలు

పార్టీ వీడిన నేతల జాబితాను ఏకరువు పెట్టిన రేవంత్ రెడ్డి..

విమర్శలను లైట్ తీసుకున్న ముఖ్యమంత్రి

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 10:** కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి జీవన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై సీఎం రేవంత్ రెడ్డి తనదైన శైలిలో స్పందించారు. కాంగ్రెస్‌లో సీనియర్లకు అన్యాయం జరుగుతోందన్న విమర్శలను తిప్పికొడుతూనే, గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో కీలక నేతలకు ఎదురైన పరాభావాలను ఆయన గుర్తుచేశారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం, శుక్రవారం మీడియా ప్రతినిధులతో జరిగిన చిట్‌చాట్‌లో ఈ అంశంపై

మిగతా 2 లో





## హెచ్ఐవీ రక్తం ఎక్కించిన ఘటన

ఆత్మహత్య చేసుకున్న యువతి

.. వివరాలు 2లో



## కేశాలు సరెండర్

మొత్తం 42 మంది ఆయుధాలతో లొంగుబాటు

వారికి పునరావాసం కల్పిస్తామన్న డీజీపీ శివధర్ రెడ్డి

.. వివరాలు 2లో

# ఫ్లై91



హైదరాబాద్ - విజయవాడ మధ్య విమాన సర్వీసు



ప్రారంభించిన కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

సామాన్యుడికి చేరువగా ఆకాశ ప్రయాణం..

గంటలోపే గమ్యస్థానానికి..

2

## రాష్ట్రపతి, ప్రధానితో గవర్నర్ భేటీ



3



2

# కేబినేట్ ఎజెండా లీక్

**అమరావతి, ఏప్రిల్ 10 :** సీఎం చంద్రబాబు నాయుడు అధ్యక్షతన సచివాలయంలో జరిగిన కేబినెట్ సమావేశం దాదాపు 3 గంట లకు పైగా సాగింది. ఈ సమావేశంలో.. అమరావతికి ఆమోదంపై కేంద్రానికి, ప్రధాని మోడీకి ప్రత్యేక ధన్యవాదాలు తెలపడంతో పాటు.. కీలక నిర్ణయాలకు ఆమోద ముద్ర వేసింది కేబినెట్.. అయితే, ఎజెండా అంశాలపై చర్చ ముగిసిన తర్వాత.. మంత్రులతో ప్రత్యేకంగా సమావేశమైన సీఎం చంద్రబాబు..

- కీలక అంశాలూ ముందే వెల్లడి
- గతంలో ఇలా జరిగితే ఎన్టీఆర్ కేబినేట్ రద్దు చేశారు
- సమాచారం లీక్ అయితే అందుకు మంత్రులదే బాధ్యత
- కేబినేట్ భేటీలో సిఎం చంద్రబాబు సీరియస్ వార్నింగ్
- జలధార తదితర పథకాలపై ప్రచారం కల్పించాలని ఆదేశం



## ఫ్లై 91 విమాన సర్వీసు ప్రారంభం

**శ్రీకాకుళం/విజయవాడ, ఏప్రిల్10:** హైదరాబాద్ – విజయవాడ మధ్య ప్రయాణించే వారికి శుభవార్త. ప్రాంతీయ విమానయాన సంస్థ ఫ్లై 91 తన నూతన సర్వీసులను తెలుగు రాష్ట్రాల మధ్య అధికారికంగా ప్రారంభించింది. రెండు తెలుగు రాష్ట్రాల రాజధానుల మధ్య ప్రయాణ దూరాన్ని తగ్గించడంతో పాటు, సామాన్యులకు విమాన ప్రయాణాన్ని చేరువ చేసే లక్ష్యంతో ఫ్లై 91 సంస్థ తన కార్యకలాపాలను విస్తరించింది. కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ఈ నూతన సర్వీసును శ్రీకాకుళం నుంచి వర్చువల్‌గా పచ్చజెండా ఊపి ఈ సర్వీసును శుక్రవారం ప్రారంభించారు. తక్కువ ధరలో వేగవంతమైన ప్రయాణాన్ని అందించడమే ఈ సంస్థ ప్రధాన ఉద్దేశ్యం. విమాన సర్వీసును ప్రారంభించిన అనంతరం కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా టైర్–2, టైర్–3 నగరాలను అనుసంధానించేందుకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ప్రాంతీయ కనెక్టివిటీని పెంచడం ద్వారా సామాన్యులు కూడా విమానం ఎక్కాలన్న ప్రధానమంత్రి కల నిజమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. విజయవాడ – హైదరాబాద్ మధ్య రద్దీ దృష్ట్యా ఈ సర్వీస్ ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.రోడ్డు మార్గంలో సుమారు 5 నుంచి 6 గంటల సమయం పట్టే ప్రయాణం, విమానం ద్వారా కేవలం 50 నిమిషాల నుంచి గంటలో పూర్తవుతుంది. హైదరాబాద్‌లో ఐటీ రంగం, విజయవాడలో వ్యాపార రంగాలు బలంగా ఉన్న నేపథ్యంలో, ఈ విమాన సర్వీస్ వ్యాపారవేత్తలకు వరంలా మారనుంది. ఫ్లై 91 సంస్థ తన టికెట్ ధరలను ఇతర విమాన సంస్థలతో పోలిస్తే అందుబాటులో ఉంచేలా ప్రణాళికలు చేస్తోంది. ఈ సంస్థ గోవా కేంద్రంగా పనిచేస్తున్న ఒక ప్రాంతీయ విమానయాన సంస్థ. ఇది ప్రధానంగా తక్కువ దూరం ఉండే నగరాల మధ్య సర్వీసులను నడుపుతోంది. తెలుగు రాష్ట్రాల్లో తమ నెట్‌వర్క్‌ను పెంచుకోవడం ద్వారా ప్రయాణికులకు మరిన్నిసౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయి. ఈ కొత్త సర్వీసు అందుబాటులోకి రావడం వల్ల అటు విజయవాడ ప్రాంత ప్రజలకు, ఇటు హైదరాబాద్ ప్రజలకు రవాణా పరంగా మరిన్ని వెసులుబాట్లు కలగనున్నాయి. ఈ విమాన సర్వీసు అందుబాటులోకి రావడం వల్ల రోడ్డు ప్రయాణంపై ఒత్తిడి తగ్గనుందని భావిస్తున్నారు.

## రేపే ఇంటర్ రిజల్ట్స్!

**ఒకేసారి ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాలు..**

**హైదరాబాద్, ఏప్రిల్ 10 :** తెలంగాణ ఇంటర్మీడియట్ విద్యార్థులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఫలితాల సందడి మొదలైంది. ఈనెల 12న (ఆదివారం) ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాలను విడుదల చేసేందుకు తెలంగాణ ఇంటర్మీడియట్ బోర్డు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. తొలుత ఏప్రిల్ 11న ఫలితాలు రావచ్చని భావించినప్పటికీ, సాంకేతిక తనిఖీలు మరియు తుది ఏర్పాట్ల నేపథ్యంలో ఏప్రిల్ 12ను ముహూర్తంగా ఖరారు చేశారు. ఈ ఏడాది ఫిబ్రవరి 26 నుంచి మార్చి 18 వరకు జరిగిన ఇంటర్ పరీక్షలకు రాష్ట్రవ్యాప్తంగా సుమారు 9 లక్షలకు పైగా విద్యార్థులు హాజరయ్యారు. కాగా, తొలుత ఏప్రిల్ 11న ఫలితాలు రావచ్చని భావించినప్పటికీ, తుది ఏర్పాట్ల నేపథ్యంలో ఏప్రిల్ 12న ఫలితాలను ప్రకటించనున్నట్లు అధికారికంగా ప్రకటించింది. ఫలితాలు విడుదలైన వెంటనే విద్యార్థులు బోర్డు అధికారిక వెబ్‌సైట్ల(స్త్రవిఎఆవ.ఎస్త్రస్త్ర.స్త్రశీజ.ఱఅ)తో పాటు మొబైల్ యాప్స్ ద్వారా తమ మార్కులను తెలుసుకోవచ్చు. ఫలితాల్లో ఏదైనా తేడా ఉంటే రీ–కౌంటింగ్ లేదా రీ–వెరిఫికేషన్ కోసం దరఖాస్తు చేసుకునేందుకు బోర్డు ప్రత్యేకంగా గడువు ఇవ్వనుంది. ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం జూన్ 1 నుంచి జూనియర్ కళాశాలలు ప్రారంభం కానున్న నేపథ్యంలో, ఈసారి రికార్డు స్థాయిలో వేగంగా ఫలితాలను వెల్లడిస్తుండటం విశేషం.

## హెచ్‌ఐవీ రక్తం ఎక్కించిన ఘటన

**ఆత్మహత్య చేసుకున్న యువతి**

**హైదరాబాద్, ఏప్రిల్ 10:** ప్రేమించిన అమ్మాయికి హెచ్‌ఐవీ రక్తం ఎక్కించిన ఘటనలో సదరు యువతి రమణి(23) ఆత్మహత్య చేసుకుంది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. మేడ్చల్ జిల్లా అన్నోజిగూడ రాజీవ్ గృహకల్పలోని తమ ఇంట్లో రమణి ఆత్మహత్యకు పాల్పడింది. పోచారం ఐటీ కారిడార్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఈ ఘటన తెలుగు రాష్ట్రాల్లో సంచలనంగా మారింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన రమణి.. ఎదులాబాద్‌లోని ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతోంది. అయితే, సమీప బంధువైన మనోహర్‌తో ఆమెకు నిశ్చితార్థం చేశారు కుటుంబసభ్యులు. పెళ్లికి అంతా సిద్ధమైన తర్వాత వైద్య పరీక్షల్లో అతనికి ఎయిడ్స్ ఉందని తేలింది. దీంతో యువతి కుటుంబసభ్యులు మనోహర్‌తో పెళ్లికి నిరాకరించారు. ఇది మనసులో పెట్టుకున్న నిందితుడు తనను వివాహం చేసుకోవాలని రమణిని పలుమార్లు బలవంతం చేశాడు. ఆమె ఒప్పుకోక పోవడంతో ఈ ఏడాది మార్చి 11న ఇంట్లో యువతి ఒంటరిగా ఉన్న సమయంలో వచ్చి బలవంతంగా హెచ్‌ఐవీ రక్తాన్ని ఎక్కించాడు. అనంతరం మనోహర్ అక్కడ్నుంచి పారిపోయాడు. బాధిత యువతి విషయాన్ని కుటుంబసభ్యులకు చెప్పడంతో ఈ ఘటన సంచలనంగా మారింది. రమణి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుడు మనోహర్‌ని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అయితే, ఈ ఉదంతం మొత్తాన్ని అవమానకరంగా భావించిన యువతి శుక్రవారం మధ్యాహ్నం ఆత్మహత్య చేసుకుని ప్రాణాలు తీసుకుంది.

## కేబుల్ జర్నలిస్టులకు అక్రిడేషన్లు

**వెంటనే దరఖాస్తు చేసుకోవాలన్న కమిషనర్**



**హైదరాబాద్, ఏప్రిల్ 10:** కేబుల్ న్యూస్ ఛానల్ జర్నలిస్టులు రాష్ట్ర,జిల్లా స్థాయి అక్రిడిటేషన్ కార్డులు పొందటానికి వెంటనే దరఖాస్తు చేసుకోవాలని సమాచార మరియు పౌర సంబంధాల శాఖ కమిషనర్ సి హెచ్ ప్రియాంక ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ నగర కేంద్రంగా స్టూడియోలు కలిగి, స్థానికంగా, జిల్లాలలో ప్రసారాలు అందించే చానళ్ళు రాష్ట్ర,జిల్లా స్థాయిలో కార్డులు పొందటానికి, జిల్లా స్థాయిలో స్టూడియోలు కలిగిన వారు ఆయా జిల్లాల్లో కార్డులు పొందటానికి నేరుగా ఈ నెల 17 వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు. దరఖాస్తులో ఛానల్ పేరు మరియు స్టూడియో అడ్రస్ తో పాటు, ఎమ్ ఐ బి సర్టిఫికెట్, లేబర్ లైసెన్స్, ఎం ఎస్ ఓ లతో చేసుకున్న ఛానల్ ప్లేస్మెంట్ అగ్రిమెంట్ల కాపీలను జతచేసి దరఖాస్తు చేసుకోవాలని స్పష్టం చేశారు.అర్హత గల ఛానళ్లకు రాష్ట్ర మరియు జిల్లా స్థాయిలో అక్రిడేషన్స్ జారీ చేయబడతాయని వివరించారు.

# పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలపై కాంగ్రెస్ ఫోకస్

మొదటి పేజీ తరువాయి

ప్రాధాన్యం సంతరించుకుంది. కేంద్ర ప్రభుత్వం త్వరలో నిర్వహించనున్న పార్లమెంటు ప్రత్యేక సమావేశాల నేపథ్యంలో ప్రధాన ప్రతిపక్షంగా అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించేందుకు ఈ భేటీని ఏర్పాటు చేసినట్లు సమాచారం. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన ఈ కీలక సమావేశం ప్రారంభమైంది. ఈ భేటీకి కాంగ్రెస్ పార్టీకి చెందిన అగ్రనేతలు, వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరయ్యారు. అనారోగ్య కారణాల దృష్ట్యా సోనియా గాంధీ, సీనియర్ నేత పి. చిదంబరం వర్చువల్‌గా పాల్గొన్నారు. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, కేసీ వేణుగోపాల్, జైరాం రమేశ్, సల్మాన్ ఖుర్షీద్, అంబికా సోనీ, సచిన్ పైలట్, భూపేశ్ బగేల్ తదితరులు ప్రత్యక్షంగా హాజరయ్యారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, కర్ణాటక సీఎం సిద్ధరామయ్య, హిమాచల్ ప్రదేశ్ సీఎం సుఖ్వీందర్ సింగ్ సుక్కు ఈ సమావేశంలో పాల్గొని తమ రాష్ట్రాల నివేదికలను సమర్పించారు. కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలను ప్రకటించిన నేపథ్యంలో కాంగ్రెస్ ప్రధానంగా ఈ క్రింది అంశాలపై తన వాణిని వినిపించాలని నిర్ణయించింది. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లుపై కాంగ్రెస్ పార్టీ స్పష్టమైన వైఖరిని ఖరారు చేయనుంది. ఓబీసీ మహిళలకు ఉప కోటా కల్పించాలనే డిమాండ్‌పై కూడా చర్చించారు. 2026 తర్వాత జరగనున్న నియోజకవర్గాల పునర్విభజన వల్ల దక్షిణాది రాష్ట్రాలకు జరిగే అన్యాయంపై సీఎంలు రేవంత్ రెడ్డి, సిద్ధరామయ్య తమ వాదనలు వినిపించారు. అంతర్జాతీయంగా నెలకొన్న ఉద్రిక్తతలు, భారతదేశంపై వాటి ప్రభావం, భారత్ అనుసరిస్తున్న విదేశాంగ విధానంపై చర్చించారు. కేవలం మూడు రోజుల



పాటు జరగనున్న పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వం తీసుకురాబోయే బిల్లులను ఎలా అడ్డుకోవాలి లేదా చర్చలో ఎలా పైచేయి సాధించాలనే అంశంపై సభ్యులకు కాంగ్రెస్ అగ్రనేతలు దిశానిర్దేశం చేశారు. రాబోయే సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని నరేంద్రమోదీ ప్రభుత్వం అనూహ్యంగా ప్రత్యేక సమావేశాలను పిలవడంతో ఈ అచిఅ భేటీకి ప్రాధాన్యం సంతరించుకుంది. ముఖ్యంగా తెలంగాణ వంటి రాష్ట్రాల్లో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, పార్టీ బలోపేతంపై సీఎం రేవంత్‌రెడ్డి సీడబ్ల్యూసీ సమావేశంలో కీలక ప్రసంగం చేసే అవకాశం ఉంది. సీడబ్ల్యూసీ సమావేశంలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలు ఎన్నికల ప్రయోజనాల కోసమేనని చెప్పారు. ఇప్పటివరకు కేంద్ర ప్రభుత్వం నుంచి అధికారికంగా ఎటువంటి ప్రతిపాదన కాంగ్రెస్ ముందుకు రాలేదని అన్నారు. మహిళా రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో జరిగిన సీడబ్ల్యూసీ సమావేశంలోనే మహిళా రిజర్వేషన్లపై స్పష్టతని ఇచ్చామని, కేంద్రాన్ని డిమాండ్ కూడా చేశామని ప్రస్తావించారు. వెస్ట్ బెంగాల్, తమిళనాడు ఎన్నికలు జరుగుతున్న వేళ హఠాత్తుగా మహిళా రిజర్వేషన్ల బిల్లు సవరణ , పునర్విభజన చట్టం సవరణ బిల్లులను తెరపైకి తీసుకువచ్చారని విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికలు పూర్తయ్యాక అఖిలపక్ష సమావేశం పెట్టాలని పార్లమెంటులో ప్రతిపక్ష పార్టీలన్నీ కోరాయని గుర్తుచేశారు. కేంద్ర ప్రభుత్వం తమ ప్రయోజనాల కోసం ప్రయత్నం చేస్తుందని మల్లికార్జున ఖర్గే పేర్కొన్నారు.

# పొన్నాల ఎక్కడున్నారో తెలుసా?

మొదటి పేజీ తరువాయి

ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. జీవన్ రెడ్డి తనపై చేసిన వ్యక్తిగత విమర్శలకు పెద్దగా ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం లేదని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. “జీవన్ రెడ్డి వ్యాఖ్యలపై నేను ప్రత్యేకంగా స్పందించను. కాంగ్రెస్ ఎప్పుడూ తన నేతలను గౌరవిస్తుంది. కానీ కొందరు కావాలని చేస్తున్న విమర్శలకు కాలమే సమాధానం చెబుతుంది” అని ఆయన వ్యాఖ్యానించారు. సీనియర్లకు అవమానం జరుగుతోందని అంటున్న వారు, గతంలో బీఆర్ఎస్ నుంచి సీనియర్ నేతలు ఎందుకు బయటకు వచ్చారో ఒకసారి ఆలోచించాలని రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. మాజీ పీసీసీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్య బీఆర్ఎస్‌లో చేరాక ఇప్పుడు ఎక్కడున్నారో, ఆయనకు అక్కడ దక్కిన గౌరవం ఎంతో అందరికీ కనిపిస్తూనే ఉందని ఎద్దేవా చేశారు. ఒకప్పుడు పార్టీ కోసం రక్తం చిందించిన ఆలె నరేంద్ర, విజయశాంతి, ఈటల రాజేందర్ వంటి నేతలు బీఆర్ఎస్‌ను ఎందుకు వీడాల్సి వచ్చింది? అక్కడ వారికి జరిగిన అవమానం ఏంటో తెలంగాణ సమాజానికి తెలుసని సీఎం అన్నారు. బీఆర్ఎస్ హయాంలో సీనియర్లను ఏ విధంగా అణిచివేశారో గుర్తులేదా? అని ప్రశ్నించిన రేవంత్ రెడ్డి, కాంగ్రెస్‌లో అంతర్గత ప్రజాస్వామ్యం ఉంటుందని స్పష్టం చేశారు. స్వల్ప విభేదాలు ఉన్నప్పటికీ, పార్టీ ప్రయోజనాలే పరమావధిగా అందరూ కలిసి పనిచేయాలని, కావాలని చేస్తున్న విమర్శలను పట్టించుకోవాల్సిన పని లేదని ఆయన తేల్చి చెప్పారు.



# అన్నా.. నన్ను దేవుడే పంపిండు..

మొదటి పేజీ తరువాయి

తాజా రాజకీయాలు, కాంగ్రెస్ తీరును ఆయన కెసిఆర్‌తో పంచుకున్నారు. ఈ సందర్భంగా ఎర్రవెల్లిలోని కేసీఆర్ నివాసానికి తొలిసారి వచ్చిన జీవన్ రెడ్డిని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు కొప్పుల ఈశ్వర్, గంగుల కమలాకర్, ప్రశాంత్ రెడ్డి, ఎమ్మెల్సీ ఎల్ రమణ, ఎమ్మెల్యే డా. కె.సంజయ్, మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్, మాజీ ఎమ్మెల్యే కె. విద్యాసాగర్ రావు, పార్టీ నేతలు గ్యాదరి బాలమల్లు, మారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, రాగిడి లక్ష్మారెడ్డి తదితరులు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు.’ తెలంగాణకు నష్టం జరుగుతున్న సమయంలో మీతో కలిసి పనిచేయాల్సిన అవసరమున్నదని, మీతో కలిసి పనిచేయమని దేవుడే నన్ను మీదగ్గరికి పంపించిండు. చాలా గ్యాప్ తర్వాత ఇన్నాళ్ల కైనా మీతో కలిసిపనిచేసే అవకాశం రావడం సంతోషంగా ఉంది’ అంటూ మనసులోని మాటను వ్యక్తం చేశారు. ఈ సంధ్బంగా జీవన్‌రెడ్డిని కేసీఆర్ సన్మానించారు. జీవన్ రెడ్డి



కూడా కెసిఆర్‌కు శాలువా కప్పి సన్మానించారు. కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నేతగా ఉండి, తెలంగాణ తనానికి దర్పణంగా నిలిచే జీవన్ రెడ్డి బీఆర్ఎస్‌లో చేరడం, కేసీఆర్‌ను ‘అన్నా‘ అని సంబోధిస్తూ భావోద్వేగానికి లోనవ్వడం చూస్తుంటే.. రాబోయే రోజుల్లో రాష్ట్ర రాజకీయాల్లో పెను మార్పులు సంభవించబోతున్నాయని స్పష్టమవుతోంది. ముఖ్యంగా ఉత్తర తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీకి ఈ చేరిక ఒక పెద్ద ఊతమివ్వనుంది.

# డీజీపీ ఎదుట లొంగిపోయిన కేశాలు

**మొత్తం 42 మంది ఆయుధాలతో లొంగుబాటు**

**వారికి పునరావాసం కల్పిస్తామన్న శివధర్ రెడ్డి**

**హైదరాబాద్, ఏప్రిల్ 10:** తెలంగాణ పోలీసుల ఎదుట మావోయిస్టు అగ్రనేత, పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ డిప్యూటీ కమాండర్ సోడిమల్ల కేశాలు లొంగిపోయారు. అతనితోపాటు మొత్తం 42 మంది మావోయిస్టులు సరెండర్ అయ్యారు. ఛత్తీస్‌గఢ్– తెలంగాణ సరిహద్దుల్లోని కర్రెగుట్టల నుంచి వచ్చి వీరంతా లొంగిపోయారు. ములుగు, భూపాలపల్లి మీదుగా పోలీసుల వద్దకు వెళ్లి లొంగిపోతున్నట్లు ప్రకటించారు.అనంతరం సరిహద్దుల నుంచి పోలీసులు వీరిని వాహనాల్లో హైదరాబాద్‌కు తరలించారు. మావోయిస్టు నేత హిడ్మా గెరిల్లాను వదిలి దండకారణ్య స్పెషల్ జోన్ కమిటీకి వెళ్లిన తర్వాత బెటాలియన్ బాధ్యతలను బద్సే దేవాకు, కేశాలుకు అప్పగించారు. అయితే, కొన్ని రోజులు కిందటే కమాండర్ దేవా.. తెలంగాణ పోలీసుల ఎదుట లొంగుపోయారు. ఆ తర్వాత బెటాలియన్ బాధ్యతలు





నిర్వహిస్తున్న సోడిమల్ల కేశాలు సైతం తాజాగా శుక్రవారం లొంగిపోయారు. ఇతనికి సోడిమల్ల అలియాస్ కేశాలు అలియాస్ నిఖిల్ వంటి పేర్లున్నాయి. ఈ మేరకు తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి ప్రెస్ మీట్ నిర్వహించారు.మొత్తం 42 మంది మావోయిస్టులు ఆయుధాలతో లొంగిపోయినట్లు తెలిపారు. వీరిలో గెరిల్లా బెటాలియన్ కమాండర్ సోడిమల్ల అలియాస్ కేశాలు అలియాస్ నిఖిల్ ఉన్నారని వెల్లడించారు. తెలంగాణ పోలీసుల ఎదుట ఆయుధాలు, బంగారంతో లొంగిపోయి జనజీవన స్రవంతిలో కలిసినట్లు చెప్పారు. 36 తుపాకులు, ఐదు ఏకే 47లు, నాలుగు ఎస్ఎల్ఆర్‌లు, 1,007 తూటాలతో పోలీసులు ముందు మావోలు లొంగిపోయినట్లు పేర్కొన్నారు. అలాగే 800 గ్రాముల బంగారం సైతం అప్పగించినట్లు వెల్లడించారు. వీరి లొంగుబాటుతో అత్యంత కీలకమైన పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ పూర్తిగా కనుమరుగైనట్లు డీజీపీ శివధర్ రెడ్డి ప్రకటించారు.గత ఏడాదిన్నర కాలంలో 763 మంది మావోయిస్టులు లొంగిపోయినట్లు డీజీపీ శివధర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం 42 మంది మావోయిస్టులు ఆయుధాలతో సహా డీజీపీ ఎదుట లొంగిపోయారు. వీరిలో బెటాలియన్ డిప్యూటీ కమాండర్ కేశాలు కూడా ఉన్నారు. ఛత్తీస్‌గఢ్‌లో కూంబింగ్ పెరగడంతో మావోయిస్టులు తెలంగాణ పోలీసులను ఆశ్రయించారు. లొంగిపోయిన వారిలో ఒక్కరు మాత్రమే తెలంగాణకు చెందివారు కాగా.. ఎక్కువమంది ఛత్తీస్‌గఢ్‌కు చెందినవారే. ‘లొంగిపోయిన వారికి పునరావాస ప్యాకేజీ కింద రూ.1.93 కోట్లు అందజేస్తున్నాం. సీఎం ఆదేశాల మేరకు ఆరోగ్యకార్డులు అందజేస్తాం. తెలంగాణకు చెందిన వాళ్లు సెంట్రల్ కమిటీలో 11 మంది ఉండేవారు. ఇప్పుడు ఇద్దరున్నారు. స్టేట్ కమిటీలో తెలంగాణ వాళ్లు 24 మంది ఉండేవారు. ఇప్పుడు ఇద్దరే ఉన్నారు. వాళ్లు కూడా లొంగిపోవాలని పిలుపునిస్తున్నాం అని డీజీపీ శివధర్‌రెడ్డి పేర్కొన్నారు.

# కాళేశ్వరాన్ని రెండేళ్లుగా ఎందుకు నానబెట్టారు

- ఇప్పుడే రిపేర్లు చేయడంలో ఆంతర్యం ఏమిటో
- గతంలోనే చేసివుంటే రైతులకు మేలు జరిగేది
- కేవలం కమీషన్ల కోసమేనేమోనన్న అనుమానాలు
- రియల్ ఎస్టేట్ కోసమే ఫ్యూచర్ సిటీ జపం
- జిహెచ్ఎంసిలో తీవ్ర అవినీతి జరుగుతోంది
- మీడియా సమావేశంలో జాగృతి అధ్యక్షురాలు కవిత



**హైదరాబాద్, ఏప్రిల్ 10:** కాళేశ్వరాన్ని వినియోగంలోకి తేవాలని ప్రభుత్వం నిర్ణయించడాన్ని స్వాగతిస్తున్నట్లు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత అన్నారు. రెండున్నరేళ్లు దారుణంగా వ్యవహరించి పంటలు ఎండబెట్టారని ఆరోపించారు. ఇప్పటికే ఈ న ఇర్ణయం తీసుకుని ఉంటే రైతులకు మేలు జరిగి ఉండేదని అన్నారు. హైదరాబాద్‌లో కవిత మిడియాతో మాట్లాడుతూ..కమిషన్ల కోసమే ఇప్పుడు కాళేశ్వరానికి మరమ్మతులు అంటున్నారని మండిపడ్డారు. మున్సిపల్, అర్బన్ ఫారెస్ట్రీలో తీవ్రమైన అవినీతి జరుగుతోందన్నారు. రియల్ ఎస్టేట్ కోసం ఫ్యూచర్ సిటీ పేరుతో హైదరాబాద్‌కు నష్టం చేయవద్దని కోరారు. అలాగే జీహెచ్ఎంసీలో తీవ్ర అవినీతి జరుగుతోందని కవిత ఆరోపించారు. అనేక గ్రామాలు జీహెచ్ఎంసీ పరిధిలో కలిసినా సరైన అభివృద్ధి జరగడం లేదని విమర్శించారు. హెచ్ఎండీఏ పరిధిలో 35 వేల కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూములను అమ్మకానికి పెట్టారని తెలిపారు. ఆ మొత్తాన్ని హైదరాబాద్ అభివృద్ధికి ఉపయోగించలేదని కవిత ఆరోపించారు. హెచ్ఎండీఏకు చైర్మన్‌గా, వైస్ చైర్మన్‌గా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నారని గుర్తు చేశారు. 2017 నుంచి 2021 వరకు 480 కోట్ల రూపాయల పనులను నామినేషన్ పద్ధతిలో కాంట్రాక్టులు ఇచ్చారని కవిత తెలిపారు. రేవంత్ రెడ్డి సీఎం అయిన తర్వాత మరో 1,140 కోట్ల రూపాయలను అదే పద్ధతిలో కాంట్రాక్టులు ఇచ్చారని వెల్లడించారు. ఇది ఆర్థిక శాఖ నిబంధనలకు వ్యతిరేకమని చెప్పుకొచ్చారు. రూ.50 కోట్ల టెండర్ వేస్తే దాదాపు 50 శాతం తిరిగి ప్రభుత్వానికి ఆదాయం వచ్చే అవకాశం ఉంటుందని.. కానీ నామినేషన్ పద్ధతిలో ఇలాంటి లాభం లేకపోవడం అవినీతికి దారితీస్తోందని ఆరోపించారు. నర్సరీ డిపార్ట్‌మెంట్‌లో పని చేస్తున్న 6 వేల మంది స్కిల్డ్ లేబర్‌కు 23,800 రూపాయలు ఇవ్వాల్సి ఉందని కవిత తెలిపారు. ఔటర్ రింగ్ రోడ్డు వ్యవహారంలో ఒక కంపెనీపై సీఎం రేవంత్ రెడ్డి సిట్ వేయించారని.. తర్వాత ఏమైందో తెలియాలని ప్రశ్నించారు. ఔటర్ రింగ్ రోడ్డులో గత ప్రభుత్వం ఇచ్చిన కాంట్రాక్టును రేవంత్ రెడ్డి సిఎం అయ్యాక కూడా కొనసాగిస్తున్నారని విమర్శించారు. దీనిపై ఆరోపణలు చేసిన రేవంత్ దీనిని ఎలా కొనసాగిస్తారని అన్నారు. ప్లానింగ్ డిపార్ట్‌మెంట్‌పై ముఖ్యమంత్రి దృష్టి పెడుతున్నారని.. సీఎం దగ్గర బ్యాగులు మోసే వ్యక్తి చెప్పినట్టు మాత్రమే పనులు జరుగుతున్నాయని కవిత ఆరోపించారు. జీహెచ్ఎంసీ అంటే గుంపు మేస్త్రి పాలనలో జరుగుతున్న మహా అవినీతి అని వ్యాఖ్యానించారు. అవినీతి కోసమే సీఎం 'ఫ్యూచర్ సిటీ' అంటున్నారని కవిత అన్నారు. నెల 25వ తేదీన పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా 21 కమిటీలు వేశామని కవిత చెప్పారు. 500 మంది వలంటీర్లు సేవలు అందిస్తారని తెలిపారు. మహిళా బిల్లు అమలు కాకపోవడంతో 12 రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో మహిళలు నష్టపోయారని చెప్పారు. 2027 జనగణన తర్వాత మహిళా రిజర్వేషన్లు అమలు చేస్తే న్యాయం జరుగుతుందని అభిప్రాయపడ్డారు. బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని కోరుతున్నట్లు చెప్పారు. ధర్మపురి అరవింద్‌లో పురుష అహంకారం కనిపిస్తోందని.. ప్రజలు ఆయన్ను ఎప్పుడో మర్చిపోయారని కవిత వ్యాఖ్యానించారు. తెలంగాణ ప్రజల పక్షాన పోరాటం చేస్తున్నాను... ఎవరో చెప్తే పార్టీ పెట్టే స్థాయిలో లేను' అని కవిత స్పష్టం చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మోసాలను కేరళం ప్రజల దృష్టికి తీసుకెళ్లాలని తాము వీడియో రిలీజ్ చేశామని కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు.

# పేదల ప్రభుత్వంపై ప్రతిపక్షాల బురద రాజకీయం

- వారికంటిన బురదను మాకు అంటించే ప్రయత్నం
- సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**ఖమ్మం, ఏప్రిల్ 10:** ప్రతిపక్షానికి చెందిన కొంతమంది వారికి అంటిన బురదని అధికార పార్టీకీ, అధికార పార్టీ నాయకులకు అంటించాలని చూస్తున్నారని ఎవరు ఎన్ని కారుకూతలు కూసినా భవిష్యత్తు లో ఇందిరమ్మ ప్రభుత్వంని ప్రజలు దీవించడానికి సిద్ధంగా ఉన్నారని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. శుక్రవారం నాడు ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం చేగొమ్మలో 1.52 కోట్లతో నిర్మించిన ప్యాక్స్ గోదాములను ప్రారంభించారు. అలాగే మండలంలో 191 మంది లబ్దిదారులకు మంజూరైన రూ. 58.58 లక్షల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎవరు ఎన్ని అవాకులు చవాకులు పేలిన ఈ ప్రభుత్వం పేదవారికి అండగా ఉంటుందన్నారు.రాష్ట్ర వ్యాప్తంగా రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేస్తామని ధాన్యం కొన్న వారం రోజుల్లోనే రైతుల ఖాతాలో నగదు జమ చేస్తున్నామని తెలిపారు. రైతును రాజు చేయడమే ప్రభుత్వ ప్రధాన సంకల్పమని పేర్కొన్నారు. కేవలం నాలుగు నెలల్లోనే రూ. 20,670 కోట్ల మేర రుణమాఫీ చేసి చరిత్ర సృష్టించామని ఏడాదికి ఎకరానికి రూ. 12 వేలు అందిస్తూ, సన్న వడ్లకు రూ. 500 బోనస్ ఇస్తున్నామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కొత్త గా 3.80 లక్షల మందికి పాస్ పుస్తకాలను అందజేశామన్నారు. ధరణి తో రైతులు ఇబ్బందులు పడ్డారని దాన్ని బంగాళాఖాతంలో వేసి భూ భారతి తీసుకొచ్చామని తెలిపారు. అనంతరం వెంకటాపురంలో దేపంగి శ్రీకాంత్ నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశంలో పాల్గొన్న మంత్రి.. అర్హులైన ప్రతి పేదవాడికి సొంతింటి కల నెరవేరుస్తామని హామీ ఇచ్చారు. మంత్రి వెంట జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సీపీ సునీల్ దత్, మునిసిపల్ చైర్‌పర్సన్ పోకబత్తిని అనిత, పాలేరు ప్రత్యేక అధికారి రమేష్, ఆర్డీఓ శ్రీనివాస్, వ్యవసాయ అధికారి పుల్లయ్య, తహసీల్దార్ సైదులు, ఎంపీడీఓ, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# తదుపరి డీజీపీగా సీవీ ఆనంద్?

## ప్రభుత్వ పరిశీలనలో ఆయన పేరు



**హైదరాబాద్, ఏప్రిల్ 10:** తెలంగాణ రాష్ట్రానికి కొత్త పోలీస్ బాస్ నియామక పక్రియ తుది దశకు చేరుకుంది. 1991వ బ్యాచ్‌కు చెందిన సీనియర్ ఐపీఎస్ అధికారి సీవీ ఆనంద్ తెలంగాణ రాష్ట్ర తదుపరి పూర్తిస్థాయి డీజీపీగా బాధ్యతలు చేపట్టే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని సమాచారం. ప్రస్తుతం రాష్ట్రంలో ఇన్-చార్జ్ డీజీపీగా కొనసాగుతున్న బి. శివధర్ రెడ్డి ఈ నెల 31న పదవీ విరమణ చేయనుండటంతో, ఆ స్థానంలో శాశ్వత ప్రాతిపదికన కొత్త అధికారిని నియమించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఈ నియామకం కోసం రాష్ట్రం పంపిన ఐదుగురు అధికారుల జాబితాను పరిశీలించిన యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ , ముగ్గురు అధికారులతో కూడిన ప్యానెల్‌ను రాష్ట్ర ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. ఆ జాబితాలో సీవీ ఆనంద్‌తో పాటు కేంద్ర ఇంటలిజెన్స్ బ్యూరో స్పెషల్ డైరెక్టర్‌గా ఉన్న వినాయక ప్రభాకర్ ఆప్టే , తెలంగాణ జైళ్ల శాఖ డీజీగా ఉన్న సౌమ్య మిశ్రాల పేర్లు ఉన్నాయి. అయితే, ప్రస్తుత డీజీపీ శివధర్ రెడ్డి పేరు ఈ సిఫార్సు జాబితాలో లేకపోవడంతో ఆయన పదవీ విరమణ అనివార్యం కాగా, సీనియారిటీ , రాష్ట్రంలో సుదీర్ఘ కాలం వివిధ హోదాల్లో పనిచేసిన అనుభవం దృష్ట్యా సి.వి. ఆనంద్ పేరుకే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. గతంలో రెండుసార్లు డీజీపీ పదవికి ఆయన పేరు పరిశీలనలోకి వచ్చినప్పటికీ సాంకేతిక కారణాల వల్ల అవకాశం దక్కలేదు, కానీ ఈసారి సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం శాశ్వత ప్రాతిపదికన ఆయన నియమితులయ్యే అవకాశం ఉంది. ఈ నియామకానికి సంబంధించిన అధికారిక ఉత్తర్వులు ఈ నెల 14వ తేదీ తర్వాత వెలువడే సూచనలు కనిపిస్తున్నాయి. ఒకవేళ సీవీ ఆనంద్ బాధ్యతలు చేపడితే, ఆయన పదవీ కాలం 2028 మే వరకు ఉంటుంది. మరోవైపు, మహిళా అధికారులకు కూడా ప్రాధాన్యత ఇస్తూ హోం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఒక మహిళా డీజీ స్థాయి అధికారిని నియమించాలని ప్రభుత్వం యోచిస్తోంది. హైకోర్టు ఆదేశాల ప్రకారం ఏప్రిల్ 13 నాటికి డీజీపీ నియామకంపై తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉండటంతో, త్వరలోనే రాష్ట్ర పోలీస్ శాఖలో ఈ కీలక మార్పు చోటుచేసుకోనుంది.

## లెబనాన్‌లపై దాడుల్లో పౌరుల మృతిపై

# భారత్ ఆందోళన

### దేశ ఇంధన భద్రతకు అధిక ప్రాధాన్యం

### గల్ఫ్ దేశాలతో చర్చలకు కేంద్రమంత్రులు

### విదేశాంగ శాఖ కార్యదర్శి రణ్‌ధీర్ జైస్వాల్ వెల్లడి

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 10:** దేశ ఇంధన భద్రతను బలోపేతం చేసేందుకు కేంద్ర మంత్రులు గల్ఫ్ దేశాల్లో పర్యటిస్తున్నారని విదేశాంగ శాఖ కార్యదర్శి రణ్‌ధీర్ జైస్వాల్ వెల్లడించారు. ఈ మేరకు ఖతార్‌తో ఒప్పందం చేసుకొనేందుకు చర్చలు కొనసాగుతున్నాయన్నారు. అదే సమయంలో పొరుగు దేశాల ఇంధన అవసరాలనూ తీర్చడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. రెండు వారాల క్రితం భారత్.. శ్రీలంకకు 38 మెట్రిక్ టన్నుల పెట్రోలియం ఉత్పత్తులను సరఫరా చేసినట్లు వెల్లడించారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆదేశాల మేరకు దేశ ఇంధన భద్రతను పటిష్టం చేసేందుకు మంత్రులు గల్ఫ్ దేశాల్లో పర్యటిస్తున్నారని చెప్పారు. విదేశాంగ మంత్రి ప్రస్తుతం మారిషస్‌లో ఉన్నారని, అక్కడి నుంచి 11,12 తేదీల్లో యూఏఈలో పర్యటిస్తారని తెలిపారు. భారత్-యూఏఈ సంబంధాల బలోపేతంపై అక్కడి నాయకులతో చర్చిస్తారని అన్నారు. పెట్రోలియం మంత్రి సైతం ప్రస్తుతం ఖతార్‌లో పర్యటిస్తున్నట్టు చెప్పారు. భారత్‌కు నమ్మకమైన ఇంధన సరఫరాదారుగా ఉన్న ఖతార్ సైతం భారత్‌తో ఇందన సహకారానికి కట్టుబడి ఉన్నట్టు తెలిపిందని వివరించారు. ప్రస్తుత ఉద్రిక్తతల నేపథ్యంలో అంతర్జాతీయ సముద్ర జలాల్లో చిక్కుకుపోయిన భారత నావికులను సురక్షితంగా స్వదేశానికి తీసుకుని రావడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. దేశంలో ఎల్‌పీజీ, పెట్రోల్ ఇతర ఇంధన నిల్వలకు ఎటువంటి కొరతా లేదని పెట్రోలియం, సహజ వాయువుల మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ సుజాత శర్మ పేర్కొన్నారు. పెట్రోల్ బంకులలో తగినంత నిల్వలు ఉన్నాయని.. ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. గృహ వినియోగ ఎల్‌పీజీ సిలిండర్ల సరఫరా సాధారణంగానే ఉందన్నారు. ఇకపోతే లెబనాన్‌పై ఇజ్రాయెల్ జరుపుతున్న వైమానిక దాడులపై భారత్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ దాడుల్లో పెద్ద సంఖ్యలో పౌరులు మరణించినట్టు వస్తున్న వార్తలు ఆందోళన కలిగిస్తున్నట్టు భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ పేర్కొంది. ఉద్రిక్తలు తగ్గించి సంయమనం పాటించాలని కోరింది. అంతర్జాతీయ చట్టాల గౌరవం, పౌరుల రక్షణ అత్యంత ముఖ్యమని స్పష్టం చేసింది. అమెరికా, ఇరాన్ మధ్య రెండు వారాల కాల్పుల విరమణ ఒప్పందం అమల్లోకి వచ్చినప్పటికీ లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులు కొనసాగిస్తోంది. లెబనాన్ ఈ ఒప్పందం పరిధిలోకి రాదని ఇజ్రాయెల్ వాదిస్తోంది. లెబనాన్‌పై దాడులు ఆపకుంటే అమెరికాతో శాంతి చర్చల నుంచి వైదొలుగుతామని ఇరాన్ హెచ్చరిస్తోంది.'లెబనాన్‌పై దాడుల్లో పెద్దసంఖ్యలో పౌరులు మరణించినట్టు వస్తున్న వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయి. యూఎన్ఐఎఫ్ఐఎల్‌కు ట్రూప్ కంట్రిబ్యూటింగ్ దేశంగా లెబన్‌నాన్‌లో శాంతి, భద్రతలకు భారత్ ఎంతో వెచ్చిస్తోంది. జరుగుతున్న పరిణామాలు మాత్రం ఆందోళన కలిగిస్తున్నాయి. పౌరుల రక్షణ, అంతర్జాతీయ చట్టాలు, దేశాల సార్వభౌమాధికారాన్ని గౌరవించాలని కోరుతున్నాం . భారతదేశం ఎప్పుడూ పౌరుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తుంది. లెబనాన్‌లోని భారత పౌరుల భద్రతను అక్కడి ఇండియన్ ఎంబసీ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తోంది' అని విదేశాంగ శాఖ కార్యదర్శి రణ్‌ధీర్ జైశ్వాల్ మీడియా సమావేశంలో తెలిపారు. పశ్చిమాసియాలో పరిస్థితులను జాగ్రత్తగా గమనిస్తున్నామని, గల్ఫ్ ప్రాంతాల్లోని దేశాలతో ఎప్పటికప్పుడు సంప్రదింపులు సాగిస్తున్నామని జైశ్వాల్ తెలిపారు.



# రాష్ట్రపతి, ప్రధానితో గవర్నర్ భేటీ

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 10:** తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లా శుక్రవారం ఢిల్లీలో రాష్ట్రపతి, ప్రధానులను కలుసుకున్నారు. తెలంగాణ గవర్నర్‌గా నియమితులు అయ్యాక ఆయన తొలిసారి ఢిల్లీ పర్యటనకు వెళ్లారు. రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి ముర్మును కలసారు. తనను గవర్నర్‌గా నియమించి పనచేసే అవకాశం ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ప్రధాని మోడీతో కూడా ఆయన భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మోడీ గవర్నర్‌కు అభినందనలు తెలిపారు.

# 13 ఏళ్ల బాలికపై లైంగిక దాడి

**హైదరాబాద్, ఏప్రిల్ 10:** నగరంలోని కాచిగూడలో దారుణం చోటు చేసుకుంది. 13 ఏళ్ల బాలికపై 15 ఏళ్ల బాలుడు లైంగికదాడికి పాల్పడ్డాడు. ఇన్‌స్టాగ్రామ్‌లో బాలికకు పరిచయమైన నిందితుడు.. ఆమెతో స్నేహం పెంచుకొని లైంగిక దాడి చేశాడు. ఈ కేసులో బాలుడిని అరెస్టు చేసిన పోలీసులు.. అతడిని జువైనల్ హోమ్‌కు తరలించారు.

# పిచ్చిగా వాగితే ఖబర్దార్

## అంగన్‌వాడీలకు సెల్‌ఫోన్లపై దుష్ప్రచారమా? : మండిపడ్డ మంత్రి సీతక్క



**భద్రాద్రి కొత్తగూడెం, ఏప్రిల్ 10:** అంగన్‌వాడీ టీచర్లకు స్మార్ట్ ఫోన్లు పంపిణీ చేయడం తనకు ఎంతో ఆనందాన్ని కలిగించిందని స్త్రీ శిశు సంక్షేమ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి సీతక్క అన్నారు. అంగన్‌వాడీ అంటే అమ్మఒడి అంటూ సీతక్క అభివర్ణించారు. మినీ అంగన్వాడీలను కాంగ్రెస్ ప్రభుత్వం అప్ గ్రేడ్ చేసిందని.. ఆ టీచర్లకు ఇప్పుడు రూ.2 లక్షల రిటైర్మెంట్ బెనిఫిట్లు కూడా ఇస్తున్నామని పేర్కొన్నారు. అంగన్‌వాడీలకు గతంలో సెలవులు కూడా ఉండేవి కాదని.. కాంగ్రెస్ సర్కార్‌లో వారికి సెలవులు ఇస్తున్నట్లు మంత్రి సీతక్క వెల్లడించారు. అంగన్వాడీ కేంద్రాలను ఏర్పాటు చేసిన ఘనత మాజీ ప్రధాని, దివంగత ఇందిరా గాంధీకి దక్కుతుందని ప్రశంసించారు. మహిళా శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్‌లో అంగన్వాడీ టీచర్లకు మంత్రి సీతక్క స్మార్ట్ ఫోన్లు పంపిణీ చేశారు. స్మార్ట్ ఫోన్లు పంపిణీ సందర్భంగా తనపై వస్తున్న ఆరోపణలను సీతక్క ఖండించారు. తనపై కొంతమంది పిచ్చి వాగుడు వాగుతున్నారని ఆగ్రహించారు. అసత్య ప్రచారాలతో అబద్దాలను ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. సెల్ ఫోన్ల కొనుగోలుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఆన్ లైన్ టెండర్లు వేసిందని.. ఎక్కడా అవినీతి జరగలేదన్నారు. కేంద్రం ఇచ్చిన గైడ్ లైన్ల ద్వారా మాత్రమే రూ.11,600 తక్కువ రేటుతో సెల్ ఫోన్లు ఇస్తున్నామని పేర్కొన్నారు.తమ ప్రభుత్వం ఫోన్లు కొన్నది రూ.11 వేలకే అయితే రూ.14 వేలకు కొన్నట్లుగా ప్రచారం చేస్తున్నారని ఆగ్రహించారు సీతక్క. పేదలకు మంచి చేసే తమ లాంటి వాళ్ల మీద చిల్లర రాజకీయాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. పిచ్చిపిచ్చిగా మాట్లాడుతున్న వారికి లీగల్ నోటీసులు ఇస్తామని మంత్రి హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏ పని చేసినా గత ప్రభుత్వ పాలకులకు నిద్రపట్టడం లేదని విమర్శించారు. నిజాలు ఉంటే నిరూపించాలని, అంతేగాని బట్ట కాల్చి మీద వేస్తామంటే ఉరుకునే పరిస్థితి లేదని మంత్రి సీతక్క హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, జారే ఆదినారాయణ, జిల్లా కలెక్టర్ అంకిత్, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

# అధ్వానంగా పాఠశాలలు

## రోజుకో బిడ్డ చనిపోతున్నా చలనం లేదు

## కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆర్ఎస్ ప్రవీణ్ విమర్శలు



**హైదరాబాద్, ఏప్రిల్ 10:** అసమర్ధ కాంగ్రెస్ పాలనలో తెలంగాణలోని ప్రభుత్వ పాఠశాలలో ప్రతి వారం ఒక బిడ్డ చనిపోతుందని బీఆర్ఎస్ నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా పాలన పేరుతో అధికారంలోకి వచ్చిన రేవంత్ సర్కార్ ప్రజల ఉసురు తీసుకుంటుందని మండిపడ్డారు. రాష్ట్రంలో ప్రతి వారం ఒక ఆటో డ్రైవర్, ఆరుగురు రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నారన్నారు. ప్రతి వారం 17 పాఠశాలలు మూత పడుతున్నాయి. కానీ ప్రతిరోజూ కాంగ్రెస్ పాలకులు రూ.25 కోట్లు వాళ్ల జేబుల్లో వేసుకుంటున్నారని విమర్శించారు. రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి 373 ఎకరాల భూమిని నాదర్‌గుల్‌లో కబ్జా చేశారు. స్థానిక రైతులను ముప్పు తిప్పలు పెడుతున్నారు. అందుకే ప్రజలందరు మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నారని తెలిపారు. అవినీతి కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పి బీఆర్ఎస్‌ను గెలిపించాలని పిలుపునిచ్చారు.





**సంపాదకీయం**

## మహిళా బిల్లుతో పాటు సమాజ రుగ్మతలపైనా చర్చించాలి!

భారతదేశం స్వాతంత్ర్యం సముపార్జించి 80వ ఏట అడుగిడబోతున్నాం. సాధించిన విజయాలకన్నా అపజయాలే ఎక్కువగా చర్చించుకోవాలి. దేశంలో నేటికి సరైన విద్యావైద్యం అందడం లేదు. పేదలు పేదలుగానే జీవిస్తున్నారు. గృహవసతి అందని ద్రాక్షగా మారింది. విద్య డబ్బున్న వారికే అందుబాటులో ఉంది. విద్యకోసం మధ్యతరగతి, పేదలు అప్పులు చేయాల్సి వస్తోంది. సరైతన వైద్యం అందుబాటులోకి రావడం లేదు. కనీసం జిల్లాకో మంచి కార్పోరేట్ తరహా ఆస్పత్రి కట్టలేకపోయారు. ఫీజు రియంబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ లాంటి పథకాలకు వేలకోట్లు వెచ్చిస్తున్న ప్రభుత్వాలు సొంతంగా ఆస్పత్రులను నిర్మించలేక పోతున్నాయి. అన్నింటికి మించి గంజాయి, డ్రగ్స్ విచ్చలవిడిగా వాడేస్తున్నారు. అత్యాచారాలకు లెక్కలేదు. మహిళల భద్రత డొల్ల అని చెప్పకతప్పదు. అమ్మాయిల అపహరణ కేసులు పెరుగుతున్నాయి. సమజాన్ని పట్టిపపీడిస్తున్న ఈ సమస్యలపై నిరంతరం చర్చించాలి. నిర్మూలనకు చర్యలు తీసుకోవాలి. ఈ క్రమంలో మహిళల రిజర్వేషన్లను ముందుకు తీసుకెళ్లే ముఖ్యమైన బిల్లుపై చర్చించేందుకు, ఆమోదిం చేందుకు ఏప్రిల్ 16న పార్లమెంటు సమావేశం కానుంది. దీనికి చట్టబద్దత కల్పించడం ద్వారా చట్టసభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్లు అమలు కానున్నాయి. దీంతో ఎంతోకాలంగా ఎదురు చూస్తున్న మహిళా రిజర్వేషన్ల క ల సాకారం కానుంది. 2029 ఎన్నికల నుంచి ఇది అమల్లోకి రానుంది. భారత్‌లోని కోట్లాది మహిళల ఆకాంక్షలకు ఇది ప్రతిబింబంగా చూడాలి. మహిళలు అభివృద్ధి సాధించినప్పుడే సమాజం పురోగమి స్తుందనే మన సుదీర్ఘ నాగరికతా స్ఫూర్తికి ఇది నిదర్శనం. దేశ జనాభాలో దాదాపు సగం మంది మహిళలే ఉన్నా వారికి ఇన్నాళ్లూ చట్టసభల్లో తగిన ప్రాతినిధ్యం దక్కలేదు. ఈ దేశానికి వారు అందిస్తున్న సేవలు అపారమైనవే కాదు... అమూల్యమైనవి. కూడా. అయినా ఇంకా చిన్నచూపు చూస్తూనే ఉన్నారు. పిల్లను క నే యంత్రాలుగా భావిస్తున్నారు. నిజానికి ప్రతిరంగంలోనూ మహిళలు సాధిస్తున్న అద్భుతమైన విజయాలకు ఎందరో దిక్సూచిగా నిలిచారు. శాస్త్ర, సాంకేతిక రంగాల నుంచి ఔత్సాహిక పారిశ్రామిక రంగం వరకు, క్రీడల నుంచి రక్షణ బలగాల వరకు, సంగీతం నుంచి లలితకళల వరకు దేశాభివృద్ధిలో మహిళలే అగ్రగామిగా ఉన్నారు. కొన్నేళ్లుగా చేసిన ప్రయత్నాలు స్త్రీ సాధికారత దిశగా అనుకూల వాతావరణాన్ని సృష్టించాయి. చదువుకునేందుకు విస్తృతంగా పెరిగిన అవకాశాలు, మెరుగైన ఆరోగ్య సేవలు, విస్తరించిన ఆర్థిక సమ్మిళితత్వం, అందుబాటులోకి వచ్చిన ప్రాథమిక అవసరాలు..ఆర్థిక, సామాజిక కార్యక్రమాల్లో మహిళల భాగస్వామ్యాన్ని విస్తృతం చేశాయి. అయినప్పటికీ.. సమాజంలో మహిళలు పోషిస్తున్న పాత్రకు అనుగుణంగా రాజకీయ రంగంలో, శాసనసభల్లో వారికి తగు ప్రాతినిధ్యం లభించలేదు. ఇది దురదృష్టకరం అని చెప్పుకోవాలి. దాదాపు 80 ఏళ్ల స్వాతంత్ర్యానంతరం ఇప్పుడు ఈ కల సాకారం కాబోతున్నది. పరిపాలనలో, నిర్ణయాధికారంలో మహిళలు భాగస్వాములైతే.. వారిదైన ఆలోచనలనూ, అనుభవాలనూ జోడించడం ద్వారా ప్రజోపయోగ చర్చలు, పాలనా సామర్థ్యం మరింత మెరుగవు తాయనడంలో సందేహం లేదు. రిజర్వేషన్ల బల్లు ఆఆమోదం దక్కాక రానున్న అంటే... 2029లో లోక్‌సభ, వివిధ రాష్ట్రాల శాసనసభలకు ఎన్నికలు జరిగే నాటికి మహిళా రిజర్వేషన్లను అమలుచేయడం ఇక అనివార్యం కానుంది. ప్రజాస్వామ్య వ్యవస్థలో మహిళలకు దక్కాల్సిన ప్రాధాన్యాన్ని అందించేందుకు గత ప్రభుత్వాలు కూడా దశాబ్దాలుగా తమవంతు ప్రయత్నం చేస్తూ వచ్చాయి. కమిటీలు ఏర్పాటయ్యాయి. ముసాయిదా బిల్లులను ప్రవేశపెట్టారు. కానీ అవేవీ కార్యరూపం దాల్చలేదు. అయినప్పటికీ... చట్టసభల్లో మహిళల ప్రాతినిధ్యం పెరగాలన్న అంశంలో విస్తృత ఏకాభిప్రాయం వ్యక్తం అయింది. ఈ ఏకాభిప్రాయ స్ఫూర్తితోనే 2023 సెప్టెంబరులో నారీ శక్తి వందన్ అధీనియంను పార్లమెంటు ఆమోదించింది. భారత చరిత్రలో ఇదో సువర్ణాధ్యాయంగా చెప్పుకోవాలి. మహిళలను శక్తివంతంగా ఎదగడానికి ఇదో ప్రయత్నంగా చూడాలి. వారికి సమున్నత గౌరవం ఇచ్చే చర్యగా భావించాలి. మహిళలకు రిజర్వేషన్లు కల్పించే ఈ అవకాశం మన రాజ్యాంగ స్ఫూర్తికి నిదర్శనంగా చూడాలి. ఓ రకంగా ప్రపంచ దేశాలతో పోలిస్తే మనం ఎంతో ముందున్నామని చెప్పుకోవాలి. ఆచరణాత్మక రూపంలో సమానత్వానికి ప్రాతినిధ్యం ఉన్న సమాజాన్ని నిర్మించాలన్న మన రాజ్యాంగ నిర్మాతల ఆకాంక్షలను నెరవేర్చడంలో భాగంగా చేపడుతున్న ఈ ప్రయత్నం నిజంగా అభినందించదగ్గదే. శాసనవ్యవస్థల్లో మహిళల పాత్రను బలోపేతం చేయడం అంటే వారిని మనం గౌరవించుకోవడమే. వారి శక్తిని దేశానికి ఉపయోగించడమే అవుతుంది. ఒక ఇంటిని ఎలా అయితే మహిళ నిర్మిస్తుందో, దేశ భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ప్రతి మహిళకు సమాన భాగస్వామ్యాన్ని అందించే సమాజాన్ని నిర్మించడంలో మనమంతా అవకాశం ఇవ్వాలి. నిజానికి ఇది ఎప్పుడో జరగాల్సిన సత్కార్యం. మహిళల ప్రాతినిధ్యాన్ని ముందుకు తీసుకెళ్లడంలో ఇప్పటికే జాప్యం జరిగింది. శాసన వ్యవస్థల్లో మహిళల భాగస్వామ్యాన్ని పెంపొందించాల్సిన అవసరాన్ని దశాబ్దాల కిందటే గుర్తించినా అడుగు ముందుకు వేయలేదు. ఈ అంశంపై చర్చించారు తప్ప చట్టం చేయలేదు. జనాభాలో సగ భాగంగా ఉన్న వారి ఆకాంక్షలను మన శాసన వ్యవస్థలు ప్రతిబింబించాల్సిన అవసరం ఉంది. మహిళా రిజర్వేషన్ బిల్లుకు లభించే ఆమోదంలో విస్తృత ఏకాభిప్రాయం ముఖ్యం. ఇక్కడ శశభిషలకు తావు లేకుండా ఏకగ్రీవంగా పార్లమెంట్ దీనిని ఆమోదించి తీరాలి. జాతీయ ప్రయోజనాలే పరమావధి అన్న సంకల్పంతో ముందుకు సాగాలి. భారతీయ మహిళల కోసం చేపడుతున్న ఈ ముఖ్యమైన కార్యక్రమానికి మద్దతు అందించాల్సి బాధ్యత అన్న పార్టీలకు ఉంది. ఇకపోతే ఇదే సందర్భంలో దేశాన్ని పట్టిపీడిస్తున్న కొన్న రుగ్మతలనైనా రూపుమాపేందుకు చర్చించాలి. దేశంలో వేళ్లూనుకు పోయిన కులవ్యవస్తపై చర్చంచాలి. కులాల వారీగా రిజర్వేషన్లు అనేవి ఉన్నా..కులాల ఉమ్మలాటలు ఆగడం లేదు. దేశ ప్రజలంతా సమానమే అన్న భావన రావాలంటే కుల వ్యవస్థను కూకటివేళ్లతో పెరికివేయాలి. ఈ విషయంపైనా ఇటీవల పలువురు ప్రముఖులు చర్చ లేవనెత్తారు. రాజకీయ పార్టీలు దూరదృష్టితో ఆలోచిస్తే..ఇదేమంత పెద్ద సమస్య కాబోదు.

# నేడు ఇస్లామాబాద్‌లో శాంతి చర్చలు

- నగరంలో రెడ్ అలర్ట్ ప్రకటన
- భారీగా బందోబస్తు ఏర్పాటు




**ఇస్లామాబాద్, ఏప్రిల్ 10:** అమెరికా-ఇరాన్ కాల్పుల విరమణకు అంగీకరించినా.. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మాత్రం తొలగిపోలేదు. సీజ్‌ఫైర్ వేళ.. శాంతి చర్చలకు పాకిస్థాన్ ఆతిథ్యం ఇస్తోంది. ఏప్రిల్ 11న శనివారం రాజధాని ఇస్లామాబాద్‌లో ఈ చర్చలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో పాకిస్థాన్ హై అలర్ట్‌లోకి వెళ్లిపోయింది. ప్రభుత్వ భవనాలు, కీలక రహదారి మార్గాల వద్ద భద్రతా బలగాలు పహారా కాస్తున్నాయి. రాజధానిలోని రెడ్‌జోన్ చుట్టూ కట్టుదిట్టమైన భద్రత కొనసాగుతోంది. అక్కడ పరిమిత సంఖ్యలోనే జనసంచారం కనిపిస్తోంది. ఇస్లామాబాద్‌లో దేశ పార్లమెంట్, కీలక ప్రభుత్వ కార్యాలయాలు, లగ్జరీ హోటళ్లు, ఎంబసీలు, విదేశీ సంస్థల కార్యాలయాలున్న ప్రాంతాన్ని రెడ్‌జోన్‌గా పిలుస్తారు. ఈ చర్చల నేపథ్యంలో గురువారం, శుక్రవారం ఇస్లామాబాద్‌లో సెలవు ప్రకటించారు. దుకాణాలు మూతపడ్డాయి. తమ మధ్యవర్తిత్వంతోనే రెండు వారాల పాటు కాల్పుల విరమణ జరిగిందని చెప్పిన పాకిస్థాన్ (ఖజీతిబబిజీని).. ఇప్పుడు ఇరుదేశాల మధ్య శాంతిచర్చలకు ఆతిథ్యం ఇస్తోంది. ఉపాధ్యక్షుడు జేడీవాన్స్ నేతృత్వంలోని బృందం అమెరికా తరఫున చర్చల్లో పాల్గొనున్నట్లు తెలుస్తోంది. ఇక ఇరాన్ వైపు నుంచి విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ, పార్లమెంట్ స్పీకర్ ఘాలిబాఫ్ పాక్ బయల్దేరారంటూ అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఈ వార్తలను ఇరాన్ ఖండించింది. వారిద్దరూ తమ రాజధాని టెహ్రాన్‌లోనే ఉన్నారని చెప్పింది. ఒకవేళ చర్చలంటూ జరిగితే.. హార్మూజ్‌పై నియంత్రణ, తమ దేశంపై ఉన్న ఆంక్షల నుంచి ఉపశమనం, తన మిత్రపక్షాలపై దాడులు చేయకూడదంటూ 10 పాయింట్ల డిమాండ్ల పైనే ఇరాన్ పట్టుబట్టే అవకాశం ఉంది. ఇక, లెబనాన్‌లోని ఇరాన్ మిత్రపక్షం హెజ్‌బొల్లా గ్రూప్‌పై ఇజ్రాయెల్ దాడులు మాత్రం ఆగడం లేదు. సీజ్ ఫైర్ ప్రకటన తర్వాతే అక్కడ మారణహోమం సృష్టించింది. అమెరికా-ఇరాన్ మధ్య ఉన్న అపనమ్మకం, ఇజ్రాయెల్ దూకుడు కారణంగా ఈ చర్చల్లో పురోగతిని ఆశించలేమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.



# హరివంశ్ నారాయణ సింగ్‌కు మరో ఛాన్స్

- రాష్ట్రపతి కోటాలో నామినేట్ చేసిన కేంద్రం
- మరోమారు డిప్యూటీ చైర్మన్ అయ్యే అవకాశం



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 10:** రాజ్యసభ డిప్యూటీ చైర్మన్‌గా హరివంశ్ నారాయణ్ సింగ్ కొనసాగే అవకాశముంది. అనుభవజ్ఞుడైన నాయకుడిగా, నిష్పక్షపాతంగా సభను నడిపించే సమర్థత కలిగిన వ్యక్తిగా ఆయనకు గుర్తింపు ఉంది. భారత పార్లమెంట్ ఎగువసభలో అత్యంత హుందా తనం గల నేతగా పేరుగాంచిన హరివంశ్.. మరోసారి రాజ్యసభ సభ్యుడిగా కొనసాగబోతున్నారు. మాజీ ప్రధాన న్యాయమూర్తి రంజన్ గొగోయ్ పదవీ విరమణతో ఏర్పడిన ఖాళీని భర్తీ చేస్తూ, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆయనను నామినేట్ చేశారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 80 ప్రకారం.. సాహిత్యం, శాస్త్రం, కళలు, సామాజిక సేవ వంటి రంగాల్లో విశేష కృషి చేసిన 12 మందిని రాష్ట్రపతి రాజ్యసభకు నామినేట్ చేస్తారు. హరివంశ్ తనకున్న సుదీర్ఘ జర్నలిజం అనుభవం, సామాజిక స్పృహతో ఈ కోటాలో ఎంపికయ్యారు. బిహార్ నుంచి జేడీయూ తరఫున ఎన్నికైన ఆయన సభ్యత్వ కాలం ఏప్రిల్ 9వ తేదీన ముగిసింది. సాధారణంగా పార్టీ కోటాలో సభ్యత్వం ముగిసిన తర్వాత తిరిగి పార్టీ టికెట్‌పైనే వస్తుంటారు. కానీ, కేంద్ర ప్రభుత్వం ఆయన సేవలను ప్రత్యేకంగా గుర్తించి రాష్ట్రపతి కోటా ద్వారా నేరుగా సభకు పంపడం గమనార్హం. రాజ్యసభ 13వ డిప్యూటీ ఛైర్మన్‌గా ఆయన పనిచేసిన తీరు అమోఘం. క్లిష్టమైన బిల్లుల చర్చ సమయంలో సభలో గందరగోళం నెలకొన్నప్పుడు, ఆయన చూపిన ప్రతిభ, నిష్పక్షపాత నిర్ణయాలు అధికార, ప్రతిపక్షాల మన్ననలు పొందాయి. హరివంశ్ నారాయణ్ సింగ్‌ను మళ్లీ సభకు పంపడం వెనుక కేంద్ర ప్రభుత్వం కొన్ని కీలక వ్యూహాలను రచించినట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఎగువ సభలో ప్రతిపక్షాల బలం గణనీయంగా ఉన్నప్పుడు, సభను సమర్థవంతంగా నడపగలిగే వ్యక్తుల అవసరం ప్రభుత్వానికి ఉంటుంది. హరివంశ్ ఆ విషయంలో ఇప్పటికే తన సత్తా చాటారు. తాజా నామినేషన్‌తో ఆయన మళ్లీ రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్‌గా ఎన్నికయ్యే అవకాశముంది. నామినేటెడ్ సభ్యుడిగా ఉంటూ ఈ బాధ్యతలు చేపడితే, అది సభకు మరింత గౌరవాన్ని తెస్తుందని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. సీనియర్ జర్నలిస్టుగా హరివంశ్‌కున్న విలువలు, రాజకీయాలకు అతీతంగా ఆయనకు ఉన్న ఆదరణ ప్రభుత్వానికి సానుకూల అంశమని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. రాజకీయాల్లో హుందాతనం తగ్గుతున్న కాలంలో, హరివంశ్ నారాయణ్ సింగ్ వంటి సీనియర్ల సేవలను వినియోగించుకోవడం ప్రజాస్వామ్యానికి శుభపరిణామమని తెలిపారు. రంజన్ గొగొయ్ స్థానంలో ఓ అనుభవజ్ఞుడైన పార్లమెంటేరియన్ రావడం సభ గౌరవాన్ని మరింత పెంచుతుందనడంలో సందేహం లేదని పేర్కొన్నారు. హరివంశ్ నారాయణ్ సింగ్ మళ్లీ డిప్యూటీ చైర్మన్ బాధ్యతలు చేపడితే.. సభలో చర్చల నాణ్యత మరింత మెరుగుపడుతుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

# కాలిన నోట్ల కట్టల వ్యవహారం

## జస్టిస్ యశ్వంత్ వర్మ రాజీనామా



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 10:** అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ తన పదవికి రాజీనామా చేశారు. తన రాజీనామా లేఖను రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు పంపారు. ఢిల్లీలోనితన నివాసంలో కాలిన నోట్ల కట్టలు దొరికిన ఘటనలో ఆయనను తొలగించేందుకు అభిశంసన పక్రియకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలోనే తాజా పరిణామం చోటుచేసుకుంది. గతేడాది మార్చి 14న ఢిల్లీ హైకోర్టు జడ్జిగా ఉన్న సమయంలో జస్టిస్ వర్మ నివాసంలో భారీగా నోట్ల కట్టలు బయటపడటం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. దీని ఫలితంగా 2025 జులైలో లోక్‌సభలో 145 మంది, రాజ్యసభలో 63 మంది ఎంపీలు ఆయనపై అభిశంసన తీర్మానానికి నోటీసులు ఇచ్చారు. దీంతో లోక్‌సభ స్పీకర్ ఆరోపణలపై దర్యాప్తు చేసేందుకు ముగ్గురు సభ్యులతో కూడిన విచారణ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ ఏర్పాటును జస్టిస్ వర్మ సుప్రీంకోర్టులో సవాలు చేశారు. అయితే, ఆయన పిటిషన్‌ను జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ సతీశ్ చంద్ర శర్మలతో కూడిన ధర్మాసనం తోసిపుచ్చింది. అంతకుముందు సుప్రీంకోర్టు అంతర్గత కమిటీ ఇచ్చిన నివేదికను సవాల్ చేసినా ఆయనకు చుక్కెదురైన విషయం తెలిసిందే. దీంతో ఇక లాభం లేదనుకుని ఆయన రాజీనామా చేసినట్లు తెలుస్తోంది.

# రాజ్యసభ సభ్యుడిగా నితీశ్ ప్రమాణం



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 10:** బీహార్ ముఖ్యమంత్రి నితీష్‌కుమార్ శుక్రవారం రాజ్యసభ సభ్యునిగా ప్రమాణస్వీకారం చేశారు. రాజ్యసభ ఛైర్మన్ సి.పి రాధాకృష్ణన్ తన ఛాంబర్‌లో నితీష్‌కుమార్ చేత ప్రమాణస్వీకారం చేయించారు. నితీష్‌కుమార్ హిందీలో ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రి, రాజ్యసభ నేత జెపి నడ్డా, ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్, న్యాయశాఖ సహాయ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్‌లు హాజరయ్యారు. అలాగే జెడియు నేత, ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ సంజరు కుమార్ ఝా, కాంగ్రెస్ నేత జైరాం రమేష్, బిజెపి ఎంపి మాజీ కేంద్రమంత్రి అయిన రాజీవ్ ప్రతాప్ రూడీ తదితరులు ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరయ్యారు. ఎన్‌డిఏ తదుపరి బీహార్ సిఎం ఎవరనేది త్వరలోనే వెల్లడించనుంది. బహుశా ఏప్రిల్ 14న కొత్త ముఖ్యమంత్రిని ఎన్‌డిఎ ఎన్నుకునే అవకాశం ఉంది.

# ముంబై ఎయిర్‌పోర్టులో 29 కిలోల బంగారం సీజ్

## కెన్యా నుంచి వస్తున్న మహిళల నుంచి స్వాధీనం

**ముంబై, ఏప్రిల్ 10:** ముంబై ఎయిర్‌పోర్ట్‌లో 29 కిలోల బంగారాన్ని డీఆర్ఐ అధికారులు సీజ్ చేశారు. దీని విలువ సుమారు రూ.38 కోట్లు ఉండొచ్చని అధికారులు చెబుతున్నారు. కెన్యాలోని నైరోబీ నుంచి ఈ బంగారాన్ని అక్రమంగా తీసుకొచ్చినట్లు తెలుస్తోంది. వివరాల్లోకి వెళితే.. ముంబై విమానాశ్రయంలో భారీ ఎత్తున బంగారాన్ని అక్రమంగా తీసుకొస్తున్నారని డీఆర్ఐ అధికారులకు సమాచారం అందింది. దీంతో వెంటనే వారు అప్రమత్తమయ్యారు. ఆపరేషన్ ధహాబు పేరుతో విమానాశ్రయంలో తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో కెన్యాలోని నైరోబీ నుంచి వచ్చిన ప్రయాణికులను తనిఖీ చేయగా.. బంగారం బయటపడింది. కెన్యాకు చెందిన మహిళలు దుస్తులు, బ్యాగుల్లో సుమారు 29 కిలోల బంగారాన్ని దాచినట్లు గుర్తించారు. బంగారాన్ని సీజ్ చేసిన అధికారులు.. మొత్తం 26 మంది కెన్యా దేశస్థులను అరెస్ట్ చేశారు. విమానాశ్రయంలోని గ్రీన్ ఛానల్ దాటిన తర్వాత.. అధికారులను చూసి పారిపోతుండగా.. అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. పట్టుకున్న బంగారం విలువ సుమారు రూ.38 కోట్లు ఉండొచ్చని అధికారులు చెబుతున్నారు.





# శ్రీకాకుళం సాగునీటిని గాలికి వదిలేసిన వైసీపీ

## కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు వెల్లడి

**శ్రీకాకుళం, ఏప్రిల్ 10:** ఐదేళ్ల వైసీపీ పాలనలో శ్రీకాకుళంలో సాగునీటి వ్యవస్థను గాలికి వదిలేశారని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు మండిపడ్డారు. శ్రీకాకుళం జిల్లా వ్యవసాయ ఆధారితమని, జిల్లా ప్రజలకు సాగునీటి భద్రత కల్పించాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. వంశధార నీటిని సద్వినియోగం చేసుకుని జిల్లాను సస్యశ్యామలం చేయాలని పూనుకున్నట్లు ఆయన చెప్పారు. 2010లో వంశధార ట్రిబ్యునల్ ఏర్పాటు అయ్యిందని.. అప్పటి నుంచి నేరడి బ్యారేజ్ విషయంలో ఒడిశాతో ఉన్న సమస్యను పరిష్కరించేందుకు కృషి చేసినట్లు ఆయన చెప్పారు. 2024లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో నేరడి బ్యారేజ్ సమస్యపై దృష్టి పెట్టామని ఈ సందర్భంగా రామ్మోహన్ చెప్పుకొచ్చారు. ఒడిశాలోనూ బీజేపీ ప్రభుత్వం రావటంతో సమస్య పరిష్కారానికి మార్గం సుగమం అయ్యిందని హర్షం వ్యక్తం చేశారు. వంశధార ట్రిబ్యునల్ ఇచ్చిన తీర్పు ఆధారంగా గెజిట్ నోటిఫికేషన్ తెచ్చుకున్నామని.. సుదీర్ఘ కాలం పెండింగ్‌లో ఉన్న సమస్య పరిష్కారమైందని తెలిపారు. దీనిపై వైసీపీ నేతలు ఇప్పుడెందుకు మాట్లాడటం లేదని రామ్మోహన్ నాయుడు ప్రశ్నించారు. కేంద్ర మంత్రి అయినా తన మొదటి ప్రాధాన్యత జిల్లా అభివృద్ధికే అని రామ్మోహన్ స్పష్టం చేశారు. త్వరలో నేరడి బ్యారేజ్ పనులు ప్రారంభమవుతాయని.. రైల్వే జోన్ సాధించుకోవటం మరో విజయమంటూ సంతోషం వ్యక్తం చేశారు. ఉద్దానం ప్రాంతంలోని ఏడు రైల్వేస్టేషన్లను కొత్త రైల్వే జోన్‌లో పెట్టించినట్లు కేంద్ర మంత్రి తెలిపారు. తిరుపతి వెళ్లే భక్తుల కోసం హంసఫర్ ఎక్స్‌ప్రెస్ ఇకపై శ్రీకాకుళం నుంచి బయలుదేరుతుందంటూ ఆయన గుడ్ న్యూస్ చెప్పారు. పలాసలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు చేశామని.. పొందూరు ఖాదీకి జియో ట్యాగ్ సాధించామనీ వెల్లడించారు. కేంద్రం నుంచి జిల్లాకు అన్ని రకాల సహాయ సహకారాలు అందేలా చూస్తున్నానని రామ్మోహన్ పేర్కొన్నారు. జిల్లాలో అభివృద్ధి జరుగుతుంటే వైసీపీ నేతలు జీర్ణించుకోలేకపోతున్నారని కేంద్ర మంత్రి రామ్మోహన్ ఆగ్రహించారు. ప్రజల కోసం పని చేసే నేతలైతే కేంద్ర ప్రభుత్వ సహకారంతో చేసిన పనులను అభినందించాలని డిమాండ్ చేశారు. అమరావతి రాజధాని బిల్లు పార్లమెంట్ ఉభయ సభల్లో ఆమోదం పొందడం చరిత్రాత్మక ఘట్టమని ఈ సందర్భంగా ఆయన ప్రశంసించారు. అమరావతి బిల్లుకు కాంగ్రెస్ కూడా మద్దతు ఇచ్చిందని.. జగన్ పార్టీ మాత్రం బిల్లు సందర్భంగా పార్లమెంట్ నుంచి వాకౌట్ చేసిందని మండిపడ్డారు. అమరావతి చట్టబద్ధత కోసం సీఎం చంద్రబాబు నాయుడు చాలా కృషి చేశారని చెప్పుకొచ్చారు. రాజధానిగా అమరావతికి రాష్ట్ర ప్రజలు ఎన్నికల ద్వారా సంపూర్ణ మద్దతు ఇచ్చారని చెప్పుకొచ్చారు. అధికారంలో ఉన్నప్పుడు రాజధానిపై జగన్ మూడు ముక్కలాట ఆడారని.. ఇప్పుడూ అదే డ్రామాలు ఆడుతున్నారని విమర్శించారు. అమరావతి పూర్తయితే చంద్రబాబు పేరు చిరస్థాయిగా నిలిచిపోతుందన్న భయం వైసీపీదని ఆరోపించారు. జాతీయస్థాయిలో చంద్రబాబుది ఓ ప్రత్యేక గుర్తింపని కొనియాడారు. రాష్ట్రానికి పెట్టుబడులు రాకూడదనేది వైసీపీ అజెండా అయితే.. చంద్రబాబుది అభివృద్ధి అజెండా అని పేర్కొన్నారు. ప్రజలు ఛీ కొట్టినా వైసీపీకి ఇంకా బుద్ధి రాలేదని.. చరిత్ర హీనులుగా మిగిలిపోవడం ఖాయమంటూ నిప్పులు చెరిగారు. విశాఖ రాజధాని పేరుతో వైసీపీ నేతలు భూదందా చేశారని ఆరోపించారు రామ్మోహన్ నాయుడు. త్వరలో భోగాపురం ఎయిర్ పోర్టు, మూలపేట గ్రీన్ ఫీల్డ్ పోర్టు పూర్తవుతాయని.. కేంద్రం సహకారంతో రాష్ట్రాభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని ఆయన చెప్పారు. ఒక పక్క అభివృద్ధి జరుగుతుంటే మరో పక్క వైసీపీ నేతలు గుంట నక్క రాజకీయాలు చేస్తున్నారని కేంద్ర మంత్రి ఆగ్రహించారు.

# ఫ్లై 91 విమాన సర్వీసు ప్రారంభం

మొదటి పేజీ తరువాయి

శుక్రవారం ప్రారంభించారు. తక్కువ ధరలో వేగవంతమైన ప్రయాణాన్ని అందించడమే ఈ సంస్థ ప్రధాన ఉద్దేశ్యం. విమాన సర్వీసును ప్రారంభించిన అనంతరం కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా టైర్-2, టైర్-3 నగరాలను అనుసంధానించేందుకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ప్రాంతీయ కనెక్టివిటీని పెంచడం ద్వారా సామాన్యులు కూడా విమానం ఎక్కాలన్న ప్రధానమంత్రి కల నిజమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. విజయవాడ – హైదరాబాద్ మధ్య రద్దీ దృష్ట్యా ఈ సర్వీస్ ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.రోడ్డు మార్గంలో సుమారు 5 నుంచి 6 గంటల సమయం పట్టే ప్రయాణం, విమానం ద్వారా కేవలం 50 నిమిషాల నుంచి గంటలో పూర్తవుతుంది. హైదరాబాద్‌లో ఐటీ రంగం, విజయవాడలో వ్యాపార రంగాలు బలంగా ఉన్న నేపథ్యంలో, ఈ విమాన సర్వీస్ వ్యాపారవేత్తలకు వరంలా మారనుంది. ఫ్లై 91 సంస్థ తన టికెట్ ధరలను ఇతర విమాన సంస్థలతో పోలిస్తే అందుబాటులో ఉంచేలా ప్రణాళికలు చేస్తోంది. ఈ సంస్థ గోవా కేంద్రంగా పనిచేస్తున్న ఒక ప్రాంతీయ విమానయాన సంస్థ. ఇది ప్రధానంగా తక్కువ దూరం ఉండే నగరాల మధ్య సర్వీసులను నడుపుతోంది. తెలుగు రాష్ట్రాల్లో తమ నెట్‌వర్క్‌ను పెంచుకోవడం ద్వారా ప్రయాణికులకు మరిన్నిసౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయి. ఈ కొత్త సర్వీసు అందుబాటులోకి రావడం వల్ల అటు విజయవాడ ప్రాంత ప్రజలకు, ఇటు హైదరాబాద్ ప్రజలకు రవాణా పరంగా మరిన్ని వెసులుబాట్లు కలగనున్నాయి. ఈ విమాన సర్వీసు అందుబాటులోకి రావడం వల్ల రోడ్డు ప్రయాణంపై ఒత్తిడి తగ్గనుందని భావిస్తున్నారు.

# ప్రేమజంట ఆత్మహత్య

**పల్నాడు, ఏప్రిల్ 10:** కొండవీడు కోటలో ఓ ప్రేమజంట ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తమ ప్రేమ వివాహాన్ని తల్లిదండ్రులు నిరాకరించడంతో తీవ్ర మనస్తాపం చెందిన ప్రేమజంట పురుగు మందు తాగి బలవన్మరణానికి పాల్పడింది. ఈ సంఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. యువతీ, యువకుడు ప్రేమించుకోగా.. వారి ప్రేమను పెద్దలు నిరాకరించారు. యువతికి తల్లిదండ్రులు వేరే వ్యక్తితో వివాహం జరిపించారు. దీంతో ఆమె తీవ్రంగా మనస్తాపానికి గురైంది. పెళ్లి అయిన తర్వాత కూడా ప్రేమించిన వ్యక్తిని మరిచిపోలేక... భర్తను వదిలేసి ప్రేమికుడి వద్దకు వచ్చేసిందా యువతి. ఇద్దరు కలిసి జీవించాలని అనుకున్నప్పటికీ పెద్దలు తమ వివాహాన్ని అంగీకరించరని భావించిన ప్రేమజంట కఠిన నిర్ణయం తీసుకుంది. ఈనెల 7న కొండవీడు కోటకు వచ్చిన వీరిద్దరు.. అక్కడే పురుగు మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించారు. వెంటనే గమనించిన స్థానికులు వారిని హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. అయితే ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఇద్దరూ చనిపోయారు. వీరిద్దరూ గుంటూరుకు చెందిన వారుగా గుర్తించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రేమ జంట మృతిపై వారి తల్లిదండ్రులకు సమాచారం అందించారు.

# కేబినేట్ ఎజెండా ముందే లీక్

మొదటి పేజీ తరువాయి



కీలక సమాచారం లీక్ అవుతున్న అంశంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కేబినెట్ అజెండాతో పాటు ప్రభుత్వానికి సంబంధించిన ముఖ్యమైన వివరాలు ముందుగానే బయటకు ఎలా వస్తున్నాయంటూ మంత్రులను ప్రశ్నించారు. ఇకపై క్యాబినెట్ సమావేశానికి ముందే ఎజెండా లీకైతే సంబంధిత మంత్రులే బాధ్యత వహించాల్సి వస్తుందని స్పష్టంగా హెచ్చరించారు. గతంలో ఇలాంటి లీకుల కారణంగా ఎన్టీఆర్ తన కేబినెట్‌ను రద్దు చేసిన విషయాన్ని గుర్తుచేస్తూ, అలాంటి పరిస్థితి మళ్లీ రాకూడదని చెప్పారు. ఎన్టీఆర్ ఎవరు లేకుండా 15 రోజులు ప్రభుత్వాన్ని నడిపారని సీఎం గుర్తు చేశారు. పేపర్ లీక్ కేసులో ఆ రోజు బాలయోగి రాజీనామా చేశారని చెప్పారు. ఇప్పుడు సాంకేతికతతో ఎవరి నుంచి లీక్ అయిందో తేలికగా కనుక్కోవచ్చని స్పష్టం చేశారు. మంత్రులు, కార్యదర్శులు బాధ్యతగా ఉండాలని సీఎం చంద్రబాబు నాయుడు సూచించారు.మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతమైతే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. అదేవిధంగా, ప్రభుత్వ పథకాల అమలుపై కూడా సీఎం మంత్రులకు పలు సూచనలు చేశారు. 'జలధార' పథకం గురించి ప్రజల్లో మరింత అవగాహన కల్పించాలని సూచించారు. పాస్‌బుక్స్ వ్యవహారంపై రెవెన్యూ అధికారులు, సంబంధిత మంత్రులు నెలకు కనీసం నాలుగు సార్లు ప్రాంతాల వారీగా పర్యటించాలని ఆదేశించారు. 'సూర్య ఘర్' పథకంపై మరింత దృష్టి పెట్టాలని, వచ్చే ఏడాదితో ముగియనున్న లక్ష్యాలను సమయానికి పూర్తి చేయాలని మంత్రులకు నిర్దేశిరచారు. కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే మహిళా బిల్లుపై కూడా కేబినెట్‌లో చర్చ జరిగింది. ఇక, రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల నిర్వహణపై కూడా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. మూడు నుంచి నాలుగు నెలల వ్యవధిలో ఎన్నికలు నిర్వహించే అవకాశాలపై చర్చించినట్లు తెలుస్తోంది. మొత్తంగా, ఏపీ కేబినెట్‌లో లీకుల అంశంపై సీఎం చంద్రబాబు గట్టి హెచ్చరిక జారీ చేయడంతో పాటు, ప్రభుత్వ పథకాల అమలుపై స్పష్టమైన దిశానిర్దేశర చేశారు. అజెండా అంశాలు ముగిశాక వివిధ అంశాలపై మంత్రులతో సీఎం చర్చించారు. కేబినెట్ సమావేశం ప్రారంభమైనా అజెండా మాత్రం మంత్రులకు రాలేదని మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రస్తావించారు. అజెండా ముందే వస్తే స్టడీ చేసుకుని కేబినెట్‌కు వచ్చే వీలు ఉండేదన్నారు. దీంతో వివిధ శాఖల కార్యదర్శుల పనితీరుపై ముఖ్యమంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. వ్యవస్థలు రాను రాను మరింత ఉపయోగపడాల్సింది పోయి క్లిష్టంగా మారుతున్నాయంటూ అధికారుల తీరను ముఖ్యమంత్రి తప్పుబట్టారు. కార్యదర్శులు గతంలో స్జబెక్టుల్లో భాగస్వాములవుతూ చర్చల్లో ఏ సందేహం వచ్చినా పూర్తిగా నివృత్తి చేసేందుకు చొరవ చూపేవారని సీఎం చంద్రబాబు గుర్తుచేశారు. ఇప్పుడా పరిస్థితి లేదంటూ అసంతృప్తి వ్యక్తం చేశారు. డీమ్డ్ యూనివర్సిటీలను రాష్ట్రంలో ఎక్కువ ప్రమోట్ చేయాలని సీఎం ఆదేశించారు. 10 ఎకరాలు తక్కువ కాకుండా నిబంధనలు పెట్టి నాణ్యత పెంచుతూ ఎక్కువ సంఖ్యలో డీమ్డ్ యూనివర్సిటీలను అందుబాటు లోకి తీసుకురావాలన్నారు. ఇతర రాష్ట్రాలతో పోల్చితే ఏపీలో తక్కువ డీమ్డ్ యూనివర్సిటీలు ఉన్నాయని సీఎం తెలిపారు. జలధార, సూర్యఘర్, పీఎం కుసుమ్, పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ, స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలను మంత్రులు ఓనర్ షిప్ తీసుకోవాలని సీఎం దిశానిర్దేశర చేశారు. ప్రతి మంత్రి పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీకి సంబంధించి నాలుగు కార్యక్రమాల్లో అయినా పాల్గొనాలని ఆదేశించారు. కూటమి ఎమ్మెల్యేలూ ఇదే అనుసరించాలన్నారు. జలధారకు ఉపాధి హామీ నిధులు అనుసంధానం అయ్యేలా పనులు చేపట్టాలని సీఎం నిర్దేశిరచారు. సూర్యఘర్, పీఎం కుసుమ్ కింద వీలైనన్ని ఎక్కువ కనెక్షన్లు ఇచ్చేలా కార్యాచరణ ఉండాలన్నారు. గ్రామాలను శుభ్రంగా ఉంచుకుంటూ వ్యాధుల నివారణకు కృషి చేసేలా స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలు చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలు జారీ చేశారు.

# రూ.39,436 కోట్ల విలువైన 31 ప్రాజెక్టులకు ఆమోదం

- క్వాంటమ్ వ్యాలీ ప్రాజెక్టులో మూడు సంస్థల ఏర్పాటు
- విశాఖపట్నం, అనకాపల్లిలో ఏఐ డేటా ప్రాజెక్టు అమలు
- విశాఖలో కేబుల్ ల్యాండింగ్ స్టేషన్ స్థాపన కోసం సీటెక్ భూముల కేటాయింపు
- సత్యసాయి జిల్లాలో సెమికండక్టర్ ఫ్యాబ్రికేషన్ కోసం ఆర్ఆర్ ఎలక్ట్రానిక్స్‌కు 60 ఎకరాలు
- కేబినేట్ వివరాలు వెల్లడించిన మంత్రి పార్థసారథి




**అమరావతి,ఏప్రిల్10(మనసులో మాట):** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన ఆంధ్రప్రదేశ్ కేబినెట్ సమావేశం కీలక నిర్ణయాలు తీసుకుంది. సచివాలయంలో దాదాపు 3 గంటలకు పైగా కేబినెట్ భేటీ కొనసాగగా.. ముఖ్యంగా రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పించిన కేంద్ర ప్రభుత్వానికి, ప్రధాని నరేంద్ర మోడీకి మంత్రి మండలి ధన్యవాదాలు తెలియజేసింది. ఈ సమావేశంలో 16వ రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలిలో చర్చించిన పలు పెట్టుబడి ప్రతిపాదనలకు కేబినెట్ ఆమోదం తెలిపింది. మొత్తం రూ.39,436 కోట్ల విలువైన 31 ప్రాజెక్టులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. ఈ ప్రాజెక్టులు రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధికి దోహదపడనున్నాయి. అదేవిధంగా, క్వాంటమ్ వ్యాలీ ప్రాజెక్టులో భాగంగా మూడు సంస్థల ఏర్పాటుకు కూడా కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇది సాంకేతిక రంగంలో ముందుకు తీసుకెళ్లే కీలక అడుగుగా భావిస్తున్నారు. ఇక జోనల్ వ్యవస్థకు సంబంధించి కూడా కేబినెట్‌లో చర్చ జరిగింది. రాష్ట్ర పరిపాలనలో సమతుల్యత కోసం తీసుకునే చర్యలపై అధికారులు వివరాలు సమర్పించారు. పలు పరిశ్రమలు, సంస్థలకు భూ కేటాయింపుల విషయంలో కూడా కేబినెట్ అనుమతులు ఇచ్చింది. మొత్తం 60కి పైగా ఎజెండా అంశాలను పరిశీలించిన కేబినెట్, వాటిలో ముఖ్యమైన వాటికి ఆమోదం తెలిపింది. మొత్తానికి, ఈ కేబినెట్ సమావేశం రాష్ట్ర అభివృద్ధికి దిశానిర్దేశం చేసే పలు నిర్ణయాలతో ముగిసిందని అధికారులు పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.9.36 లక్షల కోట్లు పెట్టుబడులకు ఆమోదం తెలిపినట్లు మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. తద్వారా 9.62 లక్షల మందికి ఉద్యోగాలు లభించాయన్నారు. సమావేశం వివరాలను మంత్రి పార్థసారథి మీడియాకు వివరించారు. విశాఖపట్నం, అనకాపల్లిలో ఏఐ డేటా ప్రాజెక్టు అమలు ప్రతిపాదనలకు ఆమోదం తెలిపామన్నారు. విశాఖలో కేబుల్ ల్యాండింగ్ స్టేషన్ స్థాపన కోసం సీటెక్ భూముల కేటాయింపునకు క్యాబినెట్ ఆమోదం ఇచ్చింది. సత్యసాయి జిల్లాలో ఔట్‌సోర్స్ సెమీకండక్టర్ అసెంబ్లీ టెస్టింగ్ సౌకర్యం రానుంది. సత్యసాయి జిల్లాలో సెమికండక్టర్ ఫ్యాబ్రికేషన్ కోసం ఆర్ఆర్ ఎలక్ట్రానిక్స్‌కు 60 ఎకరాల కేటాయింపునకు ఆమోదం ఇచ్చారు. ఏపీఐఐసీ, టీసీఎస్ మధ్య ఒప్పందంలో నిబంధనల సవరణకు ఆమోదం ఇచ్చారు. ఏపీఐఐసీ, రహేజా కార్ప్ సంస్థ మధ్య ఒప్పందంలో నిబంధనల సవరణకు ఆమోదం ఇచ్చారు.

# పరాకాష్టకు చేరిన వైసీపీ రాజకీయం

## క్రిమినల్స్ ఇలానే రాజకీయంచేస్తారు

## మంత్రులతో సీఎం చంద్రబాబు నాయుడు



**అమరావతి,ఏప్రిల్10(మనసులో మాట):** వైసీపీ అరాచకాలు పరాకాష్టకు చేరాయి. ఎవరిని లేపుతారు.. ఇటువంటి క్రిమినల్స్ చేసే బెదిరింపులకు ఎవరూ భయపడరని సీఎం చంద్రబాబు అన్నారు. వైసిపి క్రిమలన్ రాజకీయాలతో జాగ్రత్తగా ఉండాలని మంత్రులకు సూచించారు. వైసీపీ నేతలు చేస్తున్న వ్యాఖ్యలపై ఏపీ కేబినెట్‌లో చర్చ జరిగింది. మంత్రి నిమ్మల రామానాయుడు ఈ అంశాన్ని ప్రస్తావించారు. 'కొత్త పలుకు కాదు... ఇక పలుకే ఉండదు' అని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి వ్యాఖ్యానించినట్లు రామానాయుడు కేబినెట్‌కు తెలియజేశారు. దీనిపై సీఎం చంద్రబాబు తీవ్రంగా స్పందించారు. క్రిమినల్స్‌ను ఎట్టి పరిస్థితుల్లో నూ ఫర్మ్‌గా డీల్ చేస్తామని ముఖ్యమంత్రి తెలిపారు. బెదిరించి భయపెడదామని అనుకుంటున్నారని మండిపడ్డారు. ఇటువంటి రాజకీయాలను ఎప్పటికప్పుడు జాగ్రత్తగా గమనించాలని, అన్ని విషయాలను ప్రజలకు తెలియజేయాలని మంత్రులకు సీఎం సూచించారు. 'క్రిమినల్స్ ఇలానే రాజకీయాలు చేస్తారు. వాళ్ల ఆటలు సాగనివ్వకూడదు. ప్రజలకు నిజాలు తెలియచేస్తే సరిపోతుంది. డైవర్షన్ పాలిటిక్స్‌కు వాళ్లు అలవాటు పడ్డారు' అంటూ ముఖ్యమంత్రి విమర్శలు గుప్పించారు.



# ఏసీ వాటర్ వివాదం

## అన్నా చెల్లెళ్లపై తండ్రీకొడుకుల దాడి

## బ్లేడ్‌తో దాడిచేయడంతో గాయాలు.. ఆస్పత్రికి తరలింపు

**కాకినాడ, ఏప్రిల్ 10:** చిన్న విషయాలకే ఒకరిపై ఒకరు దాడులు చేసుకుంటున్న ఘటనలు ఎన్నో చూశాం. కూర్చుని మాట్లాడుకోవాల్సిన విషయాల్లో కూడా కత్తులు, రాడ్లతో దాడులకు తెగబడుతున్నారు.ఈ ఘటనల్లో కొందరు గాయాలపాలై బయటపడుతుండగా.. మరికొందరు ఏకంగా ప్రాణాలే కోల్పోతున్న పరిస్థితి. కాకినాడ జిల్లా జగ్గంపేటలో ఏసీ వాటర్ విషయంపై తలెత్తిన చిన్న వివాదం.. దాడిగా మారి.. ఇద్దరిని తీవ్ర గాయాలపాలయ్యేలా చేసింది. జగ్గంపేట మండలం నెహ్రూ కాలనీలో ఓ ఇంటి వాకిలిలో ఏసీ నుంచి వచ్చే వాటర్ పడుతుందన్న కారణంగా పక్కంటి మహిళ, ఆమె అన్నపై తండ్రీకొడుకులు దారుణాని కి పాల్పడ్డారు. అన్నాచెల్లెలిపై బ్లేడ్‌తో దాడి చేయడంతో వారు గాయపడ్డారు. మొదట ఈ వివాదం చిన్నగా మొదలైనప్పటికీ తరువాత చిలికి చిలికి గాలివానగా మారింది. ఆగ్రహంతో తండ్రీకొడుకులు కలిసి పక్కంటి మహిళ, ఆమె అన్నపై బ్లేడ్‌తో విచాక్షణారహితంగా దాడి చేశారు. ఇద్దరికీ తీవ్ర గాయాలవడంతో వెంటనే వారిని ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఇద్దరికీ వైద్యులు చికిత్స అందజేస్తున్నారు. విషయం తెలిసిన వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు తండ్రీకొడుకులపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఏసీ వాటర్ విషయంలో తండ్రీకొడుకులు ప్రవర్తించిన తీరు స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

# యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యం.

- జీవన శైలిలో యోగ ఒక భాగంగా అలవర్చుకోవాలి
- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్





**నారాయణపేట, ఏప్రిల్,10(సమయం న్యూస్) :** యోగ చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని, రోజూవారి జీవనశైలిలో యోగ ప్రక్రియను ఒక భాగంగా దినచర్య అలవర్చుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రానికి సమీపంలోని సింగారం మలుపు దారి వద్ద గల వృత్తి నైపుణ్య శిక్షణా కేంద్రంలో 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక' హెల్త్ వీక్ లో భాగంగా హోమియోపతి పితామహుడు డాక్టర్ క్రిస్టియన్ ఫ్రెడరిక్ శామ్యూల్ హానిమాన్ 271వ జయంతిని పురస్కరించుకుని ప్రపంచ హోమియోపతి ( ఆయుష్ డే ) దినోత్సవ యోగ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ జిల్లా అదనపు కలెక్టర్లు ఫణీంద్ర రెడ్డి, శ్రీను తో కలిసి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ యోగా చేయడం ద్వారానే సంపూర్ణమైన ఆరోగ్యం సాధ్యమవుతుందని ప్రజల దినచర్యలో యోగా ఒక భాగంగా అలవర్చుకోవాలని ఉదయం గంట పాటు యోగ చేయడం ద్వారా శరీరం మెదడు చురుకుగా పనిచేస్తాయని తెలిపారు. పురాతన కాలం నుంచి యోగాసనాలకు ఎంతో ప్రాముఖ్యత ఉంది. సంపూర్ణమైన ఆరోగ్యం ద్వారా మాత్రమే మనిషి తన ఆశలను ఆశయాలను ఉన్నత లక్ష్యాలను సాధించవచ్చని పేర్కొన్నారు. సమయం దొరికినప్పుడల్లా తాను యోగా చేస్తానని తెలిపారు. తన సోదరి ద్వారా యోగా నేర్చుకున్నానని ఆయన చెప్పారు. కలెక్టర్, అధికారులు, రాజకీయ ప్రముఖులు, వైద్యులు, ఆరోగ్య శాఖ ఉద్యోగులు, నర్సింగ్ కళాశాల విద్యార్థినులు, ఆశా కార్యకర్తలు, పతంజలి సభ్యులు ఆయుష్ సిబ్బంది, యోగాసనాలు వేసి అందర్నీ ఉత్తేజపరిచారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ శివారెడ్డి, డి ఎం హెచ్ ఓ డాక్టర్ జయ చంద్రమోహన్, డిఆర్డిఏ మొగులప్ప, బీజేపీ నేత నాగురావు నామాజీ, యోగా శిక్షకులు సురేష్, మెడికల్ కళాశాల విద్యార్థులు, మహిళా సంఘాల సభ్యులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రతపై వారం రోజుల పాటు అవగాహన కార్యక్రమాలు

- జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS



**నారాయణపేట, ఏప్రిల్,10(సమయం న్యూస్) :** Arrive Aliveతో అవగాహనతెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా అమలవుతున్న 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా, నారాయణపేట జిల్లాలో రోడ్డు భద్రతపై విస్తృత స్థాయిలో అవగాహన కల్పించేందుకు ఏప్రిల్ 13 నుంచి 18 వరకు "అరైవ్ అలైవ్" కార్యక్రమాన్ని అన్ని గ్రామ సభల్లో నిర్వహించాలని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS జిల్లా పోలీస్ అధికారులకు టెలికాన్ఫరెన్స్ ద్వారా ఆదేశించారు. రోజురోజుకు పెరుగుతున్న రోడ్డు ప్రమాదాల నేపథ్యంలో, "ఒక్క నిర్లక్ష్యం -- ఒక కుటుంబం నాశనం" అనే సందేశంతో ప్రజల్లో బాధ్యతాభావం పెంపొందించడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని ఎస్పీ తెలిపారు.

**కార్యక్రమం ముఖ్యాంశాలు:**గ్రామ స్థాయిలో రోడ్ సేఫ్టీ కమిటీల ఏర్పాటుట్రాఫిక్ నియమాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలుఅంబేద్కర్ జయంతి సందర్భంగా ట్రాఫిక్ నియమాల పాటనపై ప్రమాణ స్వీకారంప్రమాదాలకు గురయ్యే ప్రదేశాల గుర్తింపు, నివారణ చర్యలుపిల్లల కోసం ప్రత్యేక రోడ్ సేఫ్టీ డే నిర్వహణహెల్మెట్, సీట్‌బెల్ట్ ప్రాముఖ్యతపై అవగాహనసోషల్ మీడియా ద్వారా యువతలో ప్రచారంమద్యం సేవించి డ్రైవింగ్, ఓవర్ స్పీడింగ్‌పై ప్రత్యేక డ్రైవ్‌లు

**గోల్డెన్ అవర్ ప్రాధాన్యత:**రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే ప్రాణాలను కాపాడే గోల్డెన్ అవర్ పై పోలీస్, అంబులెన్స్ సిబ్బంది, వాలంటీర్లకు ప్రత్యేక శిక్షణ అందించనున్నారు. జిల్లాలోన్ రోడ్డు ప్రమాదంలో జరిగితే వెంటనే సమాచారం ఇవ్వడానికి ప్రత్యేక హాట్ లైన్ నెంబర్ ఏర్పాటు చేయడం జరిగిందని 8889808182 కి సమాచారం ఇవ్వాలని తెలిపారు.

**జీరో ఎన్‌ఫోర్స్‌మెంట్ డే:**చివరి రోజున ఉల్లంఘనదారులకు కౌన్సెలింగ్ నిర్వహించి, శిక్షల కంటే అవగాహన ద్వారా మార్పు తీసుకురావడమే లక్ష్యంగా చర్యలు చేపడతారు. విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యం: స్కూల్ పరిసరాల్లో జీబ్రా క్రాసింగ్‌లు, స్పీడ్ లిమిట్ బోర్డులు ఏర్పాటు చేసి చిన్నారుల భద్రతను బలోపేతం చేయనున్నారు. ఎస్పీ సందేశం:

"హెల్మెట్ ఒక అలవాటు కాదు -- అది ప్రాణ రక్షణ కవచం""సీట్‌బెల్ట్ ఒక నియమం కాదు -- అది కుటుంబానికి ఇచ్చే హామీ"

ప్రతి యువకుడు బాధ్యతగా డ్రైవింగ్ చేస్తేనే సమాజం మారుతుందని, ప్రతి గ్రామం సురక్షితంగా మారితేనే జిల్లా సురక్షితం అవుతుందని ఎస్పీ పిలుపునిచ్చారు. లిప్రజలకు పిలుపు:లిస్పీడ్ తగ్గించు -- జీవితం కాపాడు

జాగ్రత్తగా వాహనం నడపు -- సురక్షితంగా చేరుకో"ట్రాఫిక్ నియమాలు పాటించండి... మీరు, మీ కుటుంబం సురక్షితంగా ఇంటికి చేరండిఈ Arrive Alive కార్యక్రమంలో ప్రజలు ప్రతి ఒక్కరూ పాల్గొని, రోడ్డు భద్రత నియమాలను పాటించాలని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

# ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో భాగస్వాములు కావాలి

- సోషల్ మీడియా ఇన్ ఫ్లుయెన్సర్లతో భేటీలో కలెక్టర్ ఇలా త్రిపాఠి



**నిజామాబాద్, ఏప్రిల్ 10 ( సమయం న్యూస్).** వివిధ వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకునేలా సోషల్ మీడియా ఇన్ ఫ్లుయెన్సర్లు తమ వంతు బాధ్యతగా కృషి చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి కోరారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజలకు విస్తృత స్థాయిలో సమాచారం చేరడంలో సామాజిక మాధ్యమాలు ఎంతో క్రియాశీలక పాత్ర పోషిస్తున్నాయని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో సోషల్ మీడియా ఇన్ ఫ్లుయెన్సర్లు కూడా సంక్షేమ పథకాల అమలులో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

**ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజా పాలన --** ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణను పురస్కరించుకుని చేపట్టనున్న కార్యక్రమాలను విస్తృత స్థాయి-ిలో ప్రజలకు చేరవేయాలనే లక్ష్యంతో నిజామాబాద్ జిల్లా పాలనాధికారి ఇలా త్రిపాఠి సోషల్ మీడియా ఇన్ ఫ్లుయెన్సర్ల సేవలను వినియోగించుకునేందుకు వీలుగా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో శుక్రవారం వారితో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఇన్ స్టాగ్రామ్, ఫేస్ బుక్, యూట్యూబ్ తదితర సామాజిక మాధ్యమాల ద్వారా గణనీయమైన సంఖ్యలో ఫాలోవర్లు కలిగి ఉన్న సోషల్ మీడియా ఇన్ ఫ్లుయెన్సర్లు ఎంతో ఉత్సాహంతో తరలివచ్చి ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వివిధ వర్గాల సంక్షేమాన్ని కాంక్షిస్తూ మానవీయ కోణంలో, శాస్త్రీయ దృక్పథంతో రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలు, ప్రజోపయోగ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణాలు, సన్న బియ్యం పంపిణీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అమలు, సబ్సిడీపై వంట గ్యాస్ సిలిండర్ పంపిణీ, వడ్డీ లేని రుణాలు, రైతు రుణ మాఫీ, రైతు భరోసా వంటి అనేక పథకాలను అమలు చేస్తోందని గుర్తు చేశారు. దేశంలోనే మరెక్కడా లేని విధంగా ఇంటర్ వరకు విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని వచ్చే విద్యా సంవత్సరం నుండి అమలు చేయనుందని, ప్రభుత్వ పాఠశాలల్లో అల్పాహారం కూడా అమలు కానుందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ పథకాలను సద్వినియోగం చేసుకునేలా సోషల్ మీడియా ఇన్ ఫ్లుయెన్సర్లు తమ సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజలకు విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. అదేవిధంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాలలో భాగస్వాములై వాటి విజయవంతానికి తోడ్పాటును అందించాలని కోరారు. ప్రధానంగా రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ఉద్దేశించిన అరైవ్ - అలైవ్ కార్యక్రమాన్ని తమదైన శైలిలో ప్రజకు చేరవేయాలని, తద్వారా ప్రమాదాల నియంత్రణకు దోహదపడిన వారు అవుతారని అన్నారు. ఈ నెల 13న గ్రామ పంచాయతీల స్థాయిలో జరిగే గ్రామ సభలతో పాటు, 16న జరిగే మండల స్థాయి ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక సభలలో పాల్గొని ప్రజలను చైతన్యపర్చాలని దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వ కార్యక్రమాల అమలులో భాగస్వాములయ్యే సామాజిక మాధ్యమకర్తలకు జిల్లా యంత్రాంగం తరపున తప్పనిసరిగా తగిన గుర్తింపును అందిస్తామని అన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ దిలీప్ కుమార్, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ రావు, డీఈఓ అశోక్, డీఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి, డీపీఆర్ఓ పద్మశ్రీ తదితరులు పాల్గొన్నారు.

# ప్రధానమంత్రి నేషనల్ అప్రెంటిషిప్ మేలా నిర్వహణ..

- ప్రిన్సిపాల్ ఆర్.నరేంద్ర బాబు



**వికారాబాద్,ఏప్రిల్,10(సమయం న్యూస్) :** వికారాబాద్ ప్రభుత్వ పారిశ్రామిక సంస్థ ఎ.టి.సి/ ఐ.టి.ఐ లో ఏప్రిల్: 13 ,2026 సోమవారం ఉదయం 10:00 గంటలకు ప్రధానమంత్రి నేషనల్ అప్రెంటిషిప్ మేళ (గ్రావీచీూవీ) నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ ఆర్.నరేంద్రబాబు తెలిపారు. ఈ ప్రధానమంత్రి నేషనల్ అప్రెంటిషిప్ మేళ నందు వివిధ కంపెనీలు పాల్గొంటాయని తెలిపారు. ఐటిఐ, ఉత్తీర్ణులైన ప్రతి ఒక్కరు ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. అప్రెంటిషిప్ మేళ కు వచ్చేవారు పదవ తరగతి మరియు ఐటిఐ మార్క్స్ మెమో, కుల ధృవీకరణ సర్టిఫికేట్ తో పాటు పూర్తి వివరాలతో కూడిన బయోడేటా ఫారాన్ని తీసుకొని రావాల్సిందిగా అదే విధంగా ఏదైనా సమాచారం కోసం 9177472488 ను సంప్రదించగలరు అని ప్రిన్సిపల్ ఆర్.నరేంద్ర బాబు తెలిపారు.

## తెలంగాణ రాష్ట్ర ఉపసర్పంచ్ ల ఫోరమ్ రాష్ట్ర అధ్యక్షులు గా నియమితులైన అవిశిపేట ఆంజనేయులు గౌడ్ గారు



**చేవెళ్ల ఏప్రిల్ 10 ( సమయం న్యూస్) :** తెలంగాణ రాష్ట్ర ఉపసర్పంచ్ ల ఫోరమ్ అధ్యక్షులు గా చిన్నమంగళారం ఉప సర్పంచ్ అవిశిపేట ఆంజనేయులు గౌడ్ నియమితులయ్యారు.. తెలంగాణ రాష్ట్ర ఉపసర్పంచ్ ల ఫోరమ్ వ్యవస్థాపక అధ్యక్షులు అల్లం శ్రీనివాస్ రెడ్డి నియామక పత్రాన్ని అందించారు . ఈ సందర్భంగా అల్లం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఆంజనేయులు గౌడ్ గత 10 సంవత్సరాలు గా ప్రజలకు ఎంతో సేవ చేస్తున్నారని రాష్ట్ర ప్రజలకు ఇలాంటి ప్రజా సేవకులు అవసరమని కొనియాడారు. ఆంజనేయులు గౌడ్ ఈ పదవికి న్యాయం చేస్తారనే పూర్తి నమ్మకం ఉందని తెలిపారు నూతన రాష్ట్ర అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్ మాట్లాడుతూ తన పైన నమ్మకం తో ఇచ్చిన ఈ పదవికి న్యాయం చేస్తానని రాష్ట్రం లో ఉన్న అందరూ ఉపసర్పంచ్ లకు అండగా ఉంటామని తెలిపారు ఈ కార్యక్రమం లో మాజీ సర్పంచ్ బాలమణి రాములు,వార్డు మెంబర్లు రమేష్, నిర్మల మహిపాల్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు వెంకట్ రెడ్డి,బిక్షపతి గౌడ్,వెంకటేష్ గౌడ్,శివశంకర్ గ్రామ యువకులు సురేష్,వెంకటేష్,ప్రసాద్,కిరణ్,అనిల్,పవన్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాకు నియమితులైన రెవిన్యూ అదనపు కలెక్టర్

- ఇ. వెంకటాచారి పదవీ బాధ్యతలను స్వీకరించారు.





**వికారాబాద్, ఏప్రిల్,10(సమయం న్యూస్) :** వికారాబాద్ జిల్లా కు నియమితులైన రెవెన్యూ ఆదనపు కలెక్టర్ ఇ. వెంకటాచారి బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ని మర్యాదపూర్వకంగా కలుసుకుని బాధ్యతలు స్వీకరించారు. జిల్లాలో భూ పరిపాలన, ఆదాయ వనరుల నిర్వహణ, ప్రభుత్వ భూముల పరిరక్షణ, ప్రజలకు అందించే రెవిన్యూ సేవలను పారదర్శకంగా, వేగవంతంగా అమలు చేసేందుకు నావంతు కృషి చేస్తానని అన్నారు. జిల్లా అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని, అన్ని శాఖలతో సమన్వయంతో పనిచేస్తామని,ప్రజల నుండి వచ్చే ఫిర్యాదులను ప్రాధాన్యతతో పరిష్కరించి, సేవలను సమర్థవంతంగా అందించేందుకు కృషి చేస్తామని రెవిన్యూ అదనపు కలెక్టర్ తెలిపారు.

## డ్రగ్స్ నివారణ అందరి బాధ్యత

- మెడ్-వన్ హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ వెంకట్ రమణారెడ్డి



**సమయం న్యూస్ గజ్వేల్, ఏప్రిల్ 10:** డ్రగ్స్ నివారణ అందరి బాధ్యత అని మెడ్-వన్ హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ వెంకట్ రమణారెడ్డి అన్నారు. మెడ్-వన్ హాస్పిటల్స్, గజ్వేల్ రన్నర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 12న గజ్వేల్ పట్టణంలోని ఐఓసీ గ్రౌండ్స్ లో నిర్వహించనున్న ప్రోమో రన్ లో రిజిస్ట్రేషన్ చేసుకున్న ప్రతి ఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. డ్రగ్స్ నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండేందుకు వ్యాయామాన్ని జీవితంలో భాగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. గజ్వేల్ రన్నర్స్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమాన్ని ఆయన అభినందించారు. యాంటీ డ్రగ్స్ తో పాటు ఫిట్ నెస్ పై ప్రజలకు అవగాహన కల్పించే లక్ష్యంతో చేపట్టిన ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. వారితో గజ్వేల్ రన్నర్స్ అసోసియేషన్ సభ్యులు జంగం రమేష్ గౌడ్, కె మధుసూదన్ రెడ్డి, తాళ్ల నరేష్ గౌడ్, తాళ్ల నానిగౌడ్, ముస్తఫా, గుజ్జ ప్రవీణ్, అష్రఫ్ మెడ్-వన్ హాస్పిటల్స్ ప్రతినిధులు రాజుగౌడ్, విజయ్ కుమార్ తదితరులు ఉన్నారు.

## పి.డి.ఎస్ బియ్యం అక్రమ రవాణా అడ్డుకట్ట

-- వాహనం స్వాధీనం: టౌన్ ఎస్సై వెంకటేశ్వర్లు

**నారాయణపేట,ఏప్రిల్,10(సమయం న్యూస్) :** శుక్రవారం నారాయణపేట పట్టణంలోని యాద్గిర్ రోడ్డు, బైరం కొండ గ్రామ సమీపంలో టాస్క్ ఫోర్స్ మరియు నారాయణపేట పోలీసులు సంయుక్తంగా వాహనాల తనిఖీలు నిర్వహించాగా ఈ సందర్భంగా పి.డి.ఎస్ (గ్రాణూ) బియ్యం అక్రమంగా తరలిస్తున్న వాహనాన్ని పట్టుకున్నారు. పట్టుబడిన వాహనం (టూ 06 ఖణ 0828) అశోక్ లే లాండ్ వాహనం నుండి మొత్తం 50 బియ్యం సంచులు, సుమారు 25 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు.బియ్యం, వాహన యజమాని వెంకటేష్, నివాసం నర్సాపూర్ గ్రామం, దామరగిడ్డ మండలం అని తెలిపారు.డి.టి కాలప్ప పంచనామ అనంతరం వెంకటేష్ పై నారాయణపేట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు.

## అక్రమ ఇసుక నిల్వలపై పోలీసుల మెరుపు దాడి

### -- 50 ట్రాక్టర్ల ఇసుక సీజ్

● అక్రమ ఇసుక తరలిస్తే కఠిన చర్యలు- పెద్దముల్ ఎస్సై ప్రశాంత్ వర్ధన్



**పెద్దేముల్, ఏప్రిల్ 10:(సమయం న్యూస్) :** మండల పరిధిలోని మదనంతపూర్ తాండ మరియు కొండాపూర్ గ్రామాల శివారుల్లో అక్రమంగా నిల్వ ఉంచిన భారీ ఇసుక నిల్వలను పోలీసులు శుక్రవారం సీజ్ చేశారు. నమ్మదగిన సమాచారం మేరకు పెద్దేముల్ పోలీసులు ఈ ఆకస్మిక తనిఖీలు చేపట్టారు.వివరాల్లోకి వెళ్తే:మదనంతపూర్ తాండ, కొండాపూర్ గ్రామ శివారు ప్రాంతాల్లో కొందరు వ్యక్తులు అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను నిల్వ ఉంచినట్లు పోలీసులకు సమాచారం అందింది. ఈ మేరకు పెద్దేముల్ ఎస్సై ప్రశాంత్ వర్ధన్ తన సిబ్బందితో కలిసి రంగంలోకి దిగి తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో సుమారు 50 ట్రాక్టర్ల ఇసుక నిల్వలను గుర్తించి, వాటిని వెంటనే సీజ్ చేశామన్నారు. అనంతరం సీజ్ చేసిన ఇసుకను తదుపరి చర్యల నిమిత్తం రెవిన్యూ అధికారులకు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను అక్రమంగా నిల్వ చేసినా లేదా తరలించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు.ఈ తనిఖీల్లో ఎస్సై ప్రశాంత్ వర్ధన్‌తో పాటు హెడ్ కాన్స్టేబుల్ రఫీ, కొండాపూర్ విఆర్ఏ వెంకటయ్య మరియు ఇతర పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## రక్తదానం ప్రాణదానంతో సమానం

● కలెక్టరెట్ లో రక్తదాన శిబిరం

● ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమం లో భాగం గా అధికారుల రక్త దానం

● జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**జనగాం ఏప్రిల్10( సమయం న్యూస్). :** ప్రభుత్వ ఉద్యోగులు కూడా సామజిక కార్యక్రమాలలో పాలు పంచుకోవాలన్న ఉద్దేశ్యం తో... ప్రజా పాలన.. ప్రగతి ప్రణాళిక కార్యక్రమం లో భాగం గా కలెక్టరెట్ లో రక్త దాన శిబిరాన్ని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశాల మేరకు జిల్లా ఆరోగ్య, వైద్య శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం రక్త దాన శిబిరాన్ని ఏర్పాటు చేసారు ఈ శిబిరాన్ని..డి ఏం ఎచ్ ఓ మల్లిఖార్జున్ రావు, డి సి ఎచ్ ఎస్ నరేందర్ శర్మ , మెడికల్ అధికారులు అన్వర్, దివ్య లతో కలిసి జిల్లా కలెక్టర్ సందీప్ ఝా ప్రారంభించారు ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ....రక్తదానం చేయడం ప్రాణదానంతో సమానమన్నారు ఇది ఎంతో నిస్వార్థమైన, గొప్ప మానవీయ సేవ అని...దీని వల్ల....ఆరోగ్యవంతులైన వ్యక్తులు చేసే రక్తదానం, ప్రమాదాల్లో, శస్త్రచికిత్సల్లో, తీవ్రమైన వ్యాధులతో ఇబ్బంది పడుతున్న వారి ప్రాణాలను నిలబెడుతుందన్నారు . రక్తదానం చేయడం వల్ల గుండెపోటు ప్రమాదం తగ్గుతుందని...శరీరంలో ఐరన్ స్థాయిలు అదుపులో ఉంటాయన్నారు ఈ రక్త దాన శిబిరం లో వివిధ శాఖల అధికారులు, వారి సిబ్బంది మొత్తం 62 మంది తమ రక్తాన్ని దానం చేసారు ఈశిబిరాన్ని...మెడికల్ అధికారులు, వారి టెక్నీషియన్స్ సజావుగా నిర్వహించి రక్తం దానం చేసిన వారికి పండ్లు, జ్యూస్ లను అందించారు

## నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనాన్ని ప్రారంభానికి సిద్ధం చేయాలి

● జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

● ధర్మారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్



**ధర్మారం, ఏప్రిల్ 10( సమయం న్యూస్). :** శుక్రవారం ధర్మారం మండల కేంద్రం నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనాన్ని ప్రారంభానికి సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పెండింగ్ లో ఉన్న పనులను పెయింటింగ్, లైటింగ్, కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులు సకాలంలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని, కలెక్టర్ అధికారులను ఆదేశించారు.ఈ పర్యటనలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్. ప్రమోద్ కుమార్ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# న్యూట్రల్ రసాయన పరిశ్రమలో భారీ అగ్నిప్రమాదం

● సుమారు మూడు కోట్ల ఆస్తి నష్టం,ఎలాంటి ప్రాణనష్టం లేదు

● పరిశ్రమ ఎండి మల్లికార్జున్ రెడ్డి








**పటాన్ చెరు (జిన్నారం), ఏప్రిల్ 10 (సమయం న్యూస్):** సంగారెడ్డి జిల్లా జిన్నారం మండల పరిధిలోని గడ్డపోతారం పారిశ్రామికవాడలో ఉన్న న్యూట్రల్ రసాయన పరిశ్రమలో శుక్రవారం మధ్యాహ్నం ఘోర అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ఘటనతో పరిశ్రమ ప్రాంతం మొత్తం ఒక్కసారిగా కలకలం రేగింది. పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులు మంటలు చెలరేగడంతో తీవ్ర భయాందోళనలకు గురై బయటకు పరుగులు తీశారు.ప్రమాదం సంభవించిన వెంటనే పరిశ్రమ పరిసర ప్రాంతాల్లో దట్టమైన పొగలు వ్యాపించాయి. ఆ పొగలు గడ్డపోతారం పారిశ్రామికవాడ అంతటా వ్యాపించడంతో సమీప ప్రాంతాల ప్రజలు కూడా భయభ్రాంతులకు గురయ్యారు. కొంతమంది తమ ఇళ్లను వదిలి బయటకు రావడం గమనార్హం.సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది అప్రమత్తమై సంఘటన స్థలానికి మూడు ఫైర్ ఇంజన్లతో చేరుకున్నారు. గంటల పాటు శ్రమించి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. అగ్నిమాపక సిబ్బంది సమయానికి స్పందించడంతో మంటలు ఇతర పరిశ్రమలకు వ్యాపించకుండా అరికట్టగలిగారు.ఈ ఘటనపై పరిశ్రమ యజమాని మల్లికార్జున్ రెడ్డి స్పందిస్తూ, సాల్వెంట్లను డిస్టిలేషన్ చేసే సమయంలో యంత్రాల్లో ఒత్తిడి పెరగడం వల్లే ఈ ప్రమాదం సంభవించి ఉండవచ్చని తెలిపారు. ప్రమాదం జరిగిన సమయంలో కార్మికులు అప్రమత్తంగా బయటకు రావడంతో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని ఆయన స్పష్టం చేశారు.అయితే ఈ అగ్నిప్రమాదం కారణంగా పరిశ్రమలో ఉన్న యంత్రాలు, ముడి సరుకు, నిల్వలో ఉన్న రసాయనాలు పూర్తిగా దగ్ధమయ్యాయని తెలిపారు. ఈ ఘటనలో సుమారు మూడు కోట్ల రూపాయల ఆస్తి నష్టం వాటిల్లినట్లు అంచనా వేస్తున్నారు.సంఘటన స్థలానికి బొల్లారం సీఐ రవీందర్ రెడ్డి, జిన్నారం తహసిల్దార్ దేవదాస్ చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. పోలీసులు కేసు నమోదు చేసి ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలపై దర్యాప్తు ప్రారంభించారు. పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని అధికారులు సూచించారు.

# సంపూర్ణ ఆరోగ్యం యోగతోనే సాధ్యం

● జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి

● సంపూర్ణ ఆరోగ్యం యోగతోనే సాధ్యమని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు.



**హన్మకొండ ఏప్రిల్10( సమయం న్యూస్) :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజా పరిపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా హనుమకొండ జిల్లాలో వైద్య ఆరోగ్య, ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో ఉచిత యోగ శిబిరం,యోగ అవగాహన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి హాజరై ప్రారంభించి, స్వయంగా యోగాసనాలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, యోగా మన భారతీయ సంస్కృతిలో అంతర్భాగమని, మన దేశంలో పుట్టిన యోగా విధానం నేడు ప్రపంచవ్యాప్తంగా విస్తరించి, అంతర్జాతీయ స్థాయిలో కూడా ప్రాముఖ్యత పొందిందన్నారు. యోగా దినోత్సవాన్ని ప్రపంచ దేశాలు జరుపుకోవడం మన సంస్కృతి గొప్పతనానికి నిదర్శనమని పేర్కొన్నారు.లండన్ వంటి విదేశీ నగరాల్లో కూడా చిన్నారులకు వారానికి ఒక రోజు యోగా తరగతులు నిర్వహించడం జరుగుతుండటం, యోగా ప్రాముఖ్యతను స్పష్టంగా తెలియజేస్తోందన్నారు. యోగ సాధన ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు జీవనశైలి సంబంధిత వ్యాధులను నివారించుకోవచ్చని తెలిపారు.ప్రత్యేకంగా మహిళలు, ముఖ్యంగా ముప్పై సంవత్సరాలు దాటిన వారు తప్పనిసరిగా యోగాన్ని అలవాటు చేసుకోవాలని సూచించారు. యోగం చేయడం ద్వారా ఆరోగ్యవంతమైన జీవనం సాధ్యమవుతు ందని, మందులపై ఆధారపడే అవసరం తగ్గుతుందని కలెక్టర్ తెలిపారు. హోమియోపతి పితామహుడు డాక్టర్ క్రిస్టియన్ ఫ్రెడరిక్ శామ్యూల్ హానీమన్ జయంతి మరియు ఆయుష్ దినోత్సవం సందర్భంగా వడ్డేపల్లి పార్క్‌లో ఆ మహనీయుని చిత్ర పటానికి కలెక్టర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఉచిత హోమియో, ఆయుర్వేద వైద్య సేవలతో మెగా హెల్త్ క్యాంప్ నిర్వహించారు. ఈ శిబిరాన్ని కార్పొరేటర్ దాస్యం అభినయ భాస్కర్ ప్రారంభించగా, డిఎం హెచ్ ఓ డాక్టర్ అప్పయ్య ఆయుష్ వైద్య సేవల విశిష్టతను వివరించారు.అనంతరం వైద్యులు రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా హోమియో మరియు ఆయుర్వేద మందులను అందజేశారు. ఈ శిబిరంలో మొత్తం 453 మంది రోగులకు వైద్య సేవలు అందించారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ అభినవ్ భాస్కర్, ఆయుష్ జిల్లా ఇన్‌చార్జ్ డాక్టర్ ఎస్. మహేంద్ర కుమార్ , జిల్లా ప్రోగ్రాం మేనేజర్ భాను కుమార్,డిఎం హెచ్ఓ డాక్టర్ అప్పయ్య, డిపిఆర్ ఓ ఆయుబ్ అలీ, వైద్యులు డాక్టర్ జగదీశ్వర్ ప్రసాద్, డాక్టర్ రజిత, డాక్టర్ శోభ, డాక్టర్ కిరణ్ కుమార్, ఫార్మసిస్ట్ సిబ్బంది పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.

## యూపీఎస్సీ ద్వారా నిర్వహించే పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు పూర్తి చేయాలి

హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి

హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో ఈ నెల 12న యూపీఎస్సీ - ఎన్డీఏ, నావల్ అకాడమీ ఎగ్జామినేషన్ నిర్వహణపై వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించిన జిల్లా కలెక్టర్



**హనుమకొండ, ఏప్రిల్ 10,( సమయం న్యూస్) :** యూపీఎస్సీ నిర్వహించే నేషనల్ డిఫెన్స్ అకాడమీ (ఎన్డీఏ), నావల్ అకాడమీ మరియు కంబైన్డ్ డిఫెన్స్ సర్వీస్ (సీడీఎస్) పరీక్షల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అధికారులను ఆదేశించారు.ఈనెల 12న నిర్వహించనున్న పరీక్షల సందర్భంగా కేంద్రాల వద్ద భద్రత, నిరంతర విద్యుత్, వైద్య సదుపాయాలు, ప్రశ్నాపత్రాల రవాణా తదితర అంశాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అభ్యర్థుల సౌకర్యార్థం ఆర్టీసీ ద్వారా ప్రత్యేక బస్సులు నడపాలని తెలిపారు.జిల్లాలో యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో రెండు, పింగిలి ప్రభుత్వ బాలికల కళాశాలలో ఒక పరీక్షా కేంద్రం ఏర్పాటు చేయగా, మొత్తం 963 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు.కలెక్టర్ మాట్లాడుతూ, నేషనల్ డిఫెన్స్ అకాడమీ, నావల్ అకాడమీ పరీక్ష మొదటి పేపర్ ఉదయం 10.00 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, రెండో పేపర్ మధ్యాహ్నం 2.00 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు నిర్వహించబడుతుందని తెలిపారు. అదేవిధంగా కంబైన్డ్ డిఫెన్స్ సర్వీస్ ఎగ్జామినేషన్--1లో మొదటి పేపర్ ఉదయం 9.00 గంటల నుంచి 11.00 గంటల వరకు, రెండో పేపర్ మధ్యాహ్నం 12.30 గంటల నుంచి 2.30 గంటల వరకు, మూడో పేపర్ సాయంత్రం 4.00 గంటల నుంచి 6.00 గంటల వరకు జరుగుతుందని పేర్కొన్నారు. సంబంధిత అధికారులు అన్ని ఏర్పాట్లు సమయానికి పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి సత్యపాల్ రెడ్డి, కలెక్టరేట్ పరిపాలన అధికారి గౌరీ శంకర్, విద్యుత్ శాఖ ఎస్ఈ మధుసూదన్ రావు, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ అప్పయ్య, బీసీ సంక్షేమ అధికారి నరసింహమూర్తి, ఆర్టీసీ డీఎం ధరమ్ సింగ్, పింగిలి కళాశాల ప్రిన్సిపాల్ చంద్రమౌళి, పోస్టల్, పోలీస్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.




## హెచ్పీవీ టీకాతో సర్వైకల్ క్యాన్సర్ నివారణ

● డీఎంహెచ్ఓ మల్లికార్జున రావు

**జనగాం ఏప్రిల్10( సమయం న్యూస్):** సర్వైకల్ క్యాన్సర్ నివారణలో హెచ్పీవీ టీకా కీలక పాత్ర పోషిస్తుందని డీఎంహెచ్ఓ మల్లికార్జున రావు పేర్కొన్నారు.శుక్రవారం, జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన (హ్యూమన్ పాపిలోమా వైరస్) హెచ్పీవీ టీకాపై డీఎల్సీసీ సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ.. జిల్లాలో 14 సంవత్సరాలు పూర్తై 15 సంవత్సరాలు మించని ఆడపిల్లల ఆరోగ్య రక్షణకు ప్రభుత్వం చేపట్టిన ప్రత్యేక కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోందని, ఇప్పటివరకు జిల్లాకు మొత్తం (1079) టీకాలు కేటాయించగా (625) మంది ఆడపిల్లలకు టీకాలు విజయవంతంగా పూర్తిచేయడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమం ద్వారా బాలికల్లో ఆరోగ్య అవగాహన పెంపొందించడంతో పాటు భవిష్యత్తులో వచ్చే వ్యాధులను నివారించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జిల్లాలోని అన్ని పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల ద్వారా ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేస్తున్నామన్నారు.తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేసి, ఆరోగ్య రక్షణకు సహకరించాలని కోరారు.ఈ సమావేశంలో డీఎంహెచ్ఓ మల్లికార్జున రావు, డీసీహెచ్ఎస్ నరేంద్ర శర్మ, జీజీహెచ్ సూపరింటెండెంట్ రాజలింగం, డీడబ్ల్యూఓ కోదండరాములు, విద్యా శాఖ ఏడీ సత్యనారాయణ మూర్తి, ఇతర సంబంధిత అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# పుష్కరాల ఘాట్లకు వెళ్లే రోడ్లను నిర్ణీత సమయంలోగా పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష
- మంథని పుష్కర ఘాటు వద్ద హెలిప్యాడ్ ఏర్పాటు చేయాలి
- ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్, నీటిపారుదల శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్




**పెద్దపల్లి, ఏప్రిల్ -10( సమయం న్యూస్).:** పుష్కరాల ఘాట్లకు వెళ్లే రోడ్లను నిర్ణీత సమయంలోగా పూర్తి చేయాలనిలిజిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్షలి అన్నారు. శుక్రవారం లిజిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, ఇంజనీరింగ్ చీఫ్ మోహన్ నాయక్‌లితో కలిసి సమీకృత జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్, నీటిపారుదల శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ , జిల్లాలోని మంథని, గోలివాడ గోదావరిఖని పుష్కర ఘాట్లకు వెళ్లే రహదారులను నిర్ణీత సమయంలో గా పూర్తి చేయాలని, పుష్కరాల సమయంలో గోలివాడ సమ్మక్క సారలమ్మ జాతర వద్ద రోజుకు 30 వేల మంది భక్తులు వస్తారనే అంచనా తో శాశ్వత అభివృద్ధి పనులు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. గోదావరిఖని సమ్మక్క సారలమ్మ జాతర వద్ద 50 శాతం వరకు శాశ్వత పనులు పూర్తయ్యాయని, అక్కడ స్నానాల ఘాట్, కళ్యాణ కట్ట, పిండె ప్రధానం చేసే స్థలం ఏర్పాటు పనులు రోజుకు లక్ష మంది భక్తులు వచ్చిన తట్టుకునేలా చేపట్టాలన్నారు. సుందిళ్ల గ్రామంలోని లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయం వద్ద రోడ్ల మరమ్మత్తు పనులు, బ్యారెజీ వద్ద రోడ్డు డబుల్ లైన్ చేయాలన్నారు. మంథని గౌతమేశ్వర ఆలయం వద్ద గోదావరి పుష్కరాల సమయంలో రోజుకు రెండు లక్షల వరకు భక్తులు వచ్చే అవకాశం ఉందని , ఇక్కడ సురబండేశ్వర్ స్వామి టెంపుల్ నుండి శివాలయం వరకు ఉన్న ఘాట్ వద్ద ఇన్ ఛ ఔట్ ఏర్పాట్లు చేయాలని అన్నారు. మంథని పట్టణంలోని అన్ని దేవాలయాలకు అంతర్గత రోడ్లు నిర్మించాలని, పుష్కర ఘాటు వద్ద హెలిప్యాడ్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో ఆర్ అండ్ బి ఇఇ బావ్ సింగ్, మంథని మున్సిపల్ కమిషనర్ మనోహర్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# సెల్ టవర్ బ్యాటరీల చోరీలకు పాల్పడతున్న అంతర్ రాష్ట్ర ముఠా అరెస్టు

శివారు ప్రాంతాల్లోని సెల్ టవర్ల సంబంధించిన బ్యాటరీలను చోరీలకు పాల్పడుతున్న ముఠాలోని ఐదుగురిని హసన్‌పర్తి పోలీసులు అరెస్టు చేయగా, మరో ఇద్దరు నిందితులు ప్రస్తుతం పరారీలో వున్నారు. పట్టుబడిన నిందితుల నుండి పోలీసులు సుమారు 1లక్ష 98వేల రూపాయల విలువ గల 144 సెల్ టవర్ బ్యాటరీలు, 2లక్షల 60వేల రూపాయల నగదు, రెండు ట్రాలీలు , రెండు ద్విచక్ర వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.
పోలీసులు అరెస్టు చేసిన నిందితులందరు నల్గొండ జిల్లాకు చెందిన కొంపల్లి గణేష్ (27), బొంగరాల సుధాకర్ (30), తన్నీరు శివాజీ (26), బీమనబోయిన నరసింహ (31), గడగోజు సురేష్ (25)లు గుర్తించడం జరిగింది.



**హన్మకొండ ఏప్రిల్10( సమయం న్యూస్) :** ఈ అరెస్టు సంబంధించి వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ వివరాలను వెల్లడిస్తూ పోలీసులకు పట్టుబడిన నిందితుల్లో ప్రధాన నిందితుడైన గణేష్ (డ్రైవర్) మిగితా మిగితా ఇద్దరు నిందితులైన సుధాకర్,శివాజీలకు జనరేటర్ మరమ్మత్తులు, సెల్ టవర్ పనులకు పరిజ్ఞానం కలిగి వుండటంతో ముఠాగా ఏర్పడి, సులభంగా డబ్బు సంపాదించాలనే అలో చనతో సెల్ టవర్లపై పరిజ్ఞానం కలిగి వుండటంతో సెల్ టవర్లకు వినియోగించే బ్యాటరీల్లోని కొన్నింటి తప్పించడం ద్వారా సెల్ టవర్ పనతీరులో ఎలాంటి సమస్యలు రావని గుర్తించిన నిందితులు సెల్ టవర్ బ్యాటరీలను చోరీలు చేసేందుకుగా సిద్దపడి ఈ ముగ్గురు నిందితులు సెల్ టవర్‌లోని బ్యాటరీలను చోరీ చేసి మహారాష్ట్రలోని గచ్చిరోలి ప్రాంతంలో విక్రయించి వచ్చిన డబ్బుతో ముగ్గురు నిందితులు జల్సాలు చేసేవారు. ఇదే సమయంలో రాత్రి సమయాల్లో చెరువుల్లో చేపలను చోరీలకు పాల్పడే మిగితా ముఠా సభ్యులు సైతం కలవడంతో, ఈ ముఠా సభ్యులు చేపలు చోరీలకు పాల్పడే సమయంలోనే బ్యాటరీలు చోరీ చేసేందుకు అనుకూలంగా వున్న సెల్ టవర్లను గుర్తించిన సెల్ టవర్లలోని బ్యాటరీలను చోరీలకు పాల్పడేవారు. అలాగే చెరువుల్లో చోరీ చేసిన చేపలను నల్గొండ లో తక్కువ ధర విక్రయించేవారు. ఈ తరహాలో నిందితులు వరంగల్ కమిషనరేట్, యాదాద్రి,నల్గొండ ,సూర్యపేట జిల్లాల్లో వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో మొత్తం 13 సెల్ టవర్ బ్యాటరీ చోరీలకు పాల్పడ్డారు. గత నెల మార్చ్ 3వ తారీకున హసన్‌పర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని అనంతసాగర్ ప్రాంతంలోని సెల్ టవర్ నుండి 48 బ్యాటరీలకు చోరీకు గురికావడంతో ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు హసన్‌పర్తి పోలీసులు సెంట్రల్ జోన్ డిసిపి దార కవిత అధ్వర్యంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులకు అందుబాటులో వున్న టెక్నాలజీని వినియోగించుకోని ముఠా సభ్యులను గుర్తించిన పోలీసులు నిందితుల కదలికలపై నిఘా పెట్టారు. పక్కా సమచారంతో ఈ రోజు తెల్లవారుజామున నిందితులు చోరీ సొత్తును అమ్మేందుకు హసన్‌పర్తి మండలం, దేవన్నపేట గ్రామ శివారు ప్రాంతంలోని అవుటర్ రింగ్ రోడ్డు టోల్ గేట్ వద్ద వేచి వున్న ముఠాలోని ఐదుగురు సభ్యులను హసన్ పర్తి పోలీసులు అరెస్టు చేసారు. నిందితులు ఇచ్చిన సమచారంతో పోలీసులు చోరీ సోత్తు స్వాధీనం చేసుకున్నారు.నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కబరిచిన సెంట్రల్ జోన్ డిసిపి ధార కవిత, కాజీపేట ఏసిపి ప్రశాంత్ రెడ్డి, హసన్‌పర్తి ఇన్స్పెక్టర్ చేరాలు,యస్ ఐ లు దేవేందర్, సుజిత్ రెడ్డి, కానిస్టేబుళ్ళు క్రాంతి కుమార్,బావు సింగ్,వెంకట స్వామి, భరత్ తో పాటు ఇతర పోలీస్ అధికారులు, సిబ్బందిని వరంగల్ పోలీస్ కమిషనర్ అభినందించారు.

# యోగా సాధన ద్వారా శారీరకంగా మానసికంగా ఆరోగ్యం మెరుగుపడుతుందని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు.

**భూపాల పల్లి ఏప్రిల్10( సమయం న్యూస్) :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా, ఆరోగ్య వారోత్సవం మరియు హోమియోపతి డేని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని ఇల్లందు క్లబ్‌లో ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో యోగా సెషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా హోమియోపతి వైద్య విధాన పితామహుడు డా. క్రిస్టియన్ ఫ్రెడ్రిక్ సామ్యూయెల్ హానెమాన్ గారి 271వ జయంతి సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వత్తిడి జయించడానికి యోగా అద్భుతమైన సాధనమని తెలిపారు. ప్రజలు ప్రతిరోజూ యోగాను తమ దైనందిన జీవితంలో భాగం చేసుకుని క్రమం తప్పక సాధన చేసుకోవాలని సూచించారు. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహణ వల్ల ప్రజలకు ఆరోగ్యంపై



అవగాహన పెంపొందించడంతో పాటు ఆయుష్ సేవలను ప్రజలకు మరింత చేరువచేయడాని ముఖ్య పాత్ర పోషిస్తుందని తెలిపారు. ఎస్పి సిరిశెట్టి సంకీర్త్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం ఆరోగ్య వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు చిన్నతనం నుండే ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ప్రజలు వత్తిడి లేని జీవనం సాగించేందుకు యోగా చక్కగా పనిచేస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా ఆయుష్ వైద్య విధానాల ప్రాముఖ్యతను వివరించారు. యోగ సెషన్ అనంతరం ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ కార్యక్రమాలను ఆయుష్ వైద్యులు డా. తనూజా రాణి ఆధ్వర్యంలో సమర్థవంతంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీమతి విజయ లక్ష్మి, మునిసిపల్ చైర్మన్ బుర్ర కొమ్మురయ్య, వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా మధుసూదన్, డిపిఆర్వో శ్రీనివాస్, ఆర్డిఓ హరికృష్ణ, తహసీల్దార్ లక్ష్మీ రాజయ్య, రెడ్ క్రాస్ చైర్మన్ శ్రీనివాస్, కౌన్సిలర్ అప్పం కిషన్, ఆయుష్ జిల్లా వైద్య బృందం, యోగా ఇన్‌స్ట్రక్టర్లు, నర్సింగ్ విద్యార్థులు మరియు స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# వేసవిలో మంచినీటి సమస్య తలెత్తకుండా చర్యలు

- తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

**కాటారం ఏప్రిల్10( సమయం న్యూస్). :** శుక్రవారం కాటారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో మంచినీటి సరఫరాపై మిషన్ భగీరథ, ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్, పంచాయతీరాజ్ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలాల వారీగా తాగునీటి పరిస్థితులను పంచాయతీ రాజ్, మిషన్ భగీరథ, ఆర్ డబ్ల్యు ఎస్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎక్కడైనా నీటి కొరత ఉన్న ప్రాంతాలను గుర్తించి తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ముఖ్యంగా వేసవిలో పెరిగే నీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని సరఫరా వ్యవస్థను బలోపేతం చేయాలని సూచించారు. పైపు లైన్ వాల్స్ తొలగించడం వల్ల క్రింది ఇండ్లుకు నీటి సరఫరా తగ్గిపోతుందని, అలాంటి వాటిని గుర్తించి తక్షణం పునరుద్ధరణ చేయాలని తెలిపారు. అలాగే రహదారుల విస్తరణ, అభివృద్ధి పనుల సమయంలో మంచినీటి పైప్‌లైన్లు దెబ్బతినకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఎలాంటి అంతరాయం కలగకుండా సమన్వయంతో పని చేయాలని స్పష్టం చేశారు.

ప్రజలకు నిరంతరంగా సురక్షిత తాగునీరు అందించడంలో



అన్ని శాఖలు సమర్థంగా పనిచేయాలని కలెక్టర్ తెలిపారు.

ఈ సమావేశంలో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, మిషన్ భగీరథ, ఆర్ డబ్ల్యు ఎస్, విద్యుత్, పంచాయతీ రాజ్ శాఖల ఇంజినీరింగ్ అధికారులు, అన్ని మండలాల ఎంపిడిఓలు తదితరులు పాల్గొన్నారు.

# అప్పైపల్లి గ్రామం లో పంటల పరిశీలన

- కేంద్ర గణాంక శాఖ సపర్వైజర్ ప్రభాకర్,
- వ్యవసాయ శాఖ విస్తరణ అధికారి ఇస్సాక్ హెరాల్డ్



**కొడంగల్ మండలం, ఏప్రిల్,10(సమయం న్యూస్) :** కొడంగల్ మండలం లోని అప్పైపల్లె గ్రామ పంచాయతీ పరిధిలో కేంద్ర గణాంక శాఖ సూపర్వైజర్ ప్రభాకర్ మరియు వ్యవసాయ శాఖ విస్తరణ అధికారి ఇస్సాక్ హెరాల్డ్ తో కలిసి పంటలను పరిశీలించారు. వ్యవసాయ విస్తరణ అధికారి ఆన్లైన్ లో నమోదు చేసిన పంటలను వారు పొలం పై పరిశీలించి రైతులకు సలహాలు, సూచనలు చేశారు. అలా నమోదు చేసిన వివరాలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు పంపించడం జరుగుతుంది అని , తదనుగుణంగా పంట కొనుగోలు, మద్దతు ధర లభిస్తుంది అని వారు తెలిపారు. రైతులు పంట నమోదు ఏవో దగ్గర నమోదు చేసుకోవాలని, పంట కొనుగోలు లో ఇబ్బందికి గురి కావద్దు అని వారు సూచించారు. ఈ కార్యక్రమం లో గ్రామ సర్పంచ్, వార్డు సభ్యులు, ఇతర రైతులు పాల్గొన్నారు.

# ఎత్తి పొతాల పథకం ట్రయల్ రన్



**జాకొర/ చందూర్ ఏప్రిల్10( సమయం న్యూస్) :** బాన్సువాడ నియోజక వర్గంలో నిజాంసాగర్ నాన్ కమాండ్ ఏరియా 10 వేల ఎకరాలకు సాగు నీరు అందించడానికి 106 కోట్లతో నిర్మించి త్వరలో ప్రారంభించనున్న వర్ని మండలం జాకొర,చందూర్ ఎత్తిపోతల పథకాల పంపు మోటార్ల ట్రయల్ రన్ నిర్వహించిన ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ నియోజక వర్గ శాసన సభ్యులు శ్రీ పోచారం శ్రీనివాస్ రెడ్డి గారు, రాష్ట్ర ప్రభుత్వ ఎత్తిపోతల పథకాల సలహాదారులు శ్రీ పెంటారెడ్డి గారు, ఇరిగేషన్ జజు శ్రీ శ్రీనివాస్ గారు పాల్గొన్న వర్ని,చందూర్ మండలాల ప్రజాప్రతినిధులు, నాయకులు, ఇరిగేషన్ అధికారులు,రైతులు

# చిన్న గూడూరు గ్రామంలో సిసి రోడ్డు పనులను ప్రారంభించిన గ్రామ సర్పంచి రమేష్



**చిన్నగూడూరు ఏప్రిల్10( సమయం న్యూస్):** చిన్న గూడూరు గ్రామంలో దశాబ్దాల కాలంగా ఎదురుచూస్తున్న గ్రామ ప్రజలు మన డోర్నకల్ నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ రామచంద్ర నాయక్ గారి సహకారం తో గ్రామ సర్పంచి బి రమేష్ రావుల రంగారెడ్డి గారి కృషి తో గుండోజూ రామ్ ఇంటి నుంచి దాశరథి విగ్రహం వరకు సి సి రోడ్డు ను కొబ్బరి కాయలు కొట్టి ప్రారంభించారు ఈ సందర్భంగా సర్పంచి రమేష్ గారు మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి మేము కట్టుబడి ఉన్నామని తెలిపారు అలాగే రోడ్డు విస్తరణ పనులను గ్రామ ప్రజలు సహకారం చేసినందుకు వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు అదేవిధంగా కొన్ని రోజులో గ్రామ అభివృద్ధి పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు, గ్రామంలో నీటి సమస్య లేకుండా చేయడమే లక్ష్యంగా పెట్టుకొని ముందుకు పోతున్నామని 2 వ వార్డ్ నీటి సమస్య తీవ్రంగా ఉందని తెలియడంతో కొత్త పైపు లైన్ పనులు ప్రారంభించడం జరిగింది ఆ పనులను త్వర లోనే పూర్తి చేస్తామని తెలిపారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు యం వెంకటేశ్వర్లు,మండల కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు శోభా,మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి నగేష్ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు వడ్లకొండా ఆధాశీ ఉప సర్పంచి జీవన్ వార్డ్ సభ్యులు జీనక శేఖర్, గణేష్ ప్రమీల,సుజాత ఇందిరమ్మ కమిటీ సభ్యులు జంపాల శ్రీనివాస్, సోమన్న సీనియర్ జర్నలిస్ట్ జంపాల చక్రధర్ దాసరి శ్రీనివాస్ మాజీ వైస్ ఎంపిపి పిల్లి వీరన్న గంగదారి ఉప్పలయ్య ,జి శ్రీనివాస్ గాడి పల్లి అనిల్ ,బషీర్ వెంకన్న, కిరణ్ తదితరులు కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు,

# ఇండోర్ స్టేడియం పనులను త్వరిత గతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**భూపాల పల్లి ఏప్రిల్10( సమయం న్యూస్). :** శుక్రవారం కాటారం మండల కేంద్రంలో నిర్మిస్తున్న ఇండోర్ స్టేడియం పనులను జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులతో కలిసి పరిశీలించారు. ఇండోర్ స్టేడియం పనులు నత్త నడకన సాగడం పై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని త్వరిత గతిన పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. నిర్మాణానికి అవసరమైన నిధులను వెంటవెంటనే మంజూరు చేస్తామని తెలిపారు. గుత్తే దారు పనులను వేగవంతం చేయకపోతే నోటీస్ ఇచ్చి అతనిని తప్పించి నూతన గుత్తే దారుకు అప్పగించాలని సూచించారు. వానకాలం లోపు పనులు పూర్తిచేయాలని తెలిపారు. అనంతరం కాటారం మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్ షెల్టర్ స్థలాన్ని పరిశీలించి తహసీల్దార్ ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆర్టీసీ బస్సులు నిలిపేలా చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజా ప్రతినిధులు కోరగా ఆర్టీసీ అధికారులతో సమావేశం నిర్వహించి ఆదేశాలిస్తామని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, జిల్లా యువజన మరియు క్రీడల అధికారి రఘు, తహసిల్దార్ నాగరాజు, ఎంపీడీవో బాబు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగులకు సహాయ పరికరాల పంపిణీ

- ఎమ్మెల్యే కాలే యాదయ్య, ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి కలిసి పంపిణీ
- దివ్యాంగుల జీవితాల్లో స్వయం సమృద్ధి తీసుకురావడానికి ఇలాంటి సహాయ పరికరాలు ఎంతో ఉపయోగపడతాయని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య పేర్కొన్నారు



**చేవెళ్ల ఏప్రిల్ 10 (సమయం న్యూస్) :**. చేవెళ్ల మున్సిపాలిటీ కేంద్రంలోని ఐసీడీఎస్ ప్రాంగణంలో ఆర్టిఫిషియల్ లింబ్స్ మాన్యుఫాక్చరింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఖూ×వీజూ) ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా దివ్యాంగులకు సహాయ పరికరాలను ఎంపీ శ్రీ కొండ విశ్వేశ్వర్ రెడ్డితో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలే యాదయ్య మాట్లాడుతూ, ప్రభుత్వం వారి సంక్షేమానికి ఎల్లప్పుడూ కట్టుబడి ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కె ఎస్ రత్నం, చేవెళ్ల మున్సిపాలిటీ చైర్మన్ సమత వెంకట్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.


# శ్రీ బ్రహ్మసూత్ర మరకత లింగాన్ని దర్శించుకున్న జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్



**చేవెళ్ల: ఏప్రిల్ 10: (సమయం న్యూస్):** శంకర్‌పల్లి మండల పరిధిలోని చందిప్ప గ్రామ శివారులో గల 11 వ శతాబ్దానికి చెందిన మహిమగల శ్రీ బ్రహ్మసూత్ర మరకత శివాలయంలో శుక్రవారం జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్ స్వామి వారికి ప్రత్యేక పూజలు అభిషేకం చేశారు. దేవస్థానానికి చేరుకున్న ఎమ్మెల్యేకు ఆలయ నిర్వాహకులు, అర్చకులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. ఆలయ అర్చకులు శివ సాయి ప్రసాద్ వేద మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక ఆశీర్వచనం అందజేయగా, ఆలయ కమిటీ చైర్మన్ గోపాల్ రెడ్డి ఎమ్మెల్యేను స్వామివారి శేష వస్త్రంతో ఘనంగా సత్కరించి, స్వామివారి చిత్రపటాన్ని బహుకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలందరూ సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో సుభిక్షంగా జీవించాలని స్వామి వారిని ప్రార్థించినట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో శాంతి, సామరస్యం, అభివృద్ధి మరింత పెరుగాలని ఆకాంక్షించారు. ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని, అందరికీ మంచి జరుగాలని దేవుని ఆశీస్సులు కోరుతున్నట్లు పేర్కొన్నారు. మరకత శివాలయం వంటి పవిత్ర క్షేత్రాలను దర్శించడం ద్వారా మనసుకు శాంతి కలుగుతుందని, దని, ఆధ్యాత్మికత మనిషిని మంచి మార్గంలో నడిపిస్తుందని ఎమ్మెల్యే అన్నారు. ఈ సందర్భంగా కొంతసేపు ఆలయ ప్రాంగణంలో గడిపి, అక్కడి ఆధ్యాత్మిక వాతావరణాన్ని ఆస్వాదించారు. ఈ దర్శన కార్యక్రమంలో ఆయన వెంట స్థానిక నాయకులు, అనుచరులు, ఆలయ వైస్ చైర్మన్ శేఖర్, కార్యదర్శి జనార్ధన్ పాల్గొన్నారు.

# కూకట్ వాగు నుండి అక్రమంగా వెళ్తున్న ఇసుక ట్రాక్టర్ పట్టివేత

- అనుమతులు లేకుండా ఇసుక ట్రాక్టర్లు నడిపితే చర్యలు తీసుకుంటాం...
- యాలాల ఎస్సై విఠల్ రెడ్డి



**యాలాల, మండలం, ఏప్రెల్,10(సమయం న్యూస్) :** శుక్రవారం నమ్మదగిన సమాచారం మేరకు కోకట్ వాగు నుండి ఇసుక తరలిస్తున్నారని సమాచారం రావడంతో అక్కడకు వెళ్లగా ఒక ట్రాక్టర్ నంబర్ ఇంజన్లూ 34ు4841 ట్రాలీ నెంబర్ ఖా07ఖజ 6831 గలదాన్ని పట్టుకొని సీజ్ చేసి స్టేషన్ కు తరలించి కేసు నమోదు చేసినట్లు యాలాల ఎస్సై విఠల్ రెడ్డి తెలిపారు.

# విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలి

- వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారి



**వికారాబాద్, ఏప్రిల్,10(సమయం న్యూస్) :** సంక్షేమ వసతి గృహాలలో విద్య అభ్యసిస్తున్న విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. శుక్రవారము జిల్లాలోని మండల కేంద్రంలో గల సాంఘీక సంక్షేమ ఎస్సి బాలుర వసతి గృహాన్ని సందర్శించి తరగతి తరగతి గదులు, భోజనశాల, వంట గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వసతి గృహంలో వంటశాల, సామాగ్రి నిల్వగదిని పరిశీలించి విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో పౌష్టిక ఆహారం అందించాలని, ఆహారం తయారీ సమయంలో సిబ్బంది శుభ్రత నిబంధనలు పాటించాలని తెలిపారు. విద్యార్థుల సంఖ్య, విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. ప్రభుత్వం విద్యారంగ బలోపేతానికి అనేక కార్యక్రమాలు చేపడుతుందని, ఈ క్రమంలో విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని, తరగతిగది లో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థుల హాజరు శాతం , సిబ్బంది , వసతి గృహం లో ఉండే మౌలిక వసతులపై వివరాలు అడిగి తెలుసు కున్నారు. అనంతరము వికారాబాద్ పట్టణం లోని ఇందిరా నగర్ రేషన్ షాప్ ను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ప్రజలకు సరఫరా అవుతున్న నిత్యావసర సరుకులు, బియ్యం, చక్కెర, తదితర వస్తువుల పంపిణీ విధానాన్ని సమీక్షించారు. స్టాక్ రిజిస్టర్, పంపిణీ రికార్డులను పరిశీలించి సరుకులు సక్రమంగా అందుతున్నాయా అనే విషయాన్ని తనిఖీ చేశారు. లబ్ధిదారులకు ఏప్రిల్, మే,జూన్ మూడు నెలలకు సంబంధించి బియ్యాన్ని ఒకేసారి తూకం చేసి ఇచ్చే విధానాన్ని పరిశీలించారు. నాణ్యమైన సరుకులు సమయానికి అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. తదనంతరము జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సేవలు, వైద్య సిబ్బంది హాజరు, రోగులకు



అందుతున్న చికిత్స,ఔషధాల లభ్యతపై సమగ్రంగా పరిశీలించారు. వివిధ వార్డులు, అత్యవసర విభాగం, ల్యాబ్, ఫార్మసీ తదితర విభాగాలను తనిఖీ చేశారు. రోగులకు సమయానికి, నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని వైద్య అధికారులకు ఆదేశించారు. ఆసుపత్రి పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని, రోగులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు. ఆసుపత్రికి వచ్చే ప్రజలతో మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. అవసరమైన ఔషధాలు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సి వెల్ఫేర్ అధికారి జయపాల్ రెడ్డి, ప్రిన్సిపాల్ రమాదేవి,డి ఎం సి ఎస్ మురళీకృష్ణ, ప్రభుత్వ ఆసుపత్రి సుపరింతెన్డెంట్ రాజ్య లక్ష్మి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# డాక్టర్ అన్నపూర్ణకు ఘన సన్మానం

**సమయం న్యూస్ గజ్వేల్ ఏప్రిల్ 10 :** ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని వైద్యారోగ్య శాఖలో విశేష ప్రతిభకనబరిచిన వారికి అందజేసే రాష్ట్రస్థాయి పురస్కారానికి గజ్వేల్ జిల్లా కేంద్ర ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అన్నపూర్ణ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా మాతా శిశు సంరక్షణ కేంద్రం(వీజు) గజ్వేల్ నందు శుక్రవారం రోజున ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వైద్యులు, నర్సింగ్ మరియు ఇతర సిబ్బంది ఆమెను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డాక్టర్ అన్నపూర్ణ మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో అవార్డు రావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ విజయం కేవలం తన ఒక్కరి కృషి వల్ల సాధ్యం కాలేదని, ఆసుపత్రిలోని ప్రతి ఒక్క ఉద్యోగి. అంకితభావానికి దక్కిన గౌరవమని పేర్కొన్నారు. వైద్యులు, నర్సింగ్ స్టాఫ్, ల్యాబ్ టెక్నీషియన్లు, ఫార్మసిస్టులు, పారామెడికల్ మరియు కానిటేషన్ సిబ్బంది అంతా ఒక కుటుంబంలా కలిసి పనిచేయడం దల్లే ఈ గుర్తింపు లభించింది. ఈ అవార్డు నాపై బాధ్యతను మరింత పెంచిందన్నారు. సిద్దిపేట జిల్లానువైద్యారోగ్య రంగంలో రాష్ట్రంలోనే అగ్రగామిగాపేందుకు తన వంతు కృషి వేస్తానన్నారు. తమకు సహకరించిన ప్రతి ఇఒక్కరికీ పేరు పేరునా కృతజ్ఞతలు తెలియజేశారు. మాతా శిశు సంరక్షణ కేంద్రం సూపరింటెండెంట్ డాక్టర్ సుశీల, డాక్టర్ రేఖ, డాక్టర్ సుజాత, డెంటిస్ట్ డాక్టర్ నాగలక్ష్మి, ఆప్తమాలోజి డాక్టర్ కవిత , డాక్టర్ శ్రీజ నర్సింగ్ సూపరశీటెండెంట్ సువర్ణ, పూల



గుచ్ఛిమిచ్చి, శాలువతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఫార్మసీ ఆఫీసర్ విమల, ఫార్మసీ ఆఫీసర్స్ శ్రీనివాస్ చారి, మోహన్ బండారి, హెడ్ నర్సులు నిర్మల, వకులాదేవి ,నర్సింగ్ ఆఫీసర్స్ సిహెచ్, పుష్ప ,జే .శాంతి, కనకలక్ష్మి ,రాణి, శకుంతల, అమృత, హెల్త్ సూపర్వైజర్ కృష్ణవేణి ,హెల్త్ అసిస్టెంట్ దేవసాని వాసుదేవ్ ఇమ్యునైజేషన్ డిపార్ట్మెంట్ ఏఎన్ఎం తుమ్మ లత. భారతి థియేటర్ అసిస్టెంట్స్ ఆంజనేయులు, మురళి, రవి, ల్యాబ్ టెక్నీషియన్ కే.సౌందర్య జి. రాజేశ్వరి బి. రమాదేవి. డాటా ఎంట్రీ ఆపరేటర్స్ జి. అశోక్, ఎమ్. స్రవంతి. సబార్డినేట్ కనకయ్య , హాస్పిటల్ సిబ్బంది అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమం విజయవంతం చేశారు.

# అధిక శబ్దం వచ్చే సైలెన్సర్లు ఉపయోగిస్తే కఠిన చర్యలు

- టౌన్ ఎస్సై వెంకటేశ్వర్లు,ట్రాఫిక్ ఎస్సై కృష్ణ చైతన్య
- జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS ఆదేశాల మేరకు





**నారాయణపేట, ఏప్రెల్,10(సమయం న్యూస్) :** నారాయణపేట జిల్లా కేంద్రంలో ద్విచక్ర వాహనాలకు అధిక శబ్దం వచ్చే మోడిఫైడ్ సైలెన్సర్లు ఉపయోగిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని టౌన్ ఎస్సై వెంకటేశ్వర్లు, ట్రాఫిక్ ఎస్సై కృష్ణ చైతన్య హెచ్చరించారు. అధిక శబ్దం వచ్చే సైలెన్సర్స్ ఉపయోగించిన వాహనాదారులకు జరిమానా విధిస్తూ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... వాహనాలకు అను మతి లేని మార్పులు చేసి అధిక శబ్దం వచ్చే సైలెన్సర్లు అమర్చడం వల్ల ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని తెలిపారు. ముఖ్యంగా పాఠశాలలు, ఆసుపత్రులు, నివాస ప్రాంతాల్లో ఇటువంటి శబ్ద కాలుష్యం ప్రజల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతోందని పేర్కొన్నారు.

**మోడిఫైడ్ సైలెన్సర్లు ఉపయోగించే వాహనాలపై కేసులు నమోదు...జరిమానాలు విధించడం**

అవసరమైతే వాహనాలను సీజ్ చేస్తామని తెలిపారు. యువతలో ఫ్యాషన్ పేరుతో లేదా ఆకర్షణ కోసం ఇలాంటి సైలెన్సర్లు ఉపయోగించడం పెరుగుతోందని, ఇది ప్రమాదకరమని పోలీసులు తెలిపారు. ట్రాఫిక్ నియమాలను పాటించడం ప్రతి వాహనదారుడి బాధ్యత అని స్పష్టం చేశారు. ప్రజలు తమ వాహనాలను చట్టబద్ధంగా ఉంచుకోవాలని, అధిక శబ్దం వచ్చే సైలెన్సర్లు ఉపయోగించకుండా బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. ఎవరైనా ఉల్లంఘనలు చేస్తే వెంటనే పోలీసులకు లేదా డయల్ 100 కి సమాచారం అందించాలని తెలిపారు.

**కాటారం డివిజన్ అటవీ మరియు రెవెన్యూ భూ సమస్యల పరిష్కారానికి**

# సంబంధిత శాఖలు సమన్వయంతో సంయుక్త సర్వే నిర్వహించాలి

- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**కాటారం ఏప్రిల్10( సమయం న్యూస్) :** శుక్రవారం కాటారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో కాటారం డివిజన్ రెవెన్యూ, అటవీ, బుల్క్ భూ సమస్యలపై రెవెన్యూ, అటవీ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శాఖల అధికారులతో కలిసి మండల వారిగా రెవెన్యూ, అటవీ భూ సమస్యలు, బుల్క్ భూ సమస్యలపై సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ వివాదాల పరిష్కారానికి స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని అధికారులకు సూచించారు. అటవీ మరియు రెవెన్యూ భూముల సరిహద్దుల నిర్ధారణలో స్పష్టత తీసుకురావడానికి సంయుక్త సర్వే కీలకమని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా వేగంగా సమస్యలను పరిష్కరించేందుకు శాఖల మధ్య సమన్వయం పెంచాలని ఆదేశించారు. భూ సంబంధిత పెండింగ్ సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రతి కేసును పారదర్శకంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, ఎఫ్డిఓ సంపత్, కాటారం డివిజన్ తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

# వరి ధాన్యం కొనుగోలుకు పూర్తి ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలి



● జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

**నారాయణపేట, ఏప్రిల్,10(సమయం న్యూస్) :** వరి ధాన్యం కొనుగోలుకు పూర్తి ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. శుక్రవారం వీసి సమావేశ మందిరంలో జిల్లా సంబంధిత శాఖల అధికారులతో వరి ధాన్యం కొనుగోలు పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి నిర్ణీత మద్దతు ధర చెల్లించి రైతుల వద్ద నుండి ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. ధాన్యం క్వింటాలు గ్రేడ్ --ఏ రకానికి 2 వేల 389 రూపాయలు, సాధారణ రకానికి 2 వేల 369 రూపాయలుగా మద్దతు ధర నిర్ణయించిందని, సన్న రకం వడ్లకు క్వింటాలుకు 500 రూపాయల బోనస్ అదనంగా అందించడం జరుగుతుందని తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను కొంత ఎతైన ప్రదేశాలలో ఏర్పాటు చేయాలని, కొనుగోలు కేంద్రాలలో గోనె సంచులు భద్ర పరుచుటకు సరిపడా ఏర్పాట్లు చేయాలని, నిబంధనల ప్రకారం రైతులకు గోనె సంచులు ఇవ్వాలని తెలిపారు. రైతుల సౌకర్యార్థం త్రాగునీరు, నీడ, మూత్రశాలలు, విద్యుత్, టేబుల్, కుర్చీలు,టార్పాలిన్లు, తూకం యంత్రాలు ఏర్పాటు చేయాలని, ప్రతి కొనుగోలు కేంద్రములో ఖచ్చితముగా 2 ఎలక్ట్రానిక్ తూకం పరికరాలు, 30 టార్పాలిన్లు, 1 ప్యాడి క్లీనర్ అందుబాటులో ఉంచాలని, ఒకవేళ ప్యాడి క్లీనర్ లేనిచో ట్రాక్టర్ మౌంటెడ్ ఫ్యాన్ ను ఏర్పాటు చేయాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాల నిర్వహకులు రైతుల వద్ద నుండి వరుస ప్రకారం కొనుగోలు చేయాలని, రిజిస్టర్ల నిర్వహణ పకడ్బందీగా ఉండాలని తెలిపారు. రైతులు ధాన్యం తీసుకొని వచ్చినపుడు తేమ శాతం 17 శాతం కంటే ఎక్కువ ఉంటే, ధాన్యం ఆరబెట్టుకొని తేమ శాతం తగ్గిన తర్వాతనే ధాన్యం తీసుకొని రావాలని రైతులకు అవగాహన కల్పించాలని, రైతులు ధాన్యం తీసుకొని వచ్చినపుడు వారి ఆధార్ కార్డ్, బ్యాంక్ పాస్ పుస్తకం, పట్టాదారు పాస్ పుస్తకం నకలు ప్రతులను తీసుకోవాలని, వ్యవసాయ విస్తరణ అధికారి జారీ చేసిన టోకెన్ తో ఓ పి ఎం ఎస్ లో వివరాలు సరి చూసుకోవాలని, కౌలు రైతులు వ్యవసాయ విస్తరణ అధికారి ద్వారా "కౌలు రైతు ధ్రువీకరణ పత్రం" ఖచ్చితముగా సమర్పించాలని తెలిపారు. ప్రతి సన్న రకం ధాన్యం సంచి పై ɪా అక్షరం, సెంటర్ కోడ్ ఎరుపు రంగుతో ఖచ్చితముగా వ్రాసిన తర్వాతనే ధాన్యం నింపాలని, బస్తాలను ఎరుపు రంగు దారంతో కుట్టాలని, దొడ్డ రకం ధాన్యం బస్తాలను ఆకుపచ్చ రంగు దారంతో కుట్టాలని, ఈ సంచులపై ఎటువంటి అక్షరాలు వ్రాయకూడదని తెలిపారు. ధాన్యం రవాణా చేసేటప్పుడు సన్న రకం, దొడ్డ రకం ధాన్యంను వేరు వేరు లారీలలో తరలించాలని తెలిపారు. తూకం జరిపే సమయములో తేమ శాతం 17 మించకుండ ఉండేలా చూసుకోవాలని, పొల్లు, రాళ్ళు మట్టి పెడ్డలు లేకుండా నాణ్యత ప్రమాణాలకి లోబడి ధాన్యం కొనుగోలు చేయాలని తెలిపారు. ధాన్యం కొనుగోలు చేసిన తర్వాత పూర్తి భాధ్యత కొనుగోలు నిర్వాహకులదేనని, కొనుగోలు జరిపిన వెంటనే సంబశీదిత రైతుకు కొనుగోలు పత్రం తూకం వివరాలతో ఇవ్వాలని తెలిపారు. జిల్లాలో కేటాయించిన రైస్ మిల్లులకు మాత్రమే ధాన్యం సరఫరా చేయాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. రైతుల నుండి కొనుగోలు చేసిన ధాన్యం వివరాలు కొనుగోలు రిజిస్టర్ లో నమోదు చేసి ట్యాబ్ నందు వివరాలు నమోదు చేయాలని, ట్రక్ చిట్ లో వ్రాసిన రైతుల ప్రకారమే మిల్లులకు ధాన్యం సరఫరాలో వివరాలు నమోదు చేయాలని తెలిపారు. ట్యాబ్ లో నమోదు చేసిన తరువాత రైతులకు చెల్లింపులు చేయుట కొరకు రైస్ మిల్ ట్రక్ చిట్ రసీదు కాపీ, రైతు కొనుగోలు పత్రం జిల్లా మేనేజర్, పౌర సరఫరా సంస్థ కార్యాలయంలో అందించాలని తెలిపారు. కొనుగోలు సమయంలో ఇతర కేంద్రాల నుండి తీసుకొన్న/పంపిన గోనె సంచుల వివరాలు జాగ్రతగా నమోదు చేసుకొని, ఆ వివరాలను రికాన్సిలేషన్ సమయములో సమర్పించాలని, ప్రతి రోజు కొనుగోలు కేంద్రాల వారీగా ధాన్యం కొనుగోలు సమాచారం, రైస్ మిల్లుకు పంపిన ధాన్యం వివరాలు అందించాలని తెలిపారు. రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం చేపట్టిన ధాన్యం కొనుగోలు ప్రక్రియను జిల్లాలో సమర్థవంతంగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. జిల్లాలో ఐకెపి 82, పిఎసిఎస్ 65, మెప్మా 5, ఎఫ్ పి ఓ ఏడు, ఎఎంసి ఒకటి మొత్తం 160 కేంద్రాల ఏర్పాటు చేసినట్లు తెలిపారు. హెల్ప్ లైన్ నెంబర్ 1800425000333/1967 ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే ఆరు చెక్ పోస్టులు ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీను, డి.ఎస్.పి. లింగయ్య, డి.ఆర్.డి.ఏ. మొగ్లప్ప, అగ్రికల్చర్ అధికారి జాన్ సుధాకర్, సైదులు, డి.సి.ఓ. ప్రసాద్ రావు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# భద్రకాళి బండ్ పై కొనసాగుతున్న పనులను సకాలంలో పూర్తి చేయండి

- నగర మేయర్ శ్రీమతి గుండు సుధారాణి
- హనుమకొండ జిల్లా కలెక్టర్ తో కలిసి భద్రకాళి బండ్ పనుల పురోగతి పరిశీలన.....
- భద్రకాళి బండ్ పనులను సకాలంలో పూర్తి చేయాలి
- నగర మేయర్ గుండు సుధారాణి



**గ్రేటర్ వరంగల్ ఏప్రిల్10( సమయం న్యూస్)హనుమకొండ, ఏప్రిల్ 10:**భద్రకాళి బండ్‌పై కొనసాగుతున్న అభివృద్ధి పనులను సకాలంలో, నాణ్యతతో పూర్తి చేయాలని నగర మేయర్ గుండు సుధారాణి అధికారులను ఆదేశించారు. శుక్రవారం హనుమకొండ జిల్లా కలెక్టర్/బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్తో కలిసి 29వ డివిజన్ పరిధిలో భద్రకాళి బండ్‌పై జరుగుతున్న పనులను, అలాగే 12 మోరీల వద్ద కొనసాగుతున్న అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా పనులను సమర్థవంతంగా పూర్తి చేసేందుకు అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మేయర్, కలెక్టర్‌లు డీసిల్టింగ్ పనులను పరిశీలించారు. అనంతరం పోతన నగర్‌లో కొనసాగుతున్న కల్వర్టు నిర్మాణ పనులను సందర్శించి, పనులను నాణ్యతతో పాటు వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఈఈ రవి కుమార్, డీఈలు రాజ్ కుమార్, సంతోష్ కుమార్, ఏఈ నరేష్ పాల్గొన్నారు.

# ఆయుర్వేద, హోమియోపతి, యునాని సేవలు వినియోగించుకోవాలి,

● జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ స్నేహ శబరీష్.





**మహబూబాబాద్ ఏప్రిల్10( సమయం న్యూస్) :** ఆయుర్వేద, హోమియోపతి, యునాని సేవలు వినియోగించుకోవాలన్నారు జిల్లా కలెక్టర్ శుక్రవారం జిల్లా ప్రధాన ఆసుపత్రిలో ఆయుష్ దినోత్సవం నిర్వహించారు, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువ చేయాలని ఉద్దేశంతో ఏర్పాటు చేసినటువంటి ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాలలో భాగంగా ఈరోజు ఆయుష్ ఆయుర్వేద, హోమియోపతి, యునాని సేవలు వినియోగించుకోవాలనీ ఈ కార్యక్రమాలు చేపట్టడం జరిగిందనీ. ఈ రోజు జిల్లా వ్యాప్తంగా అన్ని గురుకుల పాఠశాలలు, హాస్టల్లలో యోగా శిక్షణ తరగతులు ఉదయం 6:30 నుంచి 7:30 వరకు నిర్వహించామని,అదేవిధంగా గ్రామస్థాయిలో ఆయుర్వేద హోమియో యునాని వైద్య శిబిరాలు నిర్వహించడం జరిగింది. ఈ శిబిరాలలో స్థానిక ఆయుష్ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు. హోమియో వైద్య విధాన స్థాపకులు అయినటువంటి డాక్టర్ శామ్యూల్ హనిమాన్ జన్మదినం సందర్భంగా ఈరోజు హోమియోపతి దినోత్సవం సందర్భంగా ప్రతి సంవత్సరం ఈ కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందన్నారు,ప్రభుత్వ జనరల్ హాస్పిటల్లో ఏర్పాటు చేసినటువంటి ఆరోగ్య శిబిరంలో హోమియోపతి వైద్యులు చైతన్య, రామకృష్ణ, ఆయుర్వేద వైద్యులు పి కిరణ్ కుమార్, వసుంధర దేవి, యునాని వైద్యులు బి శంకర్ డిపిమం శ్రవణ్ కుమార్, సిబ్బంది ఇందుమతి, పద్మ, అశోక్, సజయ్, మోహన్ ఉన్నారు,ఈ శిబిరాన్ని ఆమె హనిమాన్ చిత్రపటానికి పుష్పమాలవేసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. శిబిరంలో ఏర్పాటు చేసినటువంటి ఆయుర్వేద మొక్కల ప్రదర్శనను ఆసక్తిగా తిలకించి తులసి, వేప, ఉసిరి, ద్వారా ఉత్పత్తి అయ్యే మెడిసిన్ గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ప్రతి విభాగానికి చెందిన డాక్టర్లు ప్రజలను పరిశీలించి వివిధ వైద్య సలహాలు సూచనలు అందించారు, ఈ శిబిరంలో (384) మంది వైద్య సేవలు పొందారు. జిల్లాలో (10) ఆయుష్ డిస్పేనరీ ఉన్నాయని వాటి ద్వారా ముందుగా తెలిపిన షెడ్యూలు ప్రకారం ప్రజలకు సేవలు అందించాలని తెలిపారు, జిల్లా ప్రధాన కేంద్ర ం తదితర ప్రదేశాలలో ఔషధ మొక్కలను నాటితే ఉపయోగపడుతుందని అందుకు సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని తెలిపారు,ఈ కార్యక్రమంలో డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ రవి రాథోడ్, హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాసరావు, ప్రసాద్, డాక్టర్ పి కిరణ్ కుమార్, జిల్లా ఆయుష్ ,శ్రవణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## అదనపు కలెక్టర్ ఇ. వెంకటాచరి (రెవెన్యూ)ను మర్యాదపూర్వకంగా కలిసిన... పూడూర్ తాహేసిల్దార్ బి విజయ్ కుమార్



**వికారాబాద్,ఏప్రిల్,10(సమయం న్యూస్) :** వికారాబాద్ జిల్లా నూతన ( రెవెన్యూ) అదనపు కలెక్టర్ ఇ. వెంకటాచరిని (శుక్రవారం) కలెక్టరేట్ లో మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్క (పుష్ప గుచ్ఛం) అందించిన పూడూర్ తహేసిల్దార్ బి.విజయ్ కుమార్.

# విద్యార్థుల గొడవ.. కుటుంబాల మధ్య రగడ



**రాయపోల్, ఏప్రిల్ 10:** చిన్నపాటి విద్యార్థుల మధ్య తలెత్తిన వివాదం చివరకు కుటుంబాల మధ్య ఘర్షణగా మారిన ఘటన మండలంలోని దొడ్లపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన బంటు భాను కుమార్తె తన తోటి విద్యార్థి శ్రవణ్ గురించి చాడీలు చెబుతుండటంతో, ఈ విషయాన్ని శ్రవణ్ తన అన్న రాకేష్‌కు తెలియజేశాడు. దీంతో ఆగ్రహానికి గురైన రాకేష్, బాలికను చేతులతో కొట్టినట్లు సమాచారం. ఈ విషయం తెలుసుకున్న భాను, తన తమ్ముడు సుభాష్‌తో కలిసి రాకేష్ ఇంటికి వెళ్లి వివరణ కోరగా, అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ క్రమంలో రాకేష్ తల్లిదండ్రులు పిట్ల స్వామి, మంజుల కట్టెలు, రాళ్లతో దాడి చేయడంతో భాను, సుభాష్‌లకు తీవ్ర రక్తగాయాలు అయ్యాయి. గాయపడిన వారిని వెంటనే గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. సమాచారం అందుకున్న రాయపోల్ ఎస్ఐ మానస సంఘటనా స్థలాన్ని పరిశీలించి, అనంతరం ఆసుపత్రికి వెళ్లి బాధితుల ఫిర్యాదు స్వీకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ మానస తెలిపారు.

# రాంసాగర్‌లో సీతారామస్వామి దేవాలయంలో ఘనంగా వ్రతాలు




**రాయపోల్,ఏప్రిల్ 10:** రాయ పోల్ మండలం రాంసాగర్ గ్రామంలోని సీతారామస్వామి దేవాలయంలో జరుగుతున్న సీతారామస్వామి కళ్యాణ ఉత్సవాల్లో భాగంగా రెండవ రోజు శుక్రవారం ఉదయం భక్తి శ్రద్ధలతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆవాహిత దేవత పూజ, స్థాపిత దేవత హవనం, పూర్ణాహుతి కార్యక్రమాలు వేద మంత్రోచ్చారణల మధ్య ఘనంగా జరిగాయి. అనంతరం సామూహికంగా శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ పూజా కార్యక్రమాలు ఆధ్యాత్మిక వాతావరణంలో కొనసాగడంతో దేవాలయ ప్రాంగణం భక్తులతో కళకళలాడింది. భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ ను త్వరగా పూర్తి చేయాలి

- హనుమకొండ జిల్లా కలెక్టర్/ బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్
- వడ్డేపల్లిలో కార్పొరేటర్ అభినవ్ భాస్కర్ తో కలసి అభివృద్ధి పనులు, శానిటేషన్ పరిశీలన.
- వడ్డేపల్లి బండ్ పై కొనసాగుతున్న అభివృద్ధి పనుల పరిశీలన....



**గ్రేటర్ వరంగల్ ఏప్రిల్10( సమయం న్యూస్). :** అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ (యూపీహెచ్‌సీ) నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని హనుమకొండ జిల్లా కలెక్టర్/బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం హనుమకొండ పరిధిలోని 60వ డివిజన్‌లో వడ్డేపల్లి ప్రాంతాన్ని కలెక్టర్ క్షేత్రస్థాయిలో సందర్శించారు. ఈ సందర్భంగా అభివృద్ధి పనులు, శానిటేషన్ పరిస్థితులు, అలాగే వడ్డేపల్లి బండ్‌పై కొనసాగుతున్న పనులను పరిశీలించి, వాటిని సమర్థవంతంగా అమలు చేయడానికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా నిర్మాణంలో ఉన్న అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ (యూపీహెచ్‌సీ)ను పరిశీలించిన కలెక్టర్, పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణాన్ని వేగవంతం చేసి త్వరలోనే పూర్తి చేసి ప్రజలకు సేవలు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. అలాగే వడ్డేపల్లిలోని పబ్లిక్ టాయిలెట్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి నిర్వహణను పరిశీలించారు. అనంతరం వడ్డేపల్లి బండ్‌పై జరుగుతున్న అభివృద్ధి పనులలో భాగంగా ఈట్ స్ట్రీట్ పనులను పరిశీలించిన కలెక్టర్, నెలాఖరులోగా పనులను పూర్తి చేయాలని సూచించారు. సివిల్ మరియు హార్టికల్చర్ పనులను సమాంతరంగా వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ అభినవ్ భాస్కర్, సి.ఎం.హెచ్.ఓ డా. రాజారెడ్డి, డి.ఎం హెచ్.ఓ డా. అప్పయ్య, ఈఈ రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## తొలి తరం క్రికెటర్ గోపీనాథ్ కన్నుమూత

**చెన్నై:** భారత తొలి టెస్టు విజయంలో సభ్యుడు, నాటి జట్టులో గురువారం నాటికి సజీవంగా ఉన్న మాజీ క్రికెటర్ సీడీ గోపీనాథ్ (96) గురువారం చెన్నైలో కన్నుమూశారు. 1930లో నాటి మద్రాస్ (చెన్నై)లో పుట్టిన గోపీనాథ్.. 21 ఏండ్లకే అరంగేట్రం చేసి తొలి మ్యాచ్‌లోనే అర్ధ శతకం సాధించారు. తొలి టెస్టు విజయం కోసం 25 టెస్టులు వేచిచూసిన భారత జట్టు.. 1952 ఫిబ్రవరిలో విజయ్ హజారే సారథ్యంలో చిదంబరం స్టేడియం వేదికగా చెన్నైతో జరిగిన ఐదు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌లోని ఆఖరి టెస్టును గెలిచింది. ఆ జట్టులో గోపీనాథ్ (మ్యాచ్‌లో 35 రన్స్ చేశారు) సభ్యుడు. గోపీనాథ్ మరణంతో భారత క్రికెట్‌లో ఒక శకం ముగిసినైట్టెంది. భారత్ తరపున ఆయన 8 టెస్టులు ఆడారు.



## ఫైనల్‌కు గోయట్..

### హన్సిక, నేహాకు కాంస్యాలు

**బిష్కెక్ :** కిర్గిస్థాన్‌లో జరుగుతున్న సీనియర్ ఆసియా రెజ్లింగ్ చాంపియన్‌షిప్స్‌లో భారత మహిళా రెజ్లర్ మీనాక్షి గోయట్ ఫైనల్‌కు చేరి పతకాన్ని ఖాయం చేసింది. 53 కిలోల విభాగం సెమీస్‌లో ఆమె.. సియొంగ్ పార్క్ (దక్షిణ కొరియా)పై గెలిచి ఫైనల్‌లో అడుగిడింది. 55 కిలోల విభాగంలో హన్సిక, 59 కిలోల క్యాటగిరీలో నేహా కాంస్య పోరులో తమ ప్రత్యర్థులను చిత్తుచేసి కాంస్యాలు సాధించారు.

## బాక్సర్ల పసిడి పంచ్..

### మీనాక్షి, ప్రీతి, అరుంధతి, ప్రియాకు స్వర్ణం

### అల్ఫియా, జైస్మీన్‌కు రజతం



**ఉలన్‌బాతర్ (మంగోలియా) :** ఏషియన్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో భారత మహిళా బాక్సర్లు పతకాల పంట పండించారు. గురువారం ఫైనల్ బరిలో నిలిచిన ఆరుగురిలో ఏకంగా నాలుగు స్వర్ణాలు, రెండు రజతాలతో సత్తాచాటారు. మీనాక్షి హుడా (48 కిలోలు), ప్రీతి పవార్ (54 కి.), ప్రియా గంఘాస్ (60 కి.), అరుంధతి చౌదరి (70 కి.) పసిడి పంచ్‌లు విసరగా అల్ఫియా (80o కి.), జైస్మీన్ లంబోరియా (57 కి.) ఫైనల్‌లో ఓడినా రజతాలు గెలుచుకున్నారు.గురువారం తొలి పోరులో మీనాక్షి తన జోరును కొనసాగిస్తూ 5-0తో నొముందరి అమగలన్ (మంగోలియా)ను చిత్తు చేసింది. ఆ తర్వాత ప్రీతి సైతం అదే దూకుడుతో టోక్యో ఒలింపిక్స్ కాంస్య పతక విజేత హువాంగ్ సియావొ-వెన్ (చైనీస్ తైపీ)పై గెలిచి పసిడి సంబురాన్ని డబుల్ చేసింది. ఆ ఇద్దరి బాటలోనే నడిచిన ప్రియా.. 3-0తో వొన్ ఉన్-గ్యాంగ్ (ఉత్తర కొరియా)ను ఓడించగా అరుంధతి 4-1తో కజకిస్థాన్ బాక్సర్ సీడిష్‌పై నెగ్గింది. ఇదిలాఉండగా టోర్నీ ఆసాంతం రాణించిన జైస్మీన్ ఫైనల్‌లో 0-5తో పున్రివి (థాయ్‌లాండ్) చేతిలో ఓటమి పాలవ్వగా అల్ఫియా.. 0-5తో ఇస్లాంబెకొవ(కజికిస్థాన్) సైతం పరాజయం చవిచూసింది. ఈ టోర్నీలో భారత్ ఇప్పటిదాకా నాలుగు స్వర్ణాలు, రెండు రజతాలు, 4 కాంస్యాలతో మొత్తం పది పతకాలు సాధించింది. పురుషుల విభాగంలో విశ్వనాథ్ (48 కి.), సచిన్ (60 కి.) శుక్రవారం తమ ఫైనల్స్ మ్యాచ్‌లు ఆడనున్నారు.

# రాయల్స్ విధ్వంసం



### ఆర్సీబీపై ఆర్ఆర్ ఘనవిజయం!

- 202 పరుగుల భారీ లక్ష్యాన్ని ఊదినేసిన ఆర్ఆర్
- సుడిగాలి ఇన్నింగ్స్‌తో చెలరేగిన వైభవ్ సూర్యవంశీ
- ధ్రువ్ జురెల్ బాధ్యతాయుత ఇన్నింగ్స్
- వృథా అయిన రజత్ పాటిదార్ (63) అర్ధసెంచరీ
- తేలిపోయిన ఆర్సీబీ బౌలర్లు.. 12 బంతులు మిగిలి ఉండగానే విజయం






**గువహాటి, ఏప్రిల్ 11:** ఐపీఎల్ టోర్నీలో భాగంగా గువహాటిలోని బర్సపరా స్టేడియం వేదికగా శుక్రవారం జరిగిన 16వ లీగ్ మ్యాచ్‌లో రాయల్ ఛాలెంజర్స్ (ఆర్సీబీ) పై రాయల్స్ (ఆర్ఆర్) ఆరు వికెట్ల తేడాతో అద్భుత విజయం సాధించింది. భారీ లక్ష్య ఛేదనలో ఆర్ఆర్ కుర్రాళ్లు వైభవ్ సూర్యవంశీ, ధ్రువ్ జురెల్ ఆకాశమే హద్దుగా చెలరేగారు. టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న ఆర్ఆర్.. ముందుగా ప్రత్యర్థిని భారీ స్కోరుకే పరిమితం చేసినా, బ్యాటింగ్ లో అసాధారణ సత్తా చాటి 18 ఓవర్లలోనే లక్ష్యాన్ని సునాయాసంగా చేరుకుంది.

### కోహ్లీ మెరుపులు.. పాటిదార్ నిలకడ

తొలుత బ్యాటింగ్ చేసిన ఆర్సీబీ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 201 పరుగుల భారీ స్కోరు చేసింది. ఓపెనర్ విరాట్ కోహ్లీ కేవలం 16 బంతుల్లోనే 32 పరుగులు చేసి జట్టుకు అదిరిపోయే శుభారంభం అందించాడు. ఆ తర్వాత రజత్ పాటిదార్ (40 బంతుల్లో 63) బాధ్యతాయుతమైన అర్ధసెంచరీతో ఇన్నింగ్స్ కు వెన్నెముకలా నిలిచాడు. చివర్లో వెంకటేష్ అయ్యర్ కేవలం 15 బంతుల్లోనే అజేయంగా 29 పరుగులు రాబట్టడంతో ఆర్సీబీ స్కోరు బోర్డు 200 దాటింది. ఆర్ఆర్ బౌలర్లలో రవి బిష్ణోయ్ (2/32), జోఫ్రా ఆర్చర్ (2/33), బ్రిజేష్ శర్మ (2/37) తలా రెండు వికెట్లు పడగొట్టి ఆర్సీబీని కట్టడి చేసే ప్రయత్నం చేశారు.

### సూర్యవంశీ విధ్వంసం.. జురెల్ ఫినిషింగ్ టచ్

202 పరుగుల కఠిన లక్ష్యంతో బరిలోకి దిగిన ఆర్ఆర్‌కు వైభవ్ సూర్యవంశీ ఊహించని విధ్వంసకర ఆరంభాన్ని ఇచ్చాడు. కేవలం 26 బంతుల్లోనే 78 పరుగులు చేసి ఆర్సీబీ బౌలర్లకు చుక్కలు చూపించాడు. అతడి స్ట్రైక్ రేట్ ఏకంగా 300 ఉండటం గమనార్హం. సూర్యవంశీ సుడిగాలి ఇన్నింగ్స్‌తో పవర్ ప్లేలోనే ఆర్ఆర్ విజయం లాంఛనమైంది. మరో ఎండ్ లో ధ్రువ్ జురెల్ (43 బంతుల్లో 81 నాటౌట్) యాంకర్ రోల్ పోషిస్తూనే వీలుచిక్కినప్పుడల్లా బౌండరీలు బాదుతూ జట్టును విజయతీరాలకు చేర్చాడు. రవీంద్ర జడేజా (25 బంతుల్లో 24 నాటౌట్) వికెట్ పడకుండా జాగ్రత్త పడుతూ జురెల్ కు అండగా నిలిచాడు.



### తేలిపోయిన ఆర్సీబీ బౌలింగ్

భారీ స్కోరును కాపాడుకోవడంలో ఆర్సీబీ బౌలర్లు పూర్తిగా విఫలమయ్యారు. కృనాల్ పాండ్యా 2 వికెట్లు (2/30) తీసినా ఫలితం లేకపోయింది. ప్రధాన పేసర్ జోష్ హేజిల్‌వుడ్ 4 ఓవర్లలో ఏకంగా 44 పరుగులు సమర్పించుకున్నాడు. రొమారియో షెపర్డ్ 2 ఓవర్లలోనే 18 పరుగులు ఇచ్చాడు. ఆర్ఆర్ బ్యాటర్ల దాటికి ఆర్సీబీ బౌలర్ల వద్ద ఎలాంటి సమాధానం లేకుండా పోయింది. ఫలితంగా మరో 12 బంతులు మిగిలి ఉండగానే కేవలం 4 వికెట్లు మాత్రమే కోల్పోయి ఆర్ఆర్ 202 పరుగులు సాధించి దర్జాగా గెలుపొందింది.

## మూడో సీడ్‌పై ఆయుశ్ అదిరే విజయం..

### భారత పతక ఆశలు సజీవం..!



చైనా వేదికగా జరుగుతున్న బ్యాడ్మింటన్ ఆసియా ఛాంపియన్‌షిప్స్‌లో భారత యువ షట్లర్ ఆయుష్ శెట్టి చెలరేగుతున్నాడు. సీనియర్లు చేతులెత్తేసిన చోట తన దూకుడైన ఆటతో ప్రత్యర్థులను మట్టికరిపిస్తున్న ఆయుశ్ సెమీఫైనల్‌కు దూసుకెళ్లాడు. పురుషుల సింగిల్స్‌లో అదుర్స్ అనిపిస్తున్న భారత కుర్రాడు క్వార్టర్స్‌లో మూడో సీడ్ సీడ్ జోనాథన్ క్రిస్టీ(ఇండోనేషియా)ను ఓడించాడు. అద్భుత విజయంతో సెమీస్ చేరిన ఆయుశ్ పతకంపై ఆశలు రేపుతున్నాడు. బ్యాడ్మింటన్ ఆసియా ఛాంపియన్‌షిప్స్ పురుషుల సింగిల్స్‌లో ఆయుశ్ శెట్టి జైత్రయాత్ర కొనసాగుతోంది. తొలి రౌండ్‌లోనే ఏడో ర్యాంకర్ చైనా ఆటగాడిని ఇంటికి పంపిన ఆయుశ్ అదే ఊపులో 25వ ర్యాంకరైన చీ యూ జెన్(చైనీస్ తైపీ)ను వణికించాడు. క్వార్టర్స్‌లోనూ జోరు చూపించిన భారత షట్లర్ జొనాథన్ క్రిస్టీకి చెక్ పెట్టాడు. హోరాహోరీగా జరిగిన తొలి సెట్‌ను 23-21తో గెలుచుకున్న ఆయుశ్ రెండో సెట్‌లో ప్రత్యర్థికి ఏమాత్రం అవకాశమివ్వలేదు. 21-17తో మ్యాచ్ ముగించి సెమీస్ పోరుకు సిద్ధమయ్యాడు. తద్వారా ఈ మెగా టోర్నీలో భారత పతక ఆశలను సజీవంగా ఉంచాడీ యంగ్‌స్టర్. సీనియర్లు హెచ్‌హెస్ ప్రణయ్, పీవీ సింధులు ఇప్పటికే టోర్నీ నుంచి నిష్క్రమించిన విషయం తెలిసిందే.



కథలో బలం లేకున్నా

# కొత్తదనం

## డెకాయిట్‌గా ఫర్వాలేదనిపించిన అడవిశేష్

అడివి శేష్ డబుల్ హ్యాట్రిక్ విజయాలతో జోరు మీదున్నారు. పైగా 'మేజర్'తో జాతీయ స్థాయిలోనూ గుర్తింపు తెచ్చుకున్నాడు. దీంతో ఇప్పుడాయన నుంచి రానున్న 'డెకాయిట్'పై ఇటు దక్షిణాదిలోనూ.. అటు ఉత్తరాదిలోనూ మంచి అంచనాలు ఏర్పడ్డాయి. హరిదాస్ (అడివి శేష్) ఓ హత్య కేసులో 13 ఏళ్లుగా జైలు జీవితం అనుభవిస్తుంటాడు. ఓరోజు తనని కడప జైలు నుంచి మారుస్తుండగా పోలీసుల నుంచి తప్పించు కుంటాడు. దీనికోసం ఇషాద్ భాయ్ (అతుల్ కులకర్ణి) అతనికి సాయం చేస్తాడు. హరి అలా తప్పించుకోగానే తనని దుబాయ్ పంపేందుకు అన్ని ఏర్పాట్లు చేయగా.. దానికోసం ఇంకా రూ.60లక్షలకు పైగా డబ్బు అవసరమవుతుంది. అయితే అతను దుబాయ్‌కి వెళ్లేలోపు తనకు అవసరమైన డబ్బు సంపాదించడంతో పాటు మరో పని కూడా చేయాలనుకుంటాడు. తనని జైలు పాలయ్యేలా చేసిన తన మాజీ ప్రేయసి సరస్వతి అలియాస్ జూలియట్ (మృణాల్ ఠాకూర్)పై పగ తీర్చుకోవాలని నిర్ణయించుకుంటాడు. ఈక్రమంలోనే ఆమెను వెతుక్కుంటూ ఇంటికెళ్లగా ఓ ఆరేళ్ల కూతురి తల్లిగా దర్శనమిస్తుంది సరస్వతి. ఆమె భర్త భాస్కర్ (వైభవ్) తీవ్ర అనారోగ్యానికి గురై ఆస్పత్రి పాలై ఉంటాడు. తన ప్రాణాలు కాపాడాలంటే ఆమెకు రూ.1కోటి డబ్బు అవసరం. ఆమె పరిస్థితిని చూసిన హరి.. తన ఆర్థిక అవసరాన్ని అడ్డం పెట్టుకునే దెబ్బ కొట్టాలని ఓ ప్రణాళిక రచిస్తాడు. హరిని సరస్వతి హత్య కేసులో ఎందుకు ఇరికించింది? దీనికి ఆమె భర్త భాస్కర్‌కు ఉన్న లింకేంటి? ఈ కథలో సీఐ స్వామి అలియాస్ రాంబాబు (అనురాగ్ కశ్యప్), కరుణ హాస్పిటల్స్ ఛైర్మన్ (ప్రకాశ్ రాజ్), మల్లి (కామాక్షి భాస్కర్ల) పాత్రలకు ఉన్న ప్రాధాన్యత ఏంటన్నదే కథ. అడివి శేష్ సినిమా అనగానే ప్రేక్షకుల్లో బలమైన భరోసా కనిపిస్తుంది. తను ఓ కథ ఎంచుకున్నాడంటే తప్పకుండా అందులో ఏదో వైవిధ్యత ఉంటుందని.. థ్రిల్‌కు ఏ లోటు ఉండదని అందరి నమ్మకం. ఇక ఈసారి 'డెకాయిట్'కి తనే స్వయంగా కథ, స్క్రీన్‌ప్లే అందించాడనే సరికి దీనిపై ప్రేక్షకుల్లో అంచనాలు మరింత రెట్టింపయ్యాయి. కథ, కథనాల్లో మరీ అంత కొత్తదనమేమీ లేకపోయినా కొన్ని మెరుపులతో ఆ లోటు తెలియనీయలేదు. ఓ కులాంతర ప్రేమకథకు.. తనదైన శైలిలో ట్విస్టులు, టర్న్‌లు జోడించి ఓ మాస్ యాక్షన్ సినిమాని ఆవిష్కరించే ప్రయత్నం చేశారు శేష్ . హీరో ఎప్పుడైతే జైలు నుంచి తప్పించుకుంటాడో అక్కడి నుంచి సినిమా వేగం పుంజుకుంటుంది. హీరో ఎప్పుడైతే కథానాయిక జీవితంలోకి తిరిగి ఎంట్రీ ఇస్తాడో అక్కడి నుంచి కథలో సంఘర్షణ మొదలవుతుంది. వాళ్లిద్దరూ కలిసి డబ్బు దోచుకునేందుకు సిద్ధమైనప్పటి నుంచి ఆ సంఘర్షణ రెట్టింపవుతుంది. ఓ వైపు నాయకానాయికల్ని వెతికి పట్టుకునేందుకు సీఐ స్వామి రంగంలోకి దిగడం.. వాళ్లని తప్పించుకుని, కథానాయికని పోలీసులకు పట్టించాలని హీరో చేసే ప్రయత్నాలతో ద్వితీయార్థం థ్రిల్లింగ్‌గా మొదలవుతుంది. క్లైమాక్స్‌ని భావోద్వేగభరితంగా తీర్చిదిద్దే ప్రయత్నం చేశారు. ఈక్రమంలో హీరో చేసే త్యాగం 'ప్రేయసి రావే' లాంటి క్లాసిక్ చిత్రాన్ని గుర్తు చేస్తుంది. కాకపోతే ఆ ముగింపును ప్రేక్షకులు ఎలా స్వీకరిస్తారన్న దానిపై చిత్ర ఫలితం ఆధారపడి ఉంది.హరిదాస్ పాత్రలో మాసీ లుక్స్‌లో అడివి శేష్ కనిపించిన విధానం.. తన నటన.. మదనపల్లి యాసలో పలికిన సంభాషణలు అన్నీ ప్రేక్షకుల్ని అలరిస్తాయి. యాక్షన్‌తో పాటు భావోద్వేగభరిత సన్నివేశాల్లోనూ అదరగొట్టారు. తన జూలియట్‌గా సరస్వతి పాత్రలో మృణాల్ ఒదిగిన తీరు ఆకట్టుకుంటుంది. అడివి శేష్ రాసుకున్న కథలో కొత్తదనం లేదు. స్క్రీన్‌ప్లేతో తనదైన శైలిలో అక్కడక్కడా మ్యాజిక్ చేసే ప్రయత్నం చేశారు. భీమ్స్ నేపథ్య సంగీతం, పాటలు ఆకట్టుకుంటాయి. ఛాయాగ్రహణం.. నిర్మాణ విలువలు బాగున్నాయి.




# కొరియన్ కనకరాజు నుంచి కమ్సాహంనిదా' పాట ప్రోమో

మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్, దర్శకుడు మేర్లపాక గాంధీ కాంబినేషన్‌లో వస్తున్న లేటెస్ట్ క్రేజీ ప్రాజెక్ట్ 'కొరియన్ కనకరాజు' . ఇండో-కొరియన్ నేపథ్యంలో హారర్-కామెడీ జోనర్‌లో తెరకెక్కుతున్న ఈ సినిమా మ్యూజికల్ ప్రమోషన్స్‌ను చిత్ర బృందం ఘనంగా ప్రారంభించింది. ఈ చిత్రంలోని మొదటి పాట 'కమ్సాహంనిదా' ప్రోమోను తాజాగా విడుదల చేయగా, దీనికి విశేష స్పందన లభిస్తోంది. సంగీత దర్శకుడు ఎస్. థమన్, వరుణ్ తేజ్ మరియు దర్శకుడు మేర్లపాక గాంధీ మధ్య సాగే ఫన్నీ సంభాషణలతో కూడిన ఈ ప్రోమో యూట్యూబ్‌లో ట్రెండింగ్‌గా నిలిచింది. మెలోడీ కింగ్ సిద్ శ్రీరామ్ ఆలపించిన ఈ పూర్తి పాటను ఏప్రిల్ 11న విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ చిత్రంలో వరుణ్ తేజ్ సరసన రితికా నాయక్ కథానాయికగా నటిస్తుండగా, స్టార్ కమెడియన్ సత్య కీలకమైన వినోదాత్మక పాత్రలో అలరించనున్నారు. కొరియా సంస్కృతికి మరియు లోకల్ క్యారెక్టర్ అయిన కనకరాజుకు మధ్య ఉన్న విచిత్రమైన సంబంధాన్ని దర్శకుడు మేర్లపాక గాంధీ తన మార్కు వినోదంతో వెండితెరపై ఆవిష్కరించబోతున్నాడు. ఇప్పటికే మేజర్ షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం, ఆఖరి షెడ్యూల్‌ను దక్షిణ కొరియాలోని అందమైన లొకేషన్లలో పూర్తి చేసుకోబోతుంది. యూవీ క్రియేషన్స్ మరియు ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్లపై వంశీ, ప్రమోద్ మరియు విక్రమ్ ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. వరుస పరాజయాల తర్వాత వరుణ్ తేజ్ ఈ డిఫరెంట్ కథాంశంతో మళ్లీ హిట్ ట్రాక్ ఎక్కడం ఖాయమని అభిమానులు ఆశిస్తున్నారు. మనోజ్ రెడ్డి సినిమాటోగ్రఫీ అందిస్తున్న ఈ సినిమాను 2026 వేసవి కానుకగా ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నారు.




# మైఖేల్ జాక్సన్ బయోపిక్ ట్రైలర్ విడుదల విడుదల

ప్రపంచవ్యాప్తంగా సంగీత ప్రియులు ఎంతగానో ఎదురుచూస్తున్న పాప్ రారాజు మైఖేల్ జాక్సన్ బయోపిక్ 'మైఖేల్' ఫైనల్ ట్రైలర్‌ను చిత్రయూనిట్ తాజాగా విడుదల చేసింది . ఈ ప్రతిష్టాత్మక చిత్రంలో మైఖేల్ జాక్సన్ మేనల్లుడు జాఫర్ జాక్సన్ టైటిల్ రోల్ పోషిస్తుండగా, ట్రైలర్‌లో ఆయన బాడీ లాంగ్వేజ్, డ్యాన్స్ మూమెంట్స్ మరియు లుక్ అచ్చం మైఖేల్ జాక్సన్‌ను తలపిస్తుండటం విశేషం. దర్శకుడు ఆంటోయిన్ ఫుక్వా తెరకెక్కించిన ఈ ట్రైలర్‌లో 'బీట్ ఇట్', 'థ్రిల్లర్', 'బిల్లీ జీన్' వంటి ఐకానిక్ సాంగ్స్ ప్రదర్శనలతో పాటు, మైఖేల్ వ్యక్తిగత జీవితంలోని భావోద్వేగ అంశాలను, బాల్యంలో ఆయన ఎదుర్కొన్న సంఘర్షణలను మరియు వివాదాలను ఎంతో ఆకట్టుకునేలా చూపించారు. ఆస్కార్ విజేత గ్రాహమ్ కింగ్ నిర్మించిన ఈ చిత్రంలో కోల్‌మన్ డొమింగో, నియా లాంగ్, మైల్స్ టెల్లర్ వంటి హాలీవుడ్ ప్రముఖ నటీనటులు కీలక పాత్రలు పోషించారు. కేవలం ఒక సంగీత ప్రయాణంలా కాకుండా, ఒక లెజెండరీ స్టార్ జీవితంలోని ఎత్తుపల్లాలను ఆవిష్కరించే ఈ చిత్రంపై ప్రపంచవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. అన్ని హంగులతో రూపుదిద్దుకున్న ఈ చిత్రం ఏప్రిల్ 24న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా థియేటర్లలో విడుదల కానుంది.

# దసరాకు ఫౌజీ

ఈ ఏడాది ఆరంభంలో రాజాసాబ్‌తో ఫ్లాప్ ఇచ్చిన రెబల్ స్టార్ ప్రభాస్.. ఇదే ఏడాదిలో సాలిడ్ హిట్ ఇవ్వాలని డిసైడ్ అయ్యాడు. ప్రభాస్ నుంచి 'ఫౌజీ' సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. సీతారామం తర్వాత దర్శకుడు హను రాఘవపూడి తెరకెక్కిస్తున్న ఈ సినిమా సెకండ్ వరల్డ్ వార్ బ్యాక్ డ్రాప్‌లో రూపొందుతోంది. ఇప్పటికే మేజర్ పార్ట్ షూటింగ్ కంప్లీట్ చేసుకుంది. అఫీషియల్‌గా ప్రకటించనప్పటికీ.. వచ్చే దసరాకు ఫౌజీని విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు మేకర్స్. కానీ ఈ ఏడాది డిసెంబరు పోస్ట్‌పోన్ అయ్యే ఛాన్స్ ఉందనే టాక్ వినిపిస్తోంది. అయితే చిత్ర యూనిట్ మాత్రం ఈ సినిమాను ముందుగా అనుకున్న సమయానికే ప్రేక్షకులకు అందించాలని పట్టుదలతో ఉంది. ఇందుకోసం నిర్మాణ పనులను ముమ్మరం చేస్తూ ఏకకాలంలో షూటింగ్‌ను పూర్తి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేసింది. షెడ్యూల్ ప్రకారం సినిమాను పూర్తి చేయడం కోసం మేకర్స్ 'సెకండ్ యూనిట్'ను కూడా రంగంలోకి దించినట్టుగా తెలుస్తోంది.




# ఇప్పుడే మొదలెట్టినట్లుంది

"దక్షిణాది ప్రేక్షకులు నా పట్ల ఎప్పుడూ ఎంతో ప్రేమతో ఉంటున్నారు. నన్ను వాళ్ల కుటుంబంలోని వ్యక్తిలా ఆదరించారు. ఇది నాలో కొత్త ఉత్సాహాన్ని నింపుతుంది" అంటోంది తమన్నా. ఓవైపు మహిళా ప్రాధాన్య చిత్రాలు, మరోవైపు ఓటీటీ కథలు.. ప్రత్యేక పాటలు.. ఇలా ఎదురొచ్చిన అవకాశాన్ని అందుకుంటూ అభిమానుల్ని ఆకట్టుకునే ప్రయత్నం చేస్తుందీమె. ఈ మధ్యే సినీరంగంలో 21ఏళ్లు పూర్తి చేసుకుంది. ఈ నేపథ్యంలోనే ఇటీవలే ఓ కార్యక్రమంలో పాల్గొన్న తమన్నా మాట్లాడుతూ.. "ప్రస్తుతం నేను నటించిన చిత్రాలన్నీ ఒక్కొక్కటిగా విడుదల కాబోతున్నందుకు ఉత్సాహంగా ఉన్నా. చాలా మంది నటీనటులకు.. ముఖ్యంగా నటీమణులకు ఇలాంటి అవకాశం లభించదు. నా కెరీర్ మొదలై దాదాపు 21ఏళ్లు అయ్యింది. అయినా ఇప్పుడే మళ్లీ ప్రారంభిస్తున్నట్లుగా ఉంది. దక్షిణాది పరిశ్రమలో లభిస్తున్న ఆదరణ నాకు మరింత ఉత్తేజాన్ని కలిగిస్తుంది. అందుకే నేను కూడా వారిని కొత్త కథలు, ప్రయోగాత్మక చిత్రాలతో అలరించాలని భావిస్తున్నాన"ని చెప్పుకొచ్చింది.



Printed, Published by **Mohammed Murthuza.** Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNVERSITY ROAD,HYDERABAD. PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net Mobile No. **98660 19778, 89789 60131**



# మాచర్ల రేప్‌కేసులో ఊహించని మలుపు!

**గుర్తుతెలియని వ్యక్తి కాదు.. స్నాప్‌చాట్ ప్రియుడే నిందితుడు**

**గూగుల్ మ్యాప్స్ పంపి ఇంటికి పిలిచిన బాధితురాలు..**

**పోలీసుల దర్యాప్తులో విస్తుపోయే నిజాలు**

**మాచర్ల, ఏప్రిల్ 10 :** పల్నాడు జిల్లా మాచర్లలో ప్రభుత్వ ఉద్యోగినిపై జరిగిన అత్యాచారం కేసులో పోలీసుల దర్యాప్తులో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. తొలుత గుర్తుతెలియని వ్యక్తి తనపై దాడి చేశాడని బాధితురాలు ఫిర్యాదు చేయగా, సాంకేతిక ఆధారాలతో విచారణ చేపట్టిన పోలీసులకు అది ఆమెకు పరిచయమున్న వ్యక్తేనని తేలింది. మాచర్లలోని ఒక ప్రభుత్వ కార్యాలయంలో ఆఫీస్ సబార్డినేట్‌గా పనిచేస్తున్న మహిళ, ఈ నెల 2న తనపై అత్యాచారం జరిగిందని పోలీసులకు ఫిర్యాదు చేసింది. మంచినీళ్ల నెపంతో ఇంట్లోకి వచ్చిన ఒక అపరిచితుడు తనపై ఈ దారుణానికి పాల్పడ్డాడని ఆమె పేర్కొంది. అయితే, కేసును సీరియస్‌గా తీసుకున్న పోలీసులు సీసీటీవీ ఫుటేజీలు, బాధితురాలి మొబైల్ ఫోన్ డేటాను విశ్లేషించగా అసలు కథ బయటపడింది.

**స్నాప్‌చాట్ పరిచయం.. గూగుల్ మ్యాప్స్ లొకేషన్**

గతంలో రెండు వివాహాలై విడాకులు తీసుకున్న బాధితురాలు ప్రస్తుతం ఒంటరిగా నివసిస్తోంది. ఈ క్రమంలో రాజుపాలెం మండలానికి చెందిన నామాల శ్రీనివాస్ అనే వ్యక్తితో ఆమెకు స్నాప్‌చాట్ ద్వారా పరిచయం ఏర్పడింది. ఘటన జరిగిన రోజు బాధితురాలే స్వయంగా తన ఇంటి గూగుల్ మ్యాప్స్ లొకేషన్‌ను శ్రీనివాస్‌కు పంపి ఇంటికి ఆహ్వానించింది. ఇంటికి వచ్చిన శ్రీనివాస్ ఆమెపై బలవంతం చేయబోగా, ఆమె ప్రతిఘటించింది. దీంతో ఆగ్రహించిన నిందితుడు ఆమె చేతులు, కాళ్లు కట్టేసి అమానుషంగా అత్యాచారానికి పాల్పడి అక్కడి నుండి పరారయ్యాడు. నిందితుడు తనకు తెలిసిన వాడేనన్న విషయాన్ని దాచిపెట్టి, ఎవరో గుర్తుతెలియని వ్యక్తి అని చెప్పి బాధితురాలు పోలీసులను తప్పుదోవ పట్టించిందని జిల్లా ఎస్పీ కృష్ణారావు తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానంతో నిందితుడిని గుర్తించిన పోలీసులు, ఈ నెల 8న మాచర్ల రైల్వే స్టేషన్ వద్ద శ్రీనివాస్‌ను అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు నిందితుడిని గురువారం స్థానిక కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం అతడికి 14 రోజుల రిమాండ్ విధించింది. దీంతో నిందితుడిని జైలుకు తరలించారు. సోషల్ మీడియా పరిచయాల పట్ల మహిళలు అప్రమత్తంగా ఉండాలని ఈ సందర్భంగా పోలీసులు సూచించారు.

# గల్ఫ్ నుంచి తెలుగు వారి కోసం ఫ్లైట్

**ముందుకు వచ్చిన జజీర ఎయిర్ లైన్స్**

**విజయవాడ, ఏప్రిల్ 10:** పశ్చిమాసియాలో యుద్ధంతో గల్ఫ్‌లో చిక్కుకుపోయిన తెలుగువారు స్వదేశానికి రావడానికి కొత్త విమాన సర్వీసులు అందుబాటులోకి వస్తున్నాయి. యుద్ధానికి రెండు వారాల పాటు విరామం లభించడంతో సౌదీ అరేబియాలోని దమ్మామ్ నుంచి, విజయవాడ మధ్య రిలీఫ్ ఫ్లైట్స్ నడపడానికి జజీరా ఎయిల్‌లైన్స్ సిద్ధమైంది. ఈనెల 13 నుంచి 29 వరకు ఆ ప్రత్యేక సర్వీసులు నడపనుంది. ఈ మేరకు విజయవాడ విమానాశ్రయ అధికారులకు సమాచారం ఇవ్వటంతో పాటు స్లాట్‌ను బుక్ చేసుకుంది. సోమ, బుధ, శుక్రవారాల్లో ఆ విమానాలు నడుస్తాయి. ఎయిర్‌పోర్టు అధికారులకు ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం విజయవాడ, దమ్మామ్‌ల మధ్యనే విమానాలు నడుస్తాయి. దమ్మామ్‌కు చేరాక అక్కడి నుంచి కువైట్‌కు కూడా ఈ సర్వీసులు వెళ్లనున్నట్టు తెలుస్తోంది.

# రిటైర్డ్ ఉద్యోగులకు గుడ్‌న్యూస్

**ఒక్కరోజే రూ. 2,950 కోట్ల బకాయిల విడుదల..**

**గ్రాట్యుటీ, సరెండర్ లీవ్ బిల్లుల క్లియరెన్స్‌కు సీఎం గ్రీన్ సిగ్నల్..**

**హర్షం వ్యక్తం చేస్తున్న విశ్రాంత ఉద్యోగులు**

**అమరావతి, ఏప్రిల్ 10 :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు కూటమి ప్రభుత్వం భారీ తీపి కబురు అందించింది. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న బకాయిలను విడుదల చేసే ప్రక్రియను ప్రభుత్వం వేగవంతం చేసింది. ఇందులో భాగంగా నిన్న ఒక్కరోజే ఏకంగా రూ. 2,950 కోట్లను విడుదల చేస్తూ ఆర్థిక శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు రావాల్సిన గ్రాట్యుటీ, సరెండర్ లీవ్ బిల్లుల కోసం ఈ భారీ మొత్తాన్ని కేటాయించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ పర్యవేక్షణలో ఈ నిధులు నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ అవుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా సుమారు రూ. 7,059 కోట్లకు పైగా ఉన్న పెండింగ్ బిల్లులను దశలవారీగా చెల్లించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. గ్రాట్యుటీ, సరెండర్ లీవ్ బిల్లులకు రూ. 2,950 కోట్లు, ఇప్పటికే రూ. 1,848 కోట్లు పీఎఫ్ బకాయిలు ఖాతాల్లో జమ అయ్యాయి. 4,793 మందికి గ్రూప్ లైఫ్ ఇన్స్యూరెన్స్ కోసం రూ. 76 కోట్లు చెల్లింపు, పోలీసు శాఖలో అదనపు సరెండర్ లీవుల కోసం రూ. 223 కోట్లు విడుదల చేసింది. చిన్న తరహా కాంట్రాక్టర్లకు సంబంధించి రూ. 614 కోట్ల బిల్లులు క్లియర్ చేసింది. ప్రభుత్వం ఇంకా చెల్లించాల్సిన గ్రాట్యుటీ బకాయిలు రూ. 3,411 కోట్లు, విశ్రాంత ఉద్యోగుల లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ కింద రూ. 1,800 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. వీటిని కూడా ప్రాధాన్యత క్రమంలో విడుదల చేసేందుకు ఆర్థిక శాఖ కసరత్తు చేస్తోంది. ప్రస్తుతం సర్వీసులో ఉన్న పోలీసు ఉద్యోగుల సరెండర్ లీవ్ బిల్లుల ప్రక్రియ కూడా వేగంగా సాగుతోంది. గత కొన్నేళ్లుగా తమ రిటైర్మెంట్ బెనిఫిట్స్ కోసం ఎదురుచూస్తున్న విశ్రాంత ఉద్యోగులు ప్రభుత్వ నిర్ణయంపై హర్షం వ్యక్తం చేస్తున్నారు. తమ ఆర్థిక ఇబ్బందులను గుర్తించి బకాయిలు విడుదల చేసినందుకు ముఖ్యమంత్రికి, ప్రభుత్వానికి విశ్రాంత ఉద్యోగుల సంఘాలు ధన్యవాదాలు తెలిపాయి.

# రాయలసీమ ప్రాజెక్టులను చంపేసిన వైసీపీ

- ఇప్పుడేమో మొసలి కన్నీరా
- ఎవరి హయాంలో ఎంత ఖర్చు చేశారో చర్చకు సిద్ధమా?
- మంత్రి పయ్యావుల కేశవ్ సవాల్




**అమరావతి, ఏప్రిల్ 10:** రాయలసీమ పేరును వైకాపా రాజకీయం కోసమే వాడుకుందని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. రాయలసీమలోని ప్రాజెక్టును చంపేసిన వైకాపా నాయకులు.. మొసలి కన్నీరు కార్చడం విడ్డూరమన్నారు. వైకాపా హయాంలో ఆగిన ప్రాజెక్టును తామెలా ఆపగలమని ప్రశ్నించారు. తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి మాటలను వైకాపా నేతలు వక్రీకరిస్తున్నారని మండిపడ్డారు. ప్రాజెక్టును ఆపింది తామేనన్న బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు మాటలకు ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. రాయలసీమకు ఎవరి హయాంలో ఎంత ఖర్చు చేశారో చర్చకు సిద్ధమా? అని సవాల్ విసిరారు. మరోవైపు జగన్ నైజం చూసి.. బొత్సకు భయంతో కూడిన బాధ వచ్చిందని మంత్రి పయ్యావుల కేశవ్ ఎద్దేవా చేశారు. బొత్స అన్న మాటలు గుర్తు చేయడం అచ్చెన్నాయుడి తప్పా అని ప్రశ్నించారు. వైఎస్ మరణం, బాబాయ్ వివేకా హత్యలో అంతిమ లబ్దిదారు జగన్ కాదా అని వ్యాఖ్యానించారు. రాజకీయ అవసరాల కోసమే రాయలసీమను వైసీపీ వాడుకుంటుందని పయ్యావుల కేశవ్ విమర్శించారు. వైసీపీ హయాంలో రాయలసీమకు ఎంత ఖర్చు పెట్టారో ఆ పార్టీ నేతలు చెప్పాలన్నారు. రాయలసీమ మేలు కోసం వైసీపీ ఏం చేసిందో చెప్పాలని డిమాండ్ చేశారు. రాయలసీమపై పెట్టిన ఖర్చుపై చర్చకు సిద్ధమా? అంటూ ఆ పార్టీ నేతలకు ఆయన సవాల్ విసిరారు. రాయలసీమలో హార్టికల్చర్ హబ్ పెడతామని చెప్పాం.. తాము చేస్తామని స్పష్టం చేశారు. రాయలసీమ లిఫ్ట్‌పై స్టే విధిస్తే.. వైసీపీ ఏం చేసిందని ప్రశ్నించారు. వివాదాలు సృష్టించేందుకే వైసీపీ-బీఆర్ఎస్ కుట్రలని మండిపడ్డారు. అన్నమయ్య డ్యాం కొట్టుకుపోతే ఏం చేశారంటూ ఆ పార్టీ నేతలను ఈ సందర్భంగా పయ్యావుల కేశవ్ నిలదీశారు. వైసీపీ మొసలి కన్నీరును ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడి వ్యాఖ్యల్లో తప్పేముందని వైసీపీ నేతలను మంత్రి పయ్యావుల ప్రశ్నించారు. గతంలో బొత్స చెప్పిన మాటలనే మళ్లీ అచ్చెన్నాయుడు గుర్తు చేశారన్నారు. మీరు చెప్పిన మాటలనే గుర్తు చేస్తే.. ఉలుకెందుకు? అంటూ బొత్సను నిలదీశారు. జగన్ నైజం చూసి బొత్స సత్యనారాయణ బాధపడక ఏం చేస్తారు? అంటూ ఎద్దేవా చేశారు. భయంతో బొత్సకు బాధ కలిగిందేమో? అని వ్యంగ్యంగా అన్నారు. గుండెపోటు నుంచి గొడ్డలిపోటు వరకు.. తండ్రి మరణం నుంచి బాబాయ్ హత్య వరకు.. తల్లి విజయలక్ష్మి నుంచి చెల్లి షర్మిల ఆస్తి తగాదా వరకు.. జగన్ నైజమేంటో ప్రజలకు స్పష్టంగా తెలుసునని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు.

# కడపలో ప్రేమోన్మాది ఘాతుకం

**బాలిక గొంతు కోసి హత్య**

**కడప, ఏప్రిల్ 10 :** కడప జిల్లా ఖాజీపేట మండలంలో మనసును కలచివేసే దారుణ ఘటన జరిగింది. ప్రేమ పేరుతో వెంటపడి, చివరకు బాలిక ప్రాణాలనే బలిగొన్న ఓ ప్రేమోన్మాది ఘాతుకం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. ప్రేమించలేదనే కోపంతో ఓ ఉన్మాది రెచ్చిపోయాడు. తనను పెళ్లి చేసుకోవడానికి నిరాకరించిందనే కక్షతో ఓ బాలికను అత్యంత దారుణంగా గొంతు కోసి హతమార్చాడు. ఈ ఘటన ఖాజీపేట మండల పరిధిలో చోటుచేసుకుంది. ఈ ఘటనపై కడప జిల్లా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కడప జిల్లాలోని ఖాజీపేట మండలం ఆంజనేయకొట్టాలు గ్రామానికి చెందిన ఆవుల వెంకటేశ్ అనే యువకుడు, అదే మండలం ఖాజీపేట అగ్రహారానికి చెందిన ఓ బాలికను కొంతకాలంగా ప్రేమ పేరుతో వేధిస్తున్నాడు. ఆమెను పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి చేసేవాడు. అయితే, అందుకు బాలిక నిరాకరించడంతో ఆమెపై కక్ష పెంచుకున్నాడు. శుక్రవారం నాడు బాలిక ఒంటరిగా ఉన్న సమయం చూసి వెంకటేశ్ ఆమెపై దాడికి



దిగాడు. తన వెంట తెచ్చుకున్న పదునైన ఆయుధంతో బాలిక గొంతు కోశాడు. తీవ్ర రక్తస్రావంతో కుప్పకూలిన ఆమెను స్థానికులు, కుటుంబ సభ్యులు గమనించారు. హుటాహుటిన బాలికను చికిత్స నిమిత్తం కడప రిమ్స్ ఆస్పత్రికి తరలించే ప్రయత్నం చేశారు. గాయం తీవ్రత ఎక్కువగా ఉండటంతో, ఆస్పత్రికి చేరుకోకముందే బాలిక మార్గమధ్యంలోనే ప్రాణాలు విడిచింది. నిండు నూరేళ్ల భవిష్యత్తు ఉన్న బాలిక ఇలా ఉన్మాది చేతిలో బలికావడంపై బంధువులు, స్థానికులు కన్నీరుమున్నీరవుతున్నారు.

**పోలీసుల అదుపులో నిందితుడు..**

ఈ ఘటనపై సమాచారం అందుకున్న ఖాజీపేట పోలీసులు వెంటనే రంగంలోకి దిగారు. పరారీలో ఉన్న ప్రేమోన్మాది ఆవుల వెంకటేశ్‌ను గాలించి, స్వల్ప వ్యవధిలోనే అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిపై హత్య కేసు, హత్యకు గురైన బాలిక మైనర్ కావడంతో పోక్సో చట్టం కింద చర్యలు తీసుకునే దిశగా పోలీసులు విచారణ జరుపుతున్నారు. ఈ హత్య వార్త తెలియడంతో ఖాజీపేట అగ్రహారం, ఆంజనేయకొట్టాలు గ్రామాల్లో ఉద్రిక్తత నెలకొంది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భద్రతను పర్యవేక్షిస్తున్నారు. ప్రేమ పేరుతో యువతులపై జరుగుతున్న ఇలాంటి దాడులు సమాజానికి ఆందోళన కలిగిస్తున్నాయని పలువురు అంటున్నారు. మైనర్ల భద్రత విషయంలో తల్లిదండ్రులు, ప్రభుత్వం మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని పలువురు చెబుతున్నారు. నిందితుడికి కఠిన శిక్ష పడాలని బాధితురాలి కుటుంబ సభ్యులు డిమాండ్ చేస్తున్నారు.

# మహిళల జోలికొస్తే అదే చివరి రోజు

**కడప జిల్లాలో విద్యార్థిని హత్యపై మంత్రి సవిత దిగ్భ్రాంతి**

**నిందితుడిని కఠినంగా శిక్షిస్తామని హెచ్చరిక**

**కడప:** జిల్లాలో విద్యార్థిని హత్య కేసు ఉదంతం ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. ఓ బాలికను ప్రేమోన్మాది అత్యంత పాశవికంగా గొంతు కోసి హతమార్చడం ప్రకంపనలు సృష్టిస్తోంది. ఈ ఘటనపై ఏపీ మంత్రి సవిత తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రేమపేరుతో బాలికను హత్య చేశాడని తెలుసుకుని ఆమె ఆవేదనకు గురయ్యారు. విద్యార్థిని హత్య అత్యంత బాధాకరమని మంత్రి అన్నారు. ఎంతో భవిష్యత్తు కలిగిన బాలిక హత్యకు గురికావడం మనసును కలిచివేస్తోందని చెప్పారు. బాలిక కుటుంబానికి కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని.. నిందితుడిని కఠినంగా శిక్షిస్తామని హామీ ఇచ్చారు. ఇంకెవరూ మహిళల వైపు కన్నెత్తి చూడకుండా ఉండేలా శిక్షిస్తామని బాధిత కుటుంబానికి మంత్రి సవిత భరోసా కల్పించారు. నిందితుడు ఎంతటి వాడైనా ఉపేక్షించే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. మహిళలు, బాలికల పట్ల ఉన్మాదుల్లా వ్యవహరిస్తే ఉక్కుపాదంతో అణిచివేస్తామని హెచ్చరించారు. మహిళలపై సైకోల్లా ప్రవర్తిస్తే వారికి అదే చివరి రోజు అవుతుందని ఆగ్రహించారు. కూటమిది మహిళా పక్షపాత ప్రభుత్వమని అన్నారు. యువత బాధ్యతతో మెలగాలని.. డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని హితవుపలికారు. మగ పిల్లల ప్రవర్తనపై తల్లిదండ్రులు ఓ కన్నేసి ఉంచాలని మంత్రి సవిత విజ్ఞప్తి చేశారు. ఈ ఘటన కడప జిల్లా ఖాజీపేట మండలంలో జరిగింది. ఆంజనేయకొట్టాలు గ్రామానికి చెందిన ఆవుల వెంకటేశ్, అదే మండలంలోని



మరో గ్రామానికి చెందిన బాలికను ప్రేమపేరుతో వేధించాడు. పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి చేశాడు. ఆమె నిరాకరించడంతో గొంతు కోసి మరీ దారుణంగా హతమార్చాడు. హత్య అనంతరం గంటల వ్యవధిలోనే నిందితుడు వెంకటేశ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఘటనతో రెండు గ్రామాల్లో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

# ప్రారంభోత్సవానికి భోగాపురం రెడీ

- జూలైలో ప్రారంభోత్సవానికి తేదీలు ఖరారు
- జూలై 5 లేదా 8న డేట్లు ఫిక్స్
- ప్రారంభోత్సవానికి ప్రధానికి ఆహ్వానం

**విశాఖపట్నం, ఏప్రిల్ 10:** ఉత్తరాంధ్ర ప్రజల దశాబ్దాల కల, ఏపీ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవానికి ముహూర్తం ఖరారైంది. జూలై మొదటి వారంలో ఈ విమానాశ్రయం ప్రారంభం కానుండటంతో ఉత్తరాంధ్ర రూపురేఖలు మారిపోనున్నాయి. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం పనులు తుది దశకు చేరుకున్నాయి. జూలై 5వ తేదీ లేదా 8వ తేదీన ఈ విమానాశ్రయాన్ని ప్రారంభించాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిర్ణయించారు. ఈ విమానాశ్రయ ప్రారంభోత్సవానికి రావాల్సిందిగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఇప్పటికే ఆహ్వానం పంపారు. మోదీ షెడ్యూల్ ఆధారంగా జూలై 5వ తేదీ లేదా 8వ తేదీల్లో ఒకటి ఖరారు కానుంది. జూన్ 30వ తేదీ కల్లా మిగిలిన అన్ని పనులను పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకోసం అదనపు సిబ్బందిని మోహరించి రాత్రింబవళ్లు పనులు కొనసాగిస్తున్నారు. అంతర్జాతీయ విమానాల రాకపోకల కోసం అవసరమైన ఇమ్మిగ్రేషన్ స్టేటస్ నోటిఫికేషన్‌ను త్వరగా పూర్తి చేయాలని సీఎం చంద్రబాబు కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే ఈ విమానాశ్రయాన్ని కస్టమ్స్ ఎయిర్‌పోర్ట్‌గా కేంద్రం నోటిఫై చేసింది. విమానాశ్రయానికి వెళ్లే ప్రయాణికులకు ట్రాఫిక్ కష్టాలు లేకుండా ప్రభుత్వం భారీ ప్రణాళికలు సిద్ధం చేసింది. విశాఖపట్నం నుంచి భోగాపురం వెళ్లే మార్గంలో అత్యంత రద్దీగా ఉండే ఆనందపురం జంక్షన్ వద్ద ట్రాఫిక్ సమస్యను పరిష్కరించడానికి ఫ్లైఓవర్ అలైన్‌మెంట్‌ను ఖరారు చేశారు. దీనికి సంబంధించిన డీపీఆర్ 45 రోజుల్లో సిద్ధం కానుంది. భోగాపురం వరకు మెట్రో సౌకర్యాన్ని కల్పించేందుకు సంస్థ సవరించిన డీపీఆర్‌ను సిద్ధం చేస్తోంది. ఇది డబుల్ డెక్కర్ మోడల్‌లో ఉండబోతోంది (కింద రోడ్డు, పైన మెట్రో). విశాఖ స్టీల్ ప్లాంట్ నుంచి భోగాపురం వరకు ఈ కారిడార్ విస్తరించనుంది. రోడ్ నంబర్ 12, 14 పనుల కోసం అటవీ, రక్షణ శాఖల అనుమతులను వేగవంతం చేశారు. తీర ప్రాంతం వెంట విశాఖను భోగాపురంతో కలిపే ప్రత్యేక కోస్టల్ కారిడార్ పనులు కూడా ఊపందుకున్నాయి. భోగాపురం ఎయిరోసిటీ, ఐటీ హబ్స్, లాజిస్టిక్ పార్కుల వల్ల ఈ ప్రాంతంలో వేలాది మందికి ఉపాధి లభించనుంది. అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ఈ విమానాశ్రయం వల్ల ఉత్తరాంధ్రలోని పర్యాటక ప్రాంతాలకు అంతర్జాతీయ గుర్తింపు లభిస్తుంది. ఫార్మా, మత్స్య పరిశ్రమల ఎగుమతులకు ఈ విమానాశ్రయం



కేంద్ర బిందువుగా మారనుంది. భోగాపురం ఎయిర్ పోర్టు, మూలపేట గ్రీన్ ఫీల్డ్ పోర్టు త్వరలో పూర్తవుతాయని కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు వ్యాఖ్యానించారు. కేంద్రప్రభుత్వ సహకారంతో ఏపీ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. భోగాపురం ఎయిర్ పోర్టు జూలై మొదటి వారంలో ప్రారంభించటానికి చర్యలు చేపట్టామని తెలిపారు. ఉత్తరాంధ్ర ప్రాంతానికి ఇదో మైలు రాయని ఉద్ఘాటించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేతుల మీదుగా భోగాపురం ఎయిర్ పోర్టు ప్రారంభించటానికి ప్రయత్నిస్తున్నామని రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు.